ఆంధ్రపత్రిక

సచిత్ర వారపత్రిక



25 నయాపైసలు

ANDHRA PATRIKA



రతీదేవి

[బేలూరు శిల్పం; ఫొటో: జి. రామమూర్తి]

సంవత్సర చందా
రు. 13-0-0
విడిపత్రిక 25న.పై.

ఆంధ్రపత్రిక

సచిత్ర వారపత్రిక

సంపుటము 52
సంచిక 22
22-1-58

Founder : K. NAGESWARA RAO

హేవిళంబి పుష్య, శుద్ధ తృతీయ బుధవారం

★ విషయానుక్రమణిక ★


★

ముఖచిత్రం:

హిందీతార మీనాకుమారి

షేక్ అబ్దుల్లా	3
న్యూఢిల్లీ లేఖ	4
ఆంధ్ర మహాభారతము	6
ధర్మయుద్ధం—"సీతాదేవి"	10
దగాపడిన తమ్ముడు—బలివాడ కాంతారావు	13
భీష్ముడి పెళ్ళి—'రాజేంద్ర'	17
అడ్డుదారి—మధురాంతకం రాజారాం	22
ఆంధ్రనామ (వైపరీత్య) సంగ్రహము—మండపాక రాజేశ్వరశాస్త్రి	26
చిరిగిపోయిన కథ—కుమారి ఎం. జానకీరాణి	28
నక్షత్రఫలితాలు—బి. నరసింగరావు	32
వనితాలోకం—పవని నిర్మల ప్రభావతి	35
అమ్మలక్కలు—కె. యస్. ఆర్. రాణి	36
త్యాగరాజస్వామి—పి. ఆదిలక్ష్మి	39
వంటలు	41
బాలవియ్యము—కనుపర్తి వరలక్ష్మమ్మ	43
శని-శివుడు—సుందరపు పద్మ, లలిత	44
మౌనమే అంగీకారం—చావలి సాంబశివరావు	45
కష్టార్జితం—పి. సుబ్బారావుశాస్త్రి	47
సినిమా	50

షేక్ అబ్దుల్లా



కాశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి షేక్ అబ్దుల్లాను బక్షీగులాం మహమ్మద్ ప్రభుత్వం ఈ నెల 8-వ తేదీ సాయంత్రం 5 గంటలకు విడుదల చేసింది. ఈ విడుదల జరిగిన నాలుగు రోజులకే సమితి ప్రతినిధిగా భారత పాకిస్తాన్ ప్రభుత్వాలతో కాశ్మీర్ సమస్యపై సమాలోచనలు జరపడానికి డాక్టర్ గ్రాహం ఢిల్లీకి వేంచేశాడు. సమితి ప్రతినిధి రాకకు, షేక్ అబ్దుల్లా విడుదలకు ఏదైనా సంబంధం వున్నదో లేదో చెప్పలేముగాని, ఇవి రెండూ ఇంచుమించు ఒకేసారి జరిగినవి. సరిగ్గా 58 నెలలపాటు నిర్బంధంలో వున్న అబ్దుల్లాకు విముక్తి చేకూరింది. ఇకమీద అతడు స్వేచ్ఛగా సంచరించవచ్చు. అబ్దుల్లాతోపాటు అలీషా, సూఫీ మహమ్మద్ అనే మరిద్దరు నిర్బంధితులను కూడా కాశ్మీర్ ప్రభుత్వం విడుదలచేసింది. వీరిలో అలీషా అనే అతడు అబ్దుల్లా మంత్రివర్గంలో డిప్యూటీ మంత్రిగా పనిచేశాడు. సూఫీ మహమ్మద్ ఇదివరలో భారత పార్లమెంటుసభ్యుడు. విడుదల ఉత్తర్వును చేతికి అందిస్తూనే, వీరు ముగ్గురూ వెంటనే కుద్ నుంచి (నిర్బంధంలోవుంచిన పటణం) శ్రీనగర్ కు (140 మైళ్ళు) ప్రయాణమై వెళ్ళడానికి అవసరమైన సౌకర్యాలన్నిటినీ బక్షీ ప్రభుత్వం కలుగజేసింది. ప్రయాణానికి ప్రభుత్వ వాహనాలు సిద్ధంగా వున్నవని చెప్పడమేకాకుండా దారి ఖర్చులకని ఒక వందరూపాయలు కూడా ఇచ్చింది. ఇంతేగాక, నిర్బంధంలోవున్న గత నాలుగున్నరసంవత్సరాలనుంచీ కాశ్మీర్ ప్రభుత్వం అబ్దుల్లా కుటుంబానికి నెలకు వెయ్యిరూపాయల చొప్పున ఇచ్చి సహాయపడింది. దారి ఖర్చుకిచ్చిన డబ్బయితే పుచ్చుకున్నారుగాని ప్రభుత్వ వాహనాలలో వెంటనే శ్రీనగర్ కు ప్రయాణమై వెళ్ళడానికిమాత్రం వీరు ఒప్పుకోలేదు. స్వస్థానమైన శ్రీనగర్ కు అపరాత్రి చేరుకుంటే తమకు యథోచిత స్వాగత మర్యాదలు జరగక పోవచ్చునన్న భయమే ఇందుకు కారణమేమో తెలియదు. విడుదలైన తర్వాత, నాల్గురోజుల పాటు కుద్ లోని రహదారి బంగళాలోనే మకాంవేసి 12 వ తేదీకిగాని అబ్దుల్లాబృందం శ్రీనగర్ కు చేరుకోలేదు. నాల్గురోజుల వ్యవధిఇచ్చి చేరుకున్నప్పటికీ కాశ్మీర్ రాజధానిలో వారికి చెప్పుకోదగిన స్వాగత సన్నాహాలేవీ జరగలేదు. ఇకముందు జరుగుతవని కూడా చెప్పలేము.

కాశ్మీర్ భారతసమాఖ్యలో అంతర్భాగమనీ, అది కాశ్మీర్ ప్రజల అప్రతిహత నిర్ణయమనీ వాదిస్తూ వచ్చిన షేక్ అబ్దుల్లా హఠాత్తుగా ధోరణిమార్చుకొని కాశ్మీర్ కు ఇటు భారతదేశంతో గాని, అటు పాకిస్తాన్ తో గాని సంబంధంలేని ఒక సర్వస్వతంత్ర ప్రతిపత్తి అవసరమనే కొత్త ప్రతిపాదనను లేవదీయడంతో 1953 ఆగస్టు 9 వ తేదీన అతడిని పదవీభ్రష్టుణ్ణి చేయడమేగాక ప్రభుత్వం నిర్బంధంలోకూడా వుంచవలసి వచ్చింది. ఈ ప్రతిపాదన చేయడంలో కొన్ని విదేశాలకు ప్రమేయం వున్నదనికూడా బాహ్యప్రపంచం అనుమానపడడం జరిగింది.

భారతదేశ అంతర్భాగంగా గతనాలుగున్నర సంవత్సరాలలో బక్షీ నాయకత్వాన కాశ్మీర్ సాధించిన అభ్యుదయాన్ని ఇప్పుడు ప్రత్యక్షంగాచూసిఅయినా అబ్దుల్లా తన ప్రతిపాదన ఎంత అవివేకంతో కూడినదో గ్రహిస్తాడనే ఆశించవచ్చు; తానుకన్న కలలు కేవలం పగటికలలే నని ఇప్పటికైనా తెలుసుకోవచ్చు.

ప్రమాదభరితమైన తనవైఖరిని మార్చుకొని అబ్దుల్లా తనకు ఇప్పుడు లభించిన స్వేచ్ఛను సద్వినియోగమే చేసుకుంటాడో, లేక దుర్వినియోగమే చేస్తాడో ముందు ముందుగాని స్పష్టంకాదు. ★


వచ్చే సంచికలో ప్రత్యేక ఆకర్షణ!

★

హైదరాబాదు నవ్యసాహితీసమితి సమావేశంలో చదివిన మూడు మంచి కథలు

★

1 అడుగడుక్కీ.... .... [కొమ్మూరి వేణుగోపాలరావు]
2 అభావాలు .... [ఇసుకపల్లి లక్ష్మీనరసింహశాస్త్రి]
3 హాస్యరచయిత మరణించాడు! .... [తురగా కృష్ణమోహన్‌రావు]



రాజధానికి విదేశీ అతిథులు

ఇటీవల భారత రాజధానికి అటునించీ, ఇటునించీ విదేశీ అతిథులు పలువురు విచ్చేశారు.

బ్రిటిష్ ప్రధాని మాక్మిలన్ సతీ సమేతులై వచ్చారు. ఆయనకు మర్యాదలూ, అవి చాలా చక్కగా జరిగాయి. పూర్వంలాగ ఆక్రమణ చిహ్నంగా కాక స్నేహ చిహ్నంగా, బ్రిటిష్ పతాకాలు విరివిగా ఎగిరాయి.

చెకస్లొవాకియా ప్రధాని స్నేహ రాయబారిగా భారతదేశం వచ్చారు. వీరిరాక ఉభయదేశాల సుహృద్భావాన్ని పెంపొందించింది.

ఇక ఇండోనీషియా అధ్యక్షుడు భిక్షా యాత్రికుడుగా తమ ప్రభుత్వాన్ని సమర్థించవలసిందిగా అడగటానికి వచ్చారు. అసలు ఇండోనీషియా విషయంలో భారత వైఖరిని ఎవరూ సరిగా అర్థం చేసుకోలేదు. భారతదేశం తాను సామ్రాజ్యవాద వ్యతిరేకి అని ప్రకటించటం బాగానే ఉంది. కాని ఈ ప్రకటన అన్నిరకాల సామ్రాజ్యవాదాలకూ వర్తించాలి. నిజానికి భారతవైఖరి పాశ్చాత్య రాజ్యాలను నిరసించటంగానూ, ఆసియా దేశాల సామ్రాజ్యవాదాన్ని పట్టించుకోక పోవటంగానూ అమలు జరుగుతోంది.

ఆసియానుంచి, ఆఫ్రికానుంచి యూరోపియన్లు తమంతటతాము కదలక పోతే, వాళ్ళని వెళ్ళగొట్టాలనటం సబబే. డచ్చివారు న్యూగినీనుంచి నిష్క్రమించాల్సిందే. కాని న్యూగినీమీద ఇండోనీషియన్లకు ఏమి హక్కు ఉన్నదని వారి వాదాన్ని బలపరచటం? ఒకరి వలస పరిపాలనను తొలగించి మరొకరి వలస పరిపాలనను నెలకొల్పటమే గదా దీనివల్ల జరిగేది? అసలు ఇందులో న్యాయాన్యాయాలు అలావుంచి, సుకర్నో ప్రభుత్వం ఏ మాత్రం స్థిరంగా ఉంటుంది అని కూడా ఆలోచించాలి. 1957 లో జరిగిన సంఘటనల్ని బట్టి ఇండోనీషియా సమాఖ్య పేకమేడలాంటిదని



బ్రిటిష్ ప్రధాని మాక్మిలన్

తేలిపోయింది. సెలిబస్‌లోని ఒక భాగం ఈ మధ్యనే స్వాతంత్ర్యం ప్రకటించుకున్నది. 'పంచశీల' ప్రకారం ఇండోనీషియా అంతరంగిక వ్యవహారాల్లో భారతదేశం జోక్యం చేసుకోరాదు. సుకర్నో ప్రభుత్వాన్ని బలపరచటం ఇండోనీషియా విషయాల్లో కలగజేసుకున్నట్టే అవుతుంది.

విదేశాల్నించి ఏ అతిథి వచ్చినా ఒకే కార్యక్రమం అలవాటైపోయింది. మహాత్మా

శ్రీ కృష్ణ

[ఆంధ్రపత్రిక ప్రతినిధి]

గాంధీ సమాధి, జాతీయ భౌతిక విజ్ఞాన పరిశోధనశాల, కమ్యూనిటీ ప్రాజెక్టులు వగైరాలు దర్శించడం ముందుగా జరిగే తతంగం. ఆ తరవాత షాజహాన్ కట్టించిన లాల్ ఖిల్లాలో పౌరసన్మానం. ఈ సన్మాన కార్యక్రమాలు నిర్వహించేనిమిత్తం కొన ఊపిరితో ఉన్న పాతఢిల్లీ పురపాలక సంఘానికి మళ్ళీమళ్ళీ ఊపిరిపోసి బతికిస్తున్నారు. ఢిల్లీ కార్పొరేషను చట్టం అమల్లోకి వచ్చిన రోజునించే పాతఢిల్లీ పురపాలక సంఘాన్ని రద్దుచేయాలని మొదట్లో అనుకున్నారు. కాని విదేశీ అతిథుల పౌరసన్మానపు తతంగం కోసమని దాన్ని రద్దుచేయకుండా అట్టే పెట్టారు. దీనివల్ల బిర్లా సోదరుల మనిషి శ్రీ ఆర్. ఎన్. అగర్వాల్ పురపాలక సంఘాధ్యక్షుడుగా పౌరసన్మానాల్లో పాలొని, ఆ సందర్భాల్లో తీసే ఫొటోల్లో పడి బోలెడు పబ్లిసిటీ కొట్టేయడం జరుగుతోంది. ఆయా విదేశీ ప్రభుత్వాధినేతలతో భుజాలు భుజాలు రాచుకుని తిరిగిన తర్వాత శ్రీ అగర్వాల్ పలుకుబడి పెరిగిపోక ఏమవుతుంది? పలుకుబడి పెరిగిన తర్వాత ఆయన్ని ఏదో దేశానికి రాయబారిగా పంపించక తప్పుతుందా? అందులో అసహజమేముంది?

* * *

భారతీయైకమత్యాన్ని రక్షించిన వ్యక్తులుగా ప్రధాని, దాదాపు ఉప ప్రధాని అనదగిన పండిట్ పంత్ చరిత్రలో చిరస్మరణీయులవుతారు. దక్షిణ భారతీయులకు, బెంగాలీలకు ఇష్టం లేకుండా వారిమీద హిందీభాషని రుద్దటం ప్రమాదకరమని వారు గ్రహించారు. పండిట్ పంత్ పార్లమెంటు భాషా సంఘానికి అధ్యక్షుడు. రాజ్యాంగంలో అనుకున్న ప్రకారం 1965 కే హిందీభాషను అధికారభాషగా చేయటం కుదరదని ఈ సంఘం ఏకగ్రీవంగా నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఖలాసా వ్యవధిలోగా హిందీని తీసుకురావాలి అని, పెట్టుకోగూడదని వీరు అనుకుంటున్నట్లు వినికిడి. గౌహతి కాంగ్రెసు మహాసభలో కూడా దీని విషయమై చర్చించి, ఒక తీర్మానంచేసి కేంద్రంలోను, రాష్ట్రాల్లోను కాంగ్రెసు ప్రభుత్వాలకి ఒక ఆదేశం ఇవ్వాలని ఆలోచనలో ఉన్నదట. కనక నెమ్మదిగా అలజడి తగ్గిపోవచ్చును.

* * *



జెకోస్లవాకియా ప్రధాని
విలియం సిరోకీ

“ఇన్నొసెంట్ ఎంబాసడర్” అనే పుస్తకం ఇటీవల ప్రచురితమైంది. అమెరికా నుంచి బయల్దేరిన ఫిలిప్ వైలీ, అతని భార్య ఈ పుస్తకం రచించారు. వీరు తమ పర్యటనలో భారతదేశం కూడా వచ్చారు. ఈ దేశంలో వీరు రాజకుమారి అమృత్ కౌర్ మొదలైన “ముఖ్యుల్ని” కలుసుకున్నారు. ఆ పుస్తకంలోంచి కొంత ఇక్కడ ఉదహరిస్తాను.

“రాజకుమారి అమృత్ కౌర్ కు కుడివైపున నేను కూర్చుని ఆవిడ చెప్పేదంతా శ్రద్ధగా విన్నాను. నే నడిగిన ప్రతి ప్రశ్నకీ ఆమె పూర్తిగా, చక్కగా సమాధాన మిచ్చింది. ఆవిడకి చాలా విషయాలు తెలుసు. గాంధీజీ వద్దా, నెహ్రూతో కలిసీ ఆమె జైళ్ళలోనూ అక్కడా అనేక విషయాలు నేర్చుకుంది. భారతదేశపు దారిద్ర్యము, నిస్పృహా, ఉజ్జ్వల భవిష్యత్తు ఇవన్నీ ఆమె కెన్నో సంగతులు బోధించాయి.

ఆమె తన రాజకుమారీత్వాన్ని వదుల్చుకోవడానికి ఎంతో కృషి చేసింది.

రెండుగంటలు మేము భోజనం, సంభాషణ సాగించాము. ఆవిడ తక్షణ కార్యక్రమాన్ని గూర్చి నేనేమీ అడగలేదు. ఆరోగ్య మంత్రిణిగా ఆమె కోపంతో ఉడికిపోతున్న పార్లమెంటును ఎదుర్కోవాల్సి వచ్చింది. ఆ శీతకాలంలో గంగానదికి వరదలువచ్చి నగరానికి నీరు సప్లయిచేసే వడబోత మడులను ముంచేశాయి. వరద తీసిన తర్వాత అంటురోగం నగరంలో వ్యాపించింది. రెండు లక్షల జనం ఈ రోగానికి గురై, బాధపడ్డారు, పడుతున్నారు. కొందరు మరణించారు.

“ఇదంతా మీ కెందుకు?” అని మేము కాఫీకోసం డ్రాయింగు రూములోకి పోతూ ఉండగా ఆమె అడిగింది.

“నాకు ఇండియా అంటే చాలా ఇష్టం” అన్నాను.


“నవలలు రాసే రచయితకి మురుగు కాలవలు, నీటివడపోత, ప్రజారోగ్యాన్ని గూర్చి ఇంతబాగా తెలిసుండటం చిత్రంగా ఉందే?”

అప్పుడు నేను మియామీ లోని రెండు పత్రికల్లో సాగించిన ఉద్యమాన్ని గూర్చి ఆమెకు వివరించి చెప్పాను. నా ఉద్యమం ఫలితంగా, అమెరికాలోకల్లా దండాలమైన పట్టణం ఆధునిక పారిశుద్ధ్య పద్ధతులవల్ల, ఇంజనీరింగ్ పద్ధతులవల్లా ఎంత అద్భుతంగా బాగుపడిందీ, దక్షిణ ఫ్లారిడాలోని ప్రజలు నా ఉద్యమ ఫలితంగా మేల్కొని పారిశుధ్యం విషయంలో దేశానికి ఎలా మార్గదర్శకులైందీ వివరించాను. ఇంత చెప్పినా ఆవిడ, నవలలు రాసేవాడికి ఈ ఆరోగ్యం గొడవలు, ఇంజనీరింగ్ గొడవలూ ఎందుకంటుంది. ‘నేను బహుశా అంత పెద్ద రచయితని కానేమో; లేక పన్నెండేళ్ళు రాక ముందే ప్రతీ అమెరికనూ ఇంజన్లు, కార్లూ

(49-వ పేజీ చూడండి)



ఇండోనేషియా అధ్యక్షుడు
సుకర్ణో



సాత్యకి దుర్యోధనుకడకు దూతం బంపగూడ దని చెప్పుట

[ఉద్యోగపర్వం నుండి]

ఆ. ఇట్లు లాడ దగునె యిది నీక పోలు ని, న్నెఱుఁగ నేర్తు నిత్తెఱంగు
పాడిగాఁగ బూని పలుకంగఁ జెవియొడ్డి, యాదరించువారి నందుగాక.

క. వేడుక పుట్టిన జూదం, బాడెను ధర్మజుడు వార లందఱు దమలోఁ
గూడికొని పిలిచి బలిమిన, యాడి కపటజయము గొనుట యది దగ వగునే.

క. ధర్మతనూభవుఁడైన దు, ష్కర్మము రూపించి సభ నొకండును మైమైఁ
బేర్మి సెడక పోనేర్చునె, ధార్మికు లిం కెట్టివారు తథ్యం బరయన్.

చ. పలికిన చందముల్ నెఱపి పైతృకమై చను రాజ్యభాగ మి
మ్ముల బడయం దలంచి బలముం జలమున్ నెఱపంగఁ డంగు వీ
రలు నొరు వేడబోదురె యరాతులు సాధుల మెత్తురే రణం
బుల జయలక్ష్మిఁ జేకొనుట బోలునె యొండొక రాజధర్మముల్.

తే. సముచితము లగు మాటల జక్కఁబడక, తక్కనే నుక్కువుం డగు ధార్తరాష్ట్రు
గ్రూరశరముల నే నియ్యకొలుపువాఁడ, నవని కౌంతేయులకు నిచ్చునట్లు గాఁగ.

క. భీమార్జునులకు రణమున, నేమఁగలును బ్రతిమె వీరు నేనును సైన్యో
ద్దాములమై నడచిన నే, భూమీశులు నెదిరి బ్రదికిపోవంగలరే.

ఆ. కవలవారు గొడుకుఁగమియు పాంచాలవ, ర్గంబు వృష్ణివరులు గడగిరేని
నొక్కమాత్రలోన నువ్వెత్తు గొనరె దు, ర్యోధనాదిశతము నుద్దవిడిన.

క. ఈ మత్స్యపతి సహాయము, గా మాకుం దీర్పరాని కార్యము గలదే
సామాద్యుపాయపరు డు, ద్దామభుజాబలయుతుం డితడు కేవలుడే.

క. నామతమున గార్యము సం, గ్రామము సేయుటయ యిట్లు గాకిలోనన్
సామవచనంబు లక్కురు, భూమీశ్వరుతోడ నాడబుచ్చెద రేనిన్.

ఉ. దైన్యము దక్కి దూత యుచితంబుగఁ బాండునృపాలుపాలు రా
జన్యవరుండు ధర్మజుడు సమ్మతి వేఁడెడు నన్న లోకసా
మాన్యవిధిం దగంగ గరిమంబున నిచ్చిన బుచ్చికొంద మ
న్యోన్య విరుద్ధభాషణము లాడిన దత్ఫల మాత డందెడున్.

వ. అనిన ద్రుపదుండిది వోలు బలదేవుమాట మాటగాదు బలవిక్రమవంతుండును సహాయసంపన్నుండును దుష్టాత్ముండును నైన దుర్యోధనుండు ప్రియవచనంబుల రాజ్యంబుపా లిచ్చుట కియ్యకొనమి సిద్ధంబు యుద్ధంబునం గావి చక్కంబడ దని పలికి మఱియు నిట్లనియె.

క. మృదుభాషణముల దుర్జన, హృదయములు ప్రసన్నతామహిమ బొందునె మె
ల్లిదముగఁ గొని యంతంతకు, మద మెక్కుం గాక దురభిమానము పేర్మిన్.

వ. అదియునుం గాక.

తే. కూటికై ద్రోణభీష్ములు గుమతి యనక
యనుసరింతురు ధృతరాష్ట్రుడును దనూజు
తృష్ణ నూనినవాడు రాధేయు బోటి
తులువ లెల్లను నతని సద్బుద్ధి యండ్రు.

వ. కావున నతండు దుర్వినీతుడై యుండు నెల్లభంగుల సంగరంబు గాగలయది యీ సమయంబున బలంబుల గూర్చి కొని పిలువందగు రాజులం బిలిచి పుచ్చవలయు సుయోధనుండును దోడానపడి పుచ్చు నుచితపరులగు నరపతుల దొలుత చెప్పినవారికి సహాయత్వంబు జేయంజూతురు మనము వెనగలకాలరుల వేగంబ పుచ్చి శల్య కేకయ ధృష్టకేతు జరాసంధతనయ ప్రభృతు లయిన భూపతులకును వారి వారి బంధుమిత్రజనంబులకును నెఱింగించి పుచ్చుట కార్యం బిది నాకుం బోలిన తెఱం గని పలికి తన కెలన సముచితాసనంబున నున్న విప్రవరుం జూచి.

క. ఇతడు మదీయాగ్రపురో,హితు డితనికి నెల్లపనులు నెఱిగించి తగన్
ధృతరాష్ట్రు కడకు బనుపుడు, చతురవచనరచన గఱపి సంప్రీతిమెయిన్.

ఉ. ఆతని సమ్ముఖంబున దదగ్రతనూజు కడన్ మురున్నదీ
జాతుని సన్నిధిం గలశసంభవు నొద్ద గ్రమోచితంబుగా
నీ తెఱ గిట్టు లాడ మని యేర్పడ నంతయు జెప్పి పుచ్చగా
నీతిమెయిం దగం బలుక నెయ్యము లాభము బెంపు జొప్పడున్.

వ. అనిన వాసుదేవుండు పాంచాలపతి వచనంబు లుచితంబు లయి యున్నయవి యిబ్భంగిన చేయవలయునని పలికి మఱియు నిట్లనియె.

క. కౌరవులకు బాండవులకు, నారయ నే నొక్కరూప యట్లగుట దగన్
వారును వీరును దమతమ, నేరిమిమెయి ధరణి యేలి నెగడగ జూతున్.

తే. పెండ్లి కని పిల్వబంచిన ప్రియముతోడ, నేగుదెంచితి మిన్నాళ్లు నెల్ల యొప్పి
దముల జూచితి మిమ్మొడ దడవు గాగ, నిలువ దీఱదు పోయిరావలయు మాకు.

వ. అని పలికి ద్రుపదు నాలోకించి మీరు మా కెల్లవారికి గురుస్థానంబు మీమాట యనిన ధృతరాష్ట్రుండు బహుమానంబు సేయు మిమ్ము శాంతనవుండునుం గొనియాడు మీయందు ద్రోణకృపాచార్యులు సఖ్యంబు వాటింతు రట్లగుటం జేసి,

తే. పాండవార్థమై యొక్కరు బనుప మీకు,భరము మీ పలు కందఱు పలుకు మీరు
తెఱగుపఱుపంగ మిగిలి యుద్రేకులైన, వార చెడువారు విమలవిచారవిభవ.

క. పొందైన లెన్న విరసపు, గ్రందమ్మొదు చంద మైన రాజుల నెల్లన్
ముందఱ రావించి క్రమం, బొందగ మము బిలువబంపు డొయ్యన పిదపన్.

క. మీ పనుపున రాజ్యముపా, లీపాండుతనూభవులకు నీకున్న భుజా
టోపభయంకరు డర్జును,కోపానల మడరి ముట్టికొన దే వారిన్.

చ. అని గమనోన్ముఖుం డయి మురాంతకు డాద్రుపదుండు ధర్మనం
దనుడు వృకోదరాదు లగు తమ్ములు మత్స్యమహీవిభుండు ద
న్ననుప హలాయుధప్రభృతి యాదవలోకముతోడ రా ముదం
బున నిజపట్టణంబునకు బోయె సముజ్జ్వల వైభవంబునన్.

వ. వివాహమహోత్సవంబునకు వచ్చిన తక్కటి రాజులును సంగ్రామసన్నాహంబునకై తమ తమ పురంబులకుం జనిరి తదనంతరంబ.

క. సమరమునకు దగు నుద్యో,గమున బ్రవర్తిల్లి కెలమి గౌంతేయులు మ
త్స్యమహీనాథుడు సన్నా,హము సేసెన్ ద్రుపదవిభుడు నాయిత మయ్యెన్.

వ. ఇట్లు సన్నద్ధులై వెలిపీడు విడిసి తమకు ననురక్తులైన రాజులపాలికిం దగు దూతలం బుచ్చి రట దుర్యోధనుండు వీరల చందంబు విని తానును దన బంధుమిత్రగణంబైన రాజలోకంబు నెల్ల రావించిన.

క. ఇభతురగస్యందనగతి, రభసంబున బృథివి యద్రువ రా దొడగిరి భూ
విభులు పలుదిక్కులను లో,కభయంకరలీల నుభయకటకంబులకున్.

ద్రుపదుడు దనపురోహితుని దుర్యోధనుకడకు దూతగా బంపుట

వ. అట్టి సమయంబున నజాతశత్రుననుమతి వడసి పాంచాలపతి వయోజ్ఞానవృద్ధుండైన తన పురోహితుం గురుపతి పాలికి బుచ్చువాడై యతని రావించి.

క. హితుడవు మతిమంతుండవు, చతురవచనకోవిదుడవు సమయజ్ఞుడ వు
న్నతవంశవర్ధనుడ విం,గితవేదివి నెచ్చెలివి సుకృతి వట్లగుటన్.

తే. నాకు గర్తవ్య మగుపని నీకు జేయ దగవు గావున నెల్ల విధముల బూని
పాండవార్థంబు ధృతరాష్ట్రుపాలి కరిగి, నేర్పువాటించి కార్యంబు దీర్పవలయు.

వ. అని చెప్పి యొడంబఱిచి యతనితో మఱియు నిట్లనియె.

క. విను కొడుకు గొన్న వేదుఱ, కొని కొట్టినతిండికాదు కుటిలుం డత డా
జనపతిచందము ధర్మజు, ననుపమశీలంబు నెఱుగు దది యట్లుండెన్.

తే. పుడమిపాలు పాండవులకు నడుగ బోయి, నీవు ధృతరాష్ట్రుతో ధర్మనిష్ఠమైన
యుచిత మాడిన నందు బోటాడ్డియున్న, దొరలభృత్యులమనములు దిరుగబడవె.

క. గురుభీష్మాదులమనములు, దురమునకుం జొరక యుండ దుర్యోధను డా
తురుడై యొడబఱుపగ ని,ప్పరుసున నెర వైన ఱిచ్చవడు బల మెల్లన్.

ఉ. పాండుతనూభవుల్ వడిన పాటులు బంధుల కెల్ల దెల్పుచుం
బండితవృద్ధసజ్జనులపాలికి బోయి కులోచితంబుగా
కుండుట సూపి చెప్పుచు బ్రియోక్తుల దక్కటివారి నిట్లు మే
లొండొకచంద మొప్ప దని యుల్లములం దలపోయజేయుచున్.

వ. మఱియు సమస్తజనంబులమనంబులు నిక్కడ వ్రాలునట్టి యుపాయంబు లెన్నిగల వన్నియు నయ్యైతగవులమై నాచరించుచు జరియించునది యిచ్చట విరాటు కొలువుకూటంబునం బుట్టిన కృష్ణాదుల సంవాదంబు తెఱంగును మన యెఱింగినయదియ తదనురూపంబుగా బలికి పాండవులకు దేశోలాభంబుం గావించుట కర్తవ్యంబు నీవు కరినగరంబున వసియించి ధృతరాష్ట్ర ధార్తరాష్ట్ర గాంగేయ విదుర గురుకృపాదుల కడ కరిగి నానాటికి వారివారి చిత్తంబుల తెఱంగెఱింగి ప్రవర్తింపుము దైవగతింజేసి నీ యొడ్డిన సూత్రంబునకు సుయోధనుం డొడంబడియెనేనియు నదియ సకలజనసమ్మతం బయిన విధంబగు దాన నజాతశత్రుండును బ్రీతుండగు బోయి రమ్మని నిశ్చయంబు సేసిన నమ్మహీసురవరుండు,

క. మును పాంచాలవిభుని పీ, డ్కొని ధర్మజు భీము నరు నకులు సహదేవుం
గని యనుమతుడై యందఱు, ననుపగ మన్ననలు వడసి యరిగెం బ్రీతిన్.

వ. అంత నక్కడ దుర్యోధనుండు సకల రాజన్యసామాన్యంబుగా గోపాలదేవుపాలికి దూతంబుచ్చుట దగవగునే యని విచారించి,

క. వెరవుమెయి దాన కతిపయ, పరిజనసహితముగ సరిగె బటుతురగగతి
స్ఫురణానుమోదలీలా,భరితు డగుచు వేగిరంపు బయనముల దగన్.

వ. చని తదీయ పురప్రవేశంబు సేసె నాదివసంబున ధనంజయుండును గోవిందుం గానవచ్చె నట్టియెడ,

తే. అతడు పవడింప మును కౌరవాధినాథు, డరిగి తలయంపుదెస నున్న తానమున
నుండె బదపడి కాల్కడయొద్ద కల్ల, జని వినమ్రుడై నిలుచుండె సవ్యసాచి.

వ. అంత.

క. మేలుకని కృష్ణు డర్జును, నాలోకించి మఱి కౌరవాధిపు గని త
త్కాలోచితబహుమతిమై, జాల బ్రియం బిరువురకు బ్రసన్నత జేసెన్.

వ. తదనంతరంబ.

ఉ. వారల జూచి కేశవుడు వచ్చినకార్యము సెప్పు డన్న న
క్కౌరవనాథు డిట్లనియె గయ్యము సేయువగన్ సహాయముం
గోరి భవత్సకాశమునకుం జనుదెంచితి మేము వీరు నీ
కారయ నొక్కరూప హృదయంబున జేర్చిన బాంధవంబునన్.

క. మున్నేను గాన వచ్చిన, నిన్ను సుజనులైనవారు నెమ్మిని మునుమున్
గన్నం దగ గైకొంద్రు స,మున్నతసౌజన్యసారయుతుడవు నీవున్.

వ. కావున లోకంబు పాడి విచారించి నాకుం దోడుగావలయు ననిన వాసుదేవుం డిట్లనియె.

ఉ. నీ విటమున్న వచ్చి తిది నిక్కము పార్థుని దొల్త గాంచితిం
గావున మీకు నిద్దఱకు గారవ మొప్పగ దోడుపాటు న
ద్భావము దీనికిం దెఱగు దప్పక యుండగ నేర్పరించెద
న్నీవలపెట్టు లట్ల తగ నీవును నీతడు గోరికొం డొగిన్.

క. నాపాటియ పదివేవురు, గోపాలురు గలరు సమరకోవిద బాహా
టోపాభిరామమూర్తులు, చాపాద్యాయుధకళావిశారదచిత్తుల్.

క. నారాయణాభిధానులు, వారలు గయ్యంబుసేయువా రొక్కెడ నే
నూరక నిరాయుధవ్యా,పారతమై నుండువాడ బరమాప్తుడనై.

క. వా రొకతల యే నొకతల, యీ రెండుదెఱంగులందు నెయ్యది ప్రియ మె
వ్వారికి జెప్పుడు దొలితొలి, గోరికొనగ బాలునికి దగుం బాడిమెయిన్.

అర్జునుడు శ్రీకృష్ణునిం దనకు సహాయునిగా గోరికొనుట

క. అని పలికి హరి కిరీటిం, గనుగొని కొందుకవు నీవు గావున నీకున్
మును గోర బాడి యనవుడు, విని కృష్ణుని గోరికొనియె విజయుం డెలమిన్.

ఆ. దాని కాత్మ బొంగి ధార్తరాష్ట్రుడు వారి, నపహరించికొనినయట్ల కాగ
దలచి తన్ను మీఱి బలముల గైకొని, చనియె బ్రీతి రాము సదనమునకు.

వ. చని యతనింగని సమ్మానంబువడసి తన వచ్చిన కార్యం బెఱింగించిన దుర్యోధనునకు బలదేవుం డిట్లనియె.

క. అభిమన్యువివాహమునకు బ్రభువర్గం బెల్ల గూడబడియుండగ నా
సభ నీకై యే బలికితి, నిభపురమున మాట వుట్టదె ట్లీవు వినన్.

వ. దానికి గొంద ఱసహ్యపడి పాండవపక్షపాతంబునం బ్రతికూలవచనంబులు పలికిన నవి కృష్ణునకు బ్రియంబులై యుండె నట్లగుటంజేసి.

తే. అతనిబాసి యొక్కింత ప్రొద్దైననిలువ,జాలమియు మూలముగ విరసంపుమాట
లాడ నొల్లమి నేమియు ననక యంత,నుండి యొకనిశ్చయమ్ముమై నున్నవాడ.

వ. అది యెయ్యది యంటేని,

క. మీరును వారును జలమున, బోరెదు నెడ నద్ది యొట్లు వోయిన నెఱి నే
నూరకయుండుదు దో డే,వ్వారికి బో నింత నిక్కువం బెబ్బంగిన్.

వ. అనిన విని దుర్యోధనుండు దానికియ్యకొని సవినయంబుగా బలదేవుని వీడ్కొని వాసుదేవు నామంత్రణంబు సేసి కృతవర్మపాలికిం జని యాతం డొక్క యక్షౌహిణితోడ దన్నుం గలయవచ్చువాడయి యూఱడంబలికిన బ్రియంబంది నిజపురంబున కరిగె దదనంతరంబ కృష్ణుం డర్జునున కిట్లనియె.

క. నారాయణగోపాలుర, భూరిపరాక్రముల గురువిభుడు గొన సంగ్రా
మారంభరహితు నన్నుం, గోరికొనుట నీకు మే లగునె తలపోయన్.

క. అనుటయు నాతడు హరి కి, ట్లను నేను రణంబునకు సహాయం బొల్లన్
విను సుప్రసిద్ధుడవు నీ, వని నేసిన బేరు నీక యగు నెప్పాటన్.

వ. నీకెదురై జయంబుగొనరా దట్లగుటంజేసి, విజయమూలంబగు నీతోడును వలయు నీవు సమరంబు సేయకునికియుం బ్రియంబు కావున నిన్నుం గోరికొంటినని చెప్పి మఱియు నిట్లనియె.

ధర్మయుద్ధం

"సీతాదేవి"

శ్రీహరి యువకుడు. అనుభవంలేని వాడు. తనలో వ్యక్తిత్వం ఉందంటాడు. ధర్మాన్ని చిత్తశుద్ధితో చేస్తాననే రకం. అనుభవంలేని మాట. కొన్ని సమయాల్లో అబద్ధం విధిగా ఆడాలి! లేకపోతే కొంపలు అంటుకుంటాయి! అంటుకున్నాక ఆర్పడానికి వచ్చేలా తాపత్రయపడేది మనమే... ఆరిపోయాక...అంతా అయ్యాక, అబద్ధం ఆడి ఉండాల్సిందిసుమా! అని అనకుండా ఉండలేం. శ్రీహరికి ఈ దెబ్బతో బాగా బుద్ధి వచ్చింది.

ముందే నాగరాజు, శ్రీమన్నారాయణలు చెప్పారు. "అబ్బాయి......నువ్వు వెడుతున్నది ఉప్పలపాడు. చేయబోయేది స్కూలు ఫయినల్ పరీక్షలకు వాచింగ్." ఈ ధ్వనిని అర్థం చేసుకోలేని అర్భకుడు కాదు శ్రీహరి. కోరగా చూసాడు. పిరికివెధవల్ని చూసినట్టు చూసాడు వాళ్లని శ్రీహరి.

"ఏం? తలతీసి మొలేస్తారా?" అనికూడా అన్నాడు.

అప్పుడు నాగరాజు అన్నాడు "తల తీయడం ఖాయం. మొలెయ్యక పోవచ్చుగాని." శ్రీహరి వినలేదు. పెడచెవిని పెట్టాడు.

"అదీ చూస్తానుగా!" అన్నాడు శ్రీహరి బింకంగా.

"నువ్వే చూస్తావుగా. ఉప్పలపాడు కుర్రాళ్లంటె సామాన్యులు కాదు. వాళ్ళ 'కోర్సు'ను 'ఫైనల్' చేసుకోవడంతో బాటు నిన్నుకూడా ఫైనల్ చేస్తారు వెధవ్వి; విధ్వంసం చేస్తే!" అన్నాడు నాగరాజు. శ్రీహరి నవ్విపారేసాడు విషయాన్ని.

"నవ్వినంత తేలిగ్గాదు." అన్నాడు శ్రీమన్నారాయణ.

"ఏమిట్రా! ఇలా బిగపట్టుకు భస్తున్నారు." శ్రీహరి వీరుడులా అన్నాడు.

హనుమంతరావు కూడా చెప్పిచూసాడు. "ఎదురీత ఈదడం మంచిది కాదు. నలుగురితో పాటు నారాయణ. మన ఒక్కరితోనూ ప్రపంచం ఉండదు. దాని ఆట ఆడుతుంది అది. మనం మడిబట్ట కట్టుకున్నా ప్రయోజనం లేదు."

శ్రీహరి ఇంకా వినలేదు. నాగరాజుకు కోపం వచ్చింది.

"నువ్వు మొండిఘటానివి. నీ తిక్క నీది. ఇతరులు చెప్పింది వినకపోవడమే నీ పిచ్చి. పోనీ ఎందుకు చెప్పతున్నారో వినిపించుకోవు. అంతా కళ్ళుమూసుకున్నా నీవు అర్థంచేసుకోవు. వేనకువేలు ఘట్టాలు సోదాహరణంగా చెప్పతున్నా నువ్వు లక్ష్యపెట్టవ్." ఇలా కూకలేసాడు నాగరాజు.

"నాకు క్రొత్త విధానాలు బోధించకండి. నా ఖర్మ నన్ను అనుభవించనీ!" ధర్మానికి ఎరగాబోతున్న ఉద్ధారకుడిలా మొహం పెట్టి అన్నాడు శ్రీహరి.

"అయితే ఛస్తావ్!" అన్నాడు నాగరాజు విసిగి.

"అయినాసరే...అది వీరమరణం అనిపించుకోంటుంది."

"నాబొందేం అనిపించుకోదూ?" నాగరాజుకు కళ్ళు మండింది. తెలుగుపండితులు పొట్టలు చెక్కలు చేసుకొన్నారు నవ్వలేక! నవ్వలేక కుడులు తిరుగుతూ "అమ్మ!" అని ఆయాసపడ్డారు శ్రీహరి వెర్రి మొర్రి పిచ్చుకు! శ్రీహరి చాలా నింపాదిగా అన్నాడు. "ఏమైనా అనండి. నవ్వండి. పిచ్చి అనండి. నేను ఆత్మవంచనను చేసుకోలేను. నా ధర్మాన్ని నిర్వహిస్తాను నా ధర్మ నిర్వహణలో ఏ ప్రమాదమైన వస్తువూ అడ్డు రాదు. రాలేదు కూడా! అని ఛాతిని ఉబ్బించి అన్నాడు. కళ్లు మూసుకొని తలపైకెత్తి "తప్పుచేసిన వారిని నేను క్షమించలేను. క్షమించనయినా క్షమించగలనుగాని ప్రోత్సహించలేను."

"పోనీ...నువ్వొకపనిచేయి" హనుమంతరావు శ్రీహరి వైపు చూసాడు.

"ఏమిటది?"

"ఎమ్. సి."

"వీల్లేదు. నేను పిడుగులా ఉన్నాను. పిరికివాడిలా ఆపని చేయలేను."

"తర్వాతయినా పెట్టితీరతావ్"

"చూద్దాం!"

"సరే!" హనుమంతరావు శ్రీహరి కర్మకు శ్రీహరిని వదిలి పెట్టాడు.

శ్రీమన్నారాయణ చివరసారి ప్రయత్నించ పోగాడు.

"నాయనా! శ్రీహరీ! ఎందుకురా ఈ వెధవ్వేషాలు? పెద్దపులికి ఎదురెళతారట్రా? పిల్లలు గలవాడివి!"

"ఏవిధిరాతను తప్పించలేరు."

"ఇంతటి గడుగ్గాయికి ఎవ్వడు మాత్రము చెప్పగలడు...ఒక పదివేలకు ఇన్సూరయినా చేయి...పీక్కుతింటారు పిల్లలు వెధవ్వి!"

"కంపెనీకి అన్యాయం చేయలేను. పది వేలకు ఇన్సూరుచేసే తాహతు నాకులేదు." అని శ్రీహరి వెళ్ళిపోయాడు.

అందరికీ ఆశ్చర్యంగా ఉంది శ్రీహరి తీరుచూస్తే. చేసేది మాస్టరుఉద్యోగం, చెప్పే మాటలు వీరునిమాటలు! ఆ బ్రహ్మ అదోలా ఉన్నప్పుడు చిన్న పొరపాటు చేసి ఉంటాడనుకున్నారు.

భార్య సుమంగళి చెప్పింది. సెలవు పెట్టమంది. తనమీద ఒట్టువేసి స్నేహితులు చెప్పినట్టు చేయమంది. శ్రీహరి వినుకొన్నాడు. ఏమిటీభయం? ఏమిటీ పిరికితనం? ఎందుకీ నిరుత్సాహపు మాటలు? ఏమిటీ చీకటిచారలు!!

సుమంగళి కడసారి ఆయుధం ప్రయోగించింది. కన్నీరు!! శ్రీహరి చూసాడు. శ్రీహరి ఏనాడూ తనభార్య కన్నీరు చూడలేదు. సుమంగళి కన్నీరుతో తనపిల్లల్ని నలుగుర్నీ శ్రీహరిదగ్గరకా చేర్చింది. శ్రీహరి కరిగిపోయాడు. ఊగిపోయాడు. నాలో నాకు తెలియకుండా బలహీనత ఆవహిస్తోంది అనుకున్నాడు. సుమంగళి అంది "నన్ను చూసి కాకపోయినా......పిల్లలు" అని బావురుమంది.

విసురుగా శ్రీహరి సుమంగళిని సమీపించాడు. సుమంగళి తలను తనచేతుల్లోకి తీసుకున్నాడు. "సుమంగళీ" అని గాద్గదస్వరంతో అంది. సుమంగళి చెరగని కన్నీళ్ళతో శ్రీహరిని చూసింది. శ్రీహరి చిన్న సైజు అభిమన్యుడిలా ఉన్నాడు. శ్రీహరి సుమంగళి కన్నీరు తుడిచాడు. బాధగా, బరువుగా అన్నాడు.

"ఛ! తప్పుకదూ! తప్పు! నువ్వు శ్రీహరి భార్యవి, నువ్వు శ్రీహరి భార్యవి సుమంగళీ. శ్రీహరిభార్యవి." అన్నాడు. ఆ అనడంలో, తాను చేయగలిగిందేమీ లేదని, తన పత్ని

అన్నివిధాలా సహకరించాలనే కాంక్ష తన కుందని తెలియచేస్తున్న ధ్వని ఉంది. సుమంగళి కూడా భర్తమాట కాదనలేదు. భర్త ఎప్పుడూ ఆడితప్పనివాడు. ఆదర్శవాది. ధర్మనిష్ఠాపరుడు. తానెందుకు కాదనవలె! తనుకూడా తగ్గ భార్య అనిపించుకోవాలి. ప్రజలు మెచ్చుతారు! ప్రజలు మెచ్చకపోయినా భగవంతుడు మెచ్చుతాడు. దేవతలు పుష్పాలు కురిపిస్తారు. దుందుభులు మ్రోగిస్తారు!!

"వెళ్ళిరండి!" అంది.

శ్రీహరి భార్యను చూసాడు 'నిజమా!' అన్నట్టు.

"అవును వెళ్ళిరండి, మీ ధర్మనిర్వహణలో ఏది అడ్డురాదు. అడ్డు రాకూడదు. ధర్మకార్యం దైవకార్యం వంటిది. ఆ ధర్మాన్ని ఖండించాలి. ధర్మాన్ని నిలబెట్టండి. ధర్మం నాలుగు పాదాలా నడవాలి. ధర్మం జయిస్తుంది, ధర్మం జయిస్తుంది" అని సుమంగళి వాలిపోయింది.

శ్రీహరి బస్సు ఎక్కాడు. కండక్టరుతో "ఉప్పలపాడు" అన్నాడు. "పంతులారు... వాచింగ్ కేమిటి?" అన్నాడు ఒక ఎరిగిన గణపతి.

"ఆ! మరే!" అన్నాడు శ్రీహరి.

"కాస్త జాగ్రత్త" అని ఖంగున నవ్వాడు రెండుసీటూ గలగలమన్నాయి. వెధవ ధ్వని!

శ్రీహరికి ఎప్పుడు బస్సు దిగిపోదామా అనిపించింది. ఉప్పలపాడు హైస్కూలు పక్కా బిల్డింగు. 'పోరగో'లో ప్రవేశించి స్కూలు పైభాగాన్ని చూస్తూ "అధర్మాన్ని, అవినీతిని ఖండిస్తాను" అనుకున్నాడు. ఆకాశాన్నంటుతున్న ఆ మేడ అంతా అధర్మ, అవినీతిమయం అనుకొన్నాడు శ్రీహరి. అలా అనుకోవడానికి కారణం......ఉప్పలపాడు హైస్కూలు స్కూల్ ఫైనల్ పరీక్షల సమగ్రచరిత్రలో ఎక్కువభాగం పుచ్చుకొన్నది అది ఒక్కటే!

"ఈ దెబ్బతో గోవింద!" అని తనలో తాను నవ్వుకొన్నాడు శ్రీహరి.

అలా నవ్వుకుంటూంటే...

"కాలానికి ఎదురీత ఈదడం మంచిది కాదు. పరిస్థితితో పంతం వేయకు" అన్న సుపరిచితమైన ఒక మిత్రుని గొంతు వెనకనుంచి అంటున్నట్లయింది. "అంతా పిచ్చు!" అని వళ్ళు ఒకసారి దులుపుకున్నాడు శ్రీహరి.

పరీక్షలవుతున్నాయి. అంతా ప్రశాంతంగా జరుగుతోంది. స్కూలు పిల్లలు పెద్ద సిపాయిల్లా ఉన్నారు. శ్రీహరి వాళ్ళని చూచి కదలలేదు. కంపించలేదు. తన ధర్మాన్ని తాను సక్రమంగా నిర్వర్తిస్తున్నాడు. "నీ ధర్మాన్ని నీవు, జాగరూకతతో చేయడమే, అది ఇతరులకు హాని కలిగించవచ్చు అనే సత్యంను శ్రీహరి లెక్కబెటలేదు. తన ధర్మనిర్వహణ తనకు బాకుపోటని ఎలా ఊహించగలడు?

* * *

శ్రీహరి చావుబ్రతుకుల మధ్య ఉన్నాడు. శ్రీహరి భార్య చిన్నకుర్రాణ్ణి ఒడిలో పెట్టుకొని శూన్యంలోకి చూస్తోంది కన్నీళ్ళతో! పిల్లలు బావురుమన్నట్లు చూస్తున్నారు గాయాలకట్లతో వికృతంగా పడిఉన్న తమ నాన్నను. మిత్రుడు శ్రీమన్నారాయణ, చాలసేపు శ్రీహరిని చూసి "శ్రీహరీ!" అని ఒక్కసారి ఘొల్లుమన్నాడు. శ్రీహరి మనలో లేడు. ధర్మయుద్ధంలో చావగొట్టబడ్డాడు శ్రీహరి. శ్రీహరిని చూస్తూ నాగరాజు ఒకసారి మూలిగి..."ఇది ఎవరి తప్పూ కాదు. అంతా నీదే శ్రీహరీ!" అని కళ్ళనీళ్ళు తుడుచుకున్నాడు. డాక్టరు వచ్చాడు. శ్రీహరికి 'డ్రెస్సింగు' చేసాడు. ఏవో ఇంజక్షనులు వ్రాసియిచ్చాడు. శ్రీమన్నారాయణ ఆ 'చీటీ'ని చూస్తూ ఏంచేయనన్నట్టు చూసాడు. సుమంగళి కర్థమైంది. చంటికుర్రాణ్ణి కూర్చోపెట్టి, కన్నీళ్లు తుడుచుకొని..."శ్రీమన్నారాయణ గారూ! ఇవి మార్చి మందుపట్టండి వేగిరం..." శ్రీమన్నారాయణ "మాంగళ్యం" అని బాధగా ఒక్కమాటున అని నోట్లో చేరుమాలును కుక్కుకున్నాడు. సుమంగళి ఎదురుగా

మేష్టరు: ఏరా! వేణూ! నేనిచ్చిన ఎనిమిది లెక్కలు చేశావా?

కుర్రాడు: వాటిల్లో అయిదు చెయ్యటం రాదండి. అందుకని చెయ్యలేదండి. మిగతా మూడు వచ్చినవేనండి. అందుకని అవికూడా చెయ్యలేదండి.

*　　*　　*

మే: ఏరా సోమూ! రోజూ హోంవర్కులో రెండో మూడో తప్పేవి. ఇవ్వాళ అన్ని లెక్కలూ తప్పినవేమిరా?

కు: మరేండి.....మా నాన్న చేశాడండి.

కె. సర్వలక్ష్మి, (రాజమండ్రి)

(శ్రీ)వేలాడుతున్న గాంధీ ఫోటోను చూసింది 'చూసావా తండ్రీ!" అన్నట్లు.

"డాక్టర్! మా శ్రీహరి బ్రతుకుతా డంటారా?" అన్నాడు నాగరాజు.

"ఇప్పుడేమీ చెప్పలేను. ఓవర్ బ్లీడింగ్. నాగరాజు వణికిపోయాడు. శ్రీహరిపోతే... భూమాత కంపించింది. సుమంగళి, పిల్లలూ వీధిలోపడ్డారు ఒక పెనుగాలికి...ఇంటింటా తిరుగుతూ బిచ్చమెత్తుతున్నట్లనిపించింది నాగరాజుకు. నాగరాజు హడలిపోయాడు. శూన్యంలోకి చూస్తూ రెండు చేతులూ జోడించి నమస్కరించాడు నాగరాజు!

నాగరాజుకు ఏం చెయ్యడానికీ తోచింది కాదు. శ్రీమన్నారాయణకు ఇవేం పట్ట లేదు. శ్రీహరికి పరిచర్యలు చేస్తున్నాడు. శ్రీమన్నారాయణను నాగరాజు పిల్చి...

"శ్రీహరి బ్రతకడు" అని దుంఖంతో వాపురుమన్నాడు నాగరాజు. సుమంగళి వింది. చిత్రం! ఏడవలేదు సుమంగళి! అతి నింపాదిగా అంది. "మావారు బలి అయ్యారు!"

నాగరాజు ఏమి అనుకున్నాడో ఏమో, ఈమాట వినగానే, విసురుగా రోడ్డుమీదకు వెళ్ళాడు. హెడ్మాస్టరు దగ్గరకు వెళ్ళాడు. చెప్పాడు. "శ్రీహరి పరిస్థితి విషమించింది."

హెడ్మాస్టరు నిర్ఘాంతపోయాడు. ఆయన కూడా వచ్చి చూసాడు. "అవును. పాపం" అన్నాడు. జాలిపడ్డాడు. ఆ వేళ నలుగురు మాస్టర్ల దగ్గరా అన్నాడు. "చూసారా! శ్రీహరి చావుబ్రతుకుల మధ్య ఉన్నాడు. నేను ఆనాడే చెప్పాను. మన ఆత్మలూ... అవి...అంటే లాభం లేదు. ఎవరిగొడవ వారు చూసుకోవాలె. పరిస్థితిని అర్థం చేసుకు తిర గాలె. లేకపోతే విషమ పరిస్థితి తప్పదు."

హెడ్మాస్టరు చెప్పిం దేమిటి? శ్రీహరిచావును శ్రీహరి కొనుక్కున్నాడు. అంతేగా? నాగ రాజు ఎగిరిపడ్డాడు. "మన డిపార్టుమెంటుకు రాయకూడదా ఇలా ఉంది పరిస్థితి అని?" హెడ్మాస్టరు అన్నాడు. "అనుభవంలేనిమాట. ఎక్కడో ఉప్పలపాడు వాచింగుకు వెళ్ళడ మేమిటి. అక్కడ దెబ్బలు తినడ మేమిటి? నేను వ్రాయడమేమిటి? అది ఉప్పలపాడు హెడ్మాస్టరు చేయవలసినపని. పైగా డిపార్టుమెంటు ఏం చేస్తుంది? డిపార్టు మెంట్ చెప్పుతుంది చివరన శ్రీహరికి 'టాప్తు'లోపమని."

నాగరాజు నేరుగా ఉప్పలపాడు పోయాడు. ఉప్పలపాడు హెడ్మాస్టరు కాఫీ తెప్పించాడు నాగరాజుకు. నాగరాజు వెంటనే అడిగాడు.

"శ్రీహరి చావుబ్రతుకుల మధ్య ఉన్నా డు. దినికి మీ సమాధానం?

"ఏమీ తెలియని పిల్లలు ఏవో చేస్తారు తెలియక! మనం చేయమంటామా? పైగా మా పిల్లలు ఎప్పుడూ ఇటువంటిది చేయలేదు. ఈ ఏడు దురదృష్టంకొద్దీ ఇలా జరిగింది. కాలం వెధవది. పైగా కాస్త..."

"నమలకండి మాటల్ని. ఏమీ తెలియని పిలలు!! శ్రీహరి మృత్యుప్రాంగణంలో ఉన్నాడు. మందు ఇప్పించడానికి కూడా కానీ లేదు."

"ఇందులో నేనేం చేయగలను? కాలం వెధవది. చెడ్డరోజులు వచ్చినపుడు ఓపిక పట్టడం మంచిది. పోలీసు దర్యాప్తు జరుగు తోంది. ఏమైనా...మీ శ్రీహరిగారు అంత ముక్కుకు సూటిగా పోవడం మంచిది కాదు. ఇంకా ఈ సెంటరు నయం"

"మరో సెంటరయితే అక్కడే చచ్చును వెధవ! కదూ?" నాగరాజు మండి అన్నాడు హెడ్మాస్టరు మాట్లాడలేదు.

*　　*　　*

సుమంగళి మాంగళ్యం గట్టిది. పిలలు అదృష్టవంతులు. శ్రీహరికి ఇంకా ఈ భూమిమీద నూకలున్నాయి. నాగరాజు, శ్రీమన్నారాయణల మనసులు మంచివి. వారి మంచితనం శ్రీహరికి శ్రీరామరక్ష అయ్యింది. శ్రీహరి బ్రతికి బట్టకట్టాడు. సుమంగళి కళ్ళు మిల మిల మెరిసాయి. శ్రీహరిని మందలించింది సుమంగళి. శ్రీహరి

ఒకడు: హైకోర్టులో వాడి 'సూట్' పోయిందిట.

రెండో: తొడుక్కొని ఉన్న 'సూట్' కూడా పోయిందంటే కోర్టులలో చాలా చిత్రమైన దొంగ లుంటా రన్నమాట.

*　　*　　*

ఒకడు: ఎల్లమంద ఏమయ్యాడురా? బొత్తిగా కనిపించటం లేదు!

రెండో: వాడికేమండి! వాడు విదేశాలకు వెళ్ళి మంచి పేరు సంపాదించాడు!

మొదటి: ఎలాగా?

రెండో: మీకు తెలీదూ? ఇప్పుడు వాడిపేరు 'ఆల్‌మండ్'.

*　　*　　*

ఒకరు: రాత్రి వాళ్ళింట్లో దొంగలు పడ్డారుట!

రెండో: పాపం! వాళ్ళ జీవితం ఎప్పుడూ పడటంతోనే సరి పోతుంది. ఇవాళ ఉదయం జెయిల్లో కూడా పడ్డారుట.

*　　*　　*

భార్య: ఇంట్లో నువ్వులు అయిపోయినవండి!

భర్త: కాసేపునవ్వుతూ కూర్చోలేవూ? నవ్వులల్లా నువ్వులవుతయ్‌గా!


ఎల్. వెంకటేశ్వర్లు, గుంటూరు.

కదిలిపోయాడు. శ్రీహరి సుమంగళిని చేతుల్లోకి తీసుకొని "ఇక నీమాట వింటాను సు" అన్నాడు. పిచ్చి! మిత్రులతో "మీ మాట కాదనను" అని అన్నాడు.

శ్రీమన్నారాయణ వీధి గదిలో వాలు కుర్చీపై పవళించి తనలో తాను అను కొన్నాడు. "నా 'లైఫ్' కు సెక్యూరిటీ భార్యామిత్రులు!" ★

(నవల) దగాపడిన తమ్ముడు

రచన: బలివాడ కాంతారావు



(గతసంచిక తరువాయి)

3

పెళ్ళాంకన్నా పిల్లల గురించి తలుచుకోవడముంటేనే పుల్లయ్యకి హాయిగావుంది. మనవలాడిమాటలు మళ్ళీమళ్ళీ నెమరువేసుకుంటున్నాడు. చటుక్కున పోతులకి గడ్డి వెయ్యలేదని జ్ఞాపకంవచ్చింది. అర్ధరాత్రిలోపుగా ఇంటికిపోవాలని తొందరెక్కాడు. కాలుగడుగులువేస్తే తొందరపక్కనే కళ్ళాలు. కళ్ళాలను అనుకునే పడమటివైపున మురగడి మడులు. మడిగట్టుమీద నడుస్తున్నాడు. మళ్ళీ కొడుకు తలపోతల గురించి మరిచిపోవచ్చింది!

ఆగాడు! ఏటిఒడ్డు కనిపిస్తోంది. అదిగో నీలమ్మగుడి! చందమామ ఎత్తునవున్నాడు! మేఘాలు తెలతెలపోయి తప్పుకున్నాయ్. పట్టపగల్లా వెన్నెలతీర్చి కాస్తోంది!

వెన్నెల్లో యేటిమీదున్న మూడుఫర్లాం గులకం తెల్లతెల్లగా మెరిసిపోతూంది.

చల్లనిగాలికి మెల్లగకదులుతూ పొట్టతో పచ్చగావున్న చేను పలకరించింది! "హా! హా!...మాతల్లి లచ్చిందేవి!" అని మనసులో చేతులెత్తి మొక్కుకున్నాడు. అక్కడక్కడ పొట్టవిడిచిన వెన్నులు వూగుతున్నాయ్! ఆ ప్రశాంతతలో గలగల్లాడుతున్నయ్.....మా లచ్చిందేవి గాజుల గలగలు!!

నవ్వుకున్నాడు! సంతోషంతో శరీరం పుబ్బిపోయింది! అడుగులు వేస్తున్నాడు! ఆకాశం నిర్మలంగా వెలిగిపోతూంది!

పాడిపంటలున్న బంగారుభూమి! పాలు పెరుగులున్న పల్లె! కవ్వమాడని ఇల్లు, కదురు తిరగని కొంపా లేదు!!

మావూరు! ఇది మావూరు! పుల్లయ్య తనవూరును తలుచుకుని ఒక్కఎగురు ఎగిరాడు!

చిత్త చిత్తగించి, స్వాతి చల్లచేసి, విశాఖలో విసరకుండావుంటే, అనూరాధనాటికి అడిగినంత ఫలసాయం ఇస్తానంటుంది భూమాత! రోహిణిలో వర్షంకురిస్తే రోళ్ళు పండినపంట!

ఈవూళ్ళో గంగమ్మతల్లికి కొదవలేదు. వర్షాలు కొండల్లోకురిసే ఏరుపారుతుంది. కాలువలు నిండిపోతాయి. పంటలు పోవటం విచిత్రంగా వుంటుంది వీళ్ళకి. రెండేళ్ళక్రితం కోతలు కోస్తారనగా గాలివాన కొట్టింది, పూడ్చేసింది! పూడ్చేసినా ఈవూరివాళ్ళు చెయ్యి చాపలేదు. కరువు పెటిన మెట్టప్రాంతాలవాళ్ళకి సహాయం చేశారు.

ఇల్లాంటిది తన వూరు! ఇంత గొప్పది తన పల్లె! పుల్లయ్య తిరిగిచూశాడు. చిన్న తెల్లమబ్బు చందమామను కప్పేసింది. చిన్న గాలి చేనుమీద సవారీచేసింది! అవును, సకాలంలో పడింది ఇత్తనం. గాదెలు నిండవా? చప్పున తన విషయం తలుచుకున్నాడు. తన కొడుకు...కొడుకు! తనలా గిరజాలు తిర్చి, దొంగలను పట్టే దొర!...సకాలంలో పడ్డ ఇత్తనం, కాలం యెరిగిన కొడుకు ఒకటి! కార్తిలో పడని వర్షం, కాలంలో పుట్టని కొడుకు సమయానికి పనికిరావే!

పెళ్ళాం లేకుండా కొడుకెలా వస్తాడు!? పెళ్ళాంకన్న ఒళ్లు ముఖ్యమన్న పట్టుదలే ఇంకా పెళ్ళాం గురించి, తలుచుకోడానికి జంకు పుట్టిస్తోంది!

కాలు కదిపాడు!

ఎక్కడినించో...ఆ తియ్యనిరాగం!

"చందమామా!!"

పుల్లయ్య ఒళ్లంతా ఒక్కసారి మురిసిపోయింది!!

"నోమీ నోమన్నాల నోమన్నలాలో...!"

వహ్వా...బలే బలే...పెదాలు దప్పరించాడు. ఎన్నో గంధర్వాంగనల గాత్రాలలా కలిసి "చందమామా!"...

మళ్ళీ ఒకే స్వరం "నోమీ నోమన్నాల నోమన్నలాలో..."

పుల్లయ్యకు ఆ గొంతుక పిలిచినట్లయింది! పరుగు లెత్తి ఆ గొంతుకలో కలిసిపోదా మని పించింది!

తనే ఏమిటి? పిలుపువిని చందురుడే పరిగ్గా పోలేక ఇటు పరిగత్తి వస్తున్నాడు! లేజరిల్లిన చందమామ తెగ మురిసిపోతు న్నాడు.

"చందామామో!..." ఎన్నో స్వరాలు! చప్పట్లు కూడా వినిపిస్తున్నాయ్!

మళ్ళీ తన క్కాబలిసిన గొంతు మధురాతి మధురంగా "వాడి చేతులు పెద్దావని చేటలు కొవనివ్వ వే..."

"చందామామో!! చందామామ!!!"

పుల్లయ్య గప్పు గప్పు మంటూ గంతు వేసి వచ్చాడు. గుడి దాటాడు. ఏటి ఒడ్డున పడ్డాడు. ఆ స్వరం తనను లాగుకొంటోంది! ఏదో అనుభూతి మురిపింపచేస్తూంది!

వెన్నెలను యేరు మింగుతూ దిగువకు దిగ జారిపోతూంది!

అదిగో ఏటిఒడ్డున వంగిన చింతచెట్టు! చెట్టుపక్కన పాడుకబండి! ఆ బండిపక్కన చిన్న బయలు. ఆ బయలులో... ఆ వెలు గులో... తెల్లబట్టలతో పసందైన పల్లెపడు చులు!

నృత్యగానాలతో నీటుగా మెరిసిపోతు న్నారు. పుల్లయ్య మెల్లగా దొంగలా చెట్టు చాటున చేరాడు. కళ్ళతో వాళ్లని మింగే సేలా చూశాడు! మనసులో సరసాలతో తాను మురిసిపోతున్నాడు!

చప్పట్లు కొడుతూ ఎవమండుగురు వెనక పాటతో గొంతులేస్తున్నారు. వాళ్ళ చుట్టూ తిరుగుతూ, ఇంకో పడుచు ముందు పాట పాడుతోంది!

ఆ పాడుతోందే నీలమ్మ, ఊరంతా నీలి అంటారు!

నీలి వంగుతూ, వాలుతూ వయ్యారంగా చుట్టూ తిరుగుతూ, చెట్టు దరిదాపులలోనికి వస్తూంటే, పుల్లయ్య నరాలు వుబ్బిపోతు న్నాయ్. చెయ్యి పట్టకొని లాగి చేతితో వలివేద్దామని వుబలాటపడుతున్నాడు.

తెల్లని బట్టలు... పండువెన్నెల—బలిసిన శరీరాలు—విజృంభించిన యౌవనం. చల్లని గాలి, మెల్లని తియ్యనిపాట! హాయ్! హాయ్!

జాకెట్టులేని జవ్వనులు!
ముఖాన పసుపు, మెట్టల్లో జాజవులు! మళ్లీ పాట మొదలుకొచ్చారు!

"నోమీనోమన్నాల నోమన్నలాలో...
చందామామో!
వాడిచేతులు పెద్దావని చేటలుకొవనివ్వాడే
చందామామో!!"

పుల్లయ్య చేతులు చూసుకొన్నాడు. పెద్ద చేతులే! హాయిగారాగంతో తిరుగుతూ నీలి చెట్టుచాటుకు వస్తోంది!

ఆహా! ఆ విజృంభించిన యౌవన శోభంతా ఆ వక్షంలోనే వుంది. చూసిన పుల్లయ్య వెర్రెత్తిపోయాడు. మళ్ళీ తిరు గుతూ...

"వాడికడుపూ పెద్దాదనికడవలుకొవనివ్వవే"
చందామామో! చందమామ!!"

చప్పట్లు...లయ...లయకు తగట్లు అడు గులు, పడుతున్నయ్. మళ్ళీ నీలిచెట్టుచాటుకు చేరింది...నీలి అట్టే వలుపుగాని వలుపు... ఆ ముఖం అమాయకానికి నిలయం! అమాయ లేని తళుకు ఆ ముఖంలో వుంది!

ఒళ్లు విరుస్తూ మళ్ళీ గొంతుకెత్తింది
"వాడికాళ్లూ పెద్దావనీనిచ్చెనకొవనివ్వవే...
చందామామో! చందామామ!!"

ఆ ఒళ్లు విరుపు ... ఆ కళ్ళ తళుకు ... పుల్లయ్య మ్రానుకు అంటిపోయాడు!

"వాడిపళ్ళూ పెద్దావని పప్పొండనివ్వవే...
చందామామో! చందామామ!!"

పడుచులు చుట్టూ తిరుగుతున్నారు. పుల్లయ్య పట్టలేని మమకారంతో, మనసు కలిపానని, నిలిపానని, ముందుకు రెండు సార్లు నీలిచెయ్యి పట్టకోవాలని, వురుకుతూ ఆగిపోయాడు.

ఇక పదం చకచక నడిచింది...పుల్లయ్య ఉరకలు వేసున్నాడు.

"వాడి బొక్కినోటికి లెక్కల పలక్ర వాడి పట్టెబుర్రకి, పటుతలపాగో!"

"అమ్మో అలాంటి మొగో డెవరిక్కా వాల!" ఎవమండుగురూ తుర్రున ఎగిరి పోయారు తూర్పుదిక్కుకు. నీలిఇల్లు దక్షి ణానికి వుంది.

"నీలి నిల్చుంది! నిజంగా నీలి నిల్చుంది! ఒంటిగా...వహ్వా...వహ్వా...నా నీలి నిల్చుంది!

"నానీలి కదుల్తోంది...కదిలిపోతూంది!"

పుల్లయ్య పయ్యాట చెంగు పట్టి, పట్టి లాగాడు. వెనక నుంచి నీలి అదిరిపడి చూసింది...ఆ చాటుకి లాక్కుంటే "హా... దొం...గా!"

పుల్లయ్య మూతిమూసి గుండెకు హత్తు కున్నాడు, ముఖంలో ముఖంపెట్టి "దొంగ నో దొరనో చూడు! బాగా చూడు!"

"హాఁ హాఁ...నీకు న్యాయం కాదు. న్యాయం కాదు. దేముడు నీకు బాగానూడ్డు! వదిలే... వదిలే!"

నీలి గుమ్మరిస్తోంది, పుల్లయ్య వదల్లేదు. గట్టిగా అరవబోయింది. అరవలేదు. గుంజా టన పడుతోంది. విడిపించుకోలేక గిజగిజ లాడిపోతూంది.

మెట్టె వూడిపోయింది. మనిషి నలిగి పోయింది. అంతా అయోమయం!

ఉష్! అన్నాడు పుల్లయ్య ఒక్కసారి. కరిచి విడిపించుకున్న నీలి పరుగులెత్తింది. చేతిమీది కొటురాస్తూ "నిన్నే పట్టకోక పోతే!" అంటూ తిలాడించాడు. వెళిపో తున్న నీలి "సిగ్గులేదూ?" అన్నట్లు విని పించింది.

* * *

4

త్రల ఆడించుకుంటు నాలుగడుగులు వేశాడు. తిరిగి చూశాడు. నీలి కనబడలేదు. కాని నీలి తన దగ్గరే నిల్చున్నట్లనిపించింది. పెదవు లొకసారి చప్పరించాడు. తస్సదియ్యా, ఎక్కడ పోయిందనుకుంటూ ఇంటివేపు నడిచాడు.

పాదాల చప్పుడు విని నిల్చున్న పోతులు తేరి జూచాయి. కన్నులు తెంపుకొని దగ్గ రకు రావాలని వురుకుతున్నయ్. గబగబ పెరటిలోకి వెళ్ళాడు. గడ్డిమేటినుంచి గడి

కలకలలు

పంతులు (ఒక విద్యార్థితో): షర్షా ఎప్పటిదాకా రాజ్యము పరిపాలించాడురా?

విద్యార్థి: చనిపోవు వరకును పాలించెను.

* * *

భార్య (భర్తతో): మన గుమస్తా నాలుగురోజులనుండి తప్పించుకు తిరుగుతున్నాడండి!

భర్త: పోని తిరగనియ్. "తప్పించుకు తిరుగువాడు ధన్యుడు సుమతీ" అన్నారు పెద్దలు.

* * *

స్నేహితుడు (మరొకనితో): ఆ...తర్వాత...నీ భార్యను నోర్మూయ్యి అన్నాక......

-ండవవాడు: ఇంకేముంది. గభాల్న వచ్చి నా నోరు మూసేసింది.

కలంశ్రీ—బొచన్నపేట.

లాగి పోతులముందు వేశాడు. ఆకలితో వున్న పోతులు అమాంతంగా మ్రింగేస్తున్నయ్. నిల్చున్నాడు. పోతుల ఒంటిమీద దర్జాగా నిమిరాడు.

పైన వెన్నెల. పోతులు గడ్డితింటూ చిన్న శబ్దం చేస్తున్నయ్. చిరుగాలి వీస్తోంది. నులకమంచం వాకిట్లో వెన్నెల్లో వేసుకున్నాడు. కూర్చున్నాడు. పెరటిలో వున్న రావిచెట్టుమీద పిచ్చుకలు కిచకిచలాడుతూ చిన్న అలజడి చేస్తున్నయ్.

"చందామామో" పదం ప్రతిధ్వనిస్తోంది! చందమామ వేపు చూస్తున్నాడు. పొంగే సముద్రంలాంటి ఒళ్ళు పొంగిపోతూంది! నీలి....చరచరా తప్పించుకుపోయింది! పిట్ట!

మీసాలు సర్దుకున్నాడు. దానితో సరసాంతో మురిసిపోకపోతే యీడు పుల్లయ్యే కాడు! మల్లునాయుడు కొడుకే కాడు!

పోతులు చారబడ్డాయి. పుల్లయ్య వాకిటి నుండి మంచమెత్తి గుమ్మందగ్గర వేశాడు. గుడ్డియిల్లు గుమ్మటంలా వుంది. అటున్న చందురుడు ఇటు వచ్చాడు.

నిద్దరపట్టలేదు. ఇంకా డప్పుల మోత విని పిస్తునే వుంది. ఒక్కసారి తనెంత మారిపోయానో అనుకున్నాడు! "యీ యేళ పోతులకి గడ్డెయ్యటం మరిసిపోనాను... నీలమ్మతల్లికి మొక్కటం మరిసిపోనాను... అంతా మరుపే!

ఏనాడూ పుల్లయ్యలో మరుపులేదే! ఏనాడూ ఆడాళ్ళకి దూరంగా వున్నాడే! ఈ నాటికి ఆడదానికి లొంగిపోయాడే!

"ఛా! ఛా! యేం బతుకు! ఆడదానిచేత సిగ్గులేదూ అనిపించుకున్నానే!"—

ఇలా చాలా సేపు గింజుకున్నాడు. తన గుండె ఎప్పుడు తెల్లారుతుందని ఎదురుచూసింది! చూస్తూవుండగానే కంటిరెప్పలు బరువెక్కిపోయాయి.

తెల తెలవారేసరికి పొలంలో కత్తవ తోరిగ భుజాన్న వేసుకుని పుల్లయ్య గట్టు చుటూ తిరుగుతున్నాడు. ఉదయాద్రి ముఖాన్న వెలిగే బాలభానుని కిరణాలు. పచ్చని ఆ ప్రకృతి పైబడి, పులకరింప చేస్తున్నయ్. అక్కడక్కడ మెరకనుంచి పల్లంకు పారే జలం చిన్న జలజల శబ్దం చేస్తోంది. చిన్నగాలికి చేను చేసే గలగల శబ్దం! ఆ లేతఎండలో వరి ఎన్నులు హారం పడ్తున్నాయ్!

బారెడు పొడవున చేను, జానెడు పొడవున్న యెన్నూ! ఈ ఏడు రోళ్ళు నిండిన పంట తప్పదు.

ప్రక్క పొలంనుంచి పీస వరిసింహులు "ఓరయ్యా! యీ యేడు మిడత మచ్చుకొకటి లేదురా!" అరిచాడు. వరిసింహులను వూళ్ళో వారంతా ఇంటిపేరు పెట్టి పిలుస్తారు.

"మిడతలా? సేనిముంగటి కొస్తే పంపేసి వలిపియ్యనూ" అన్నాడు. పుల్లయ్య పట్టుదలతో అరచిన అరుపుకు చేను వూగుతోంది. చిన్న బుడబుడ శబ్దం. బుంగ నీటిని మింగుతోంది బొరిగతో బుంగని కప్పుతున్నాడు.

బుంగ కప్పటంవల నీరు మ్రింగలేదు. ఇంతలో పీస తన గట్టు మీదకు వస్తూ "యింకేంరా గట్టునున్న గడ్డి కోశావుకాదు?

"కోశాను. మళ్ళీ పెరిగిపోతంది. పెరగనీ పెరగనీ. ఈ వూరుపశువులనోట శెనంటేనా? మనూరంటే యేంటి? బంగారం! బంగారం!"

పుల్లయ్య మాటలకి పీస నవ్వాడు. తన తరవాతతరం వూరిని చూసి గర్విస్తోందని.

"దిగవపొలాని కెళ్ళావా?"

"ఓ! అందులో యీ యేడు చేను తెగ బలిసిపోనాది!"

"నీకేంరా? ఒక్కటి లోటు!"

"నాకా? నాకేంలోటు? నాకులోటన్న మొగాడెవడూ?"

"పట్నం బుగతోరి రెండెకరాల పొలం అంబారానికి దున్నుతున్నావా? మీ అయ్య గడించింది యేభైసెంట్లున్నాయా? మరి నీకడుపే పెళ్లం అని యెప్పుడూ యేడిస్తే... ఈ ఒళ్లు యినపదిమ్మ యిలాగ వుండిపోడానికి?—యినపదిమ్మే తుప్పు పట్టిస్తాది—కాలూ సెయ్యికి అయ్యేవో ళుండాలంటావా"

పీస ఇదివరకులా ఇప్పుడూ పెళ్ళి చేసుకోమంటున్నాడే. కోపమేమీ లేదు. పుల్లయ్య కొరకొరా చూడలేదు. చిరునవ్వు నవ్వాడు. ఎదురగావున్న మనిషి బుగ్గమీసాలు ఆడుతున్నయ్! చీకికళ్ళతో చూస్తున్నాడు. చిన్న నవ్వునవ్వాడు. "నాకైదుగురాడపిల్లలు, ఆరుగురు మొగపిల్లలు సుమా!" అన్న గర్వం ఆ తీవిగా నిల్చున్నవాడిలో కన్పిస్తునే వుంది.

పంచయెగగట్టిన పీస ఒంటిమీద బట్ట లేదు. సగం నెరసిన తలగోక్కుంటున్నాడు. "నీకు తెలీదు! నూశావా? జపానోడు వస్తాడనుకున్నాను. పిల్లలనుబట్టి భూమి పంచేస్తాడనుకొన్నావా? ఆడు ఓడిపోనాడని పట్నంలో మొన్న అనుకుంటున్నారు. నాను నమ్మలేకపోనాను. పొట్టోడికి పుట్టెడు బుద్ధులుకదా? ఏ మంత్రమో, తంత్రమో యేసి, తెల్లోడిని మోసంసేసైనా రాజ్యం యేలతాడనుకున్నాను! పోనీ యిప్పుడేం పోనాది? కాంగ్రెసోడు రాడా? ఆడూ జపానోడిలాగే యెక్కువమంది 'పిల్ల' లున్నోళ్ళకి యెక్కువ భూమి వుండాలంటాడటలే."

పుల్లయ్య నవ్వాడు? పీస పట్నం పీడరు బాబు నాలుగెకరాల పొలం దున్నుతున్నా, ఇప్పటికి పదేళ్లయింది. రెండుసార్లుఅంబారం ఇవ్వలేకపోయాడు. ఇచ్చేదామని వుబలాట పడ్డాడు. పీడరు వూరుకోలేదు కోర్టు కెక్కించాడు. ఉన్న జిరాయితీ పొలం అమ్మేసి అంబారంసొమ్ము కట్టాడు. కోర్టుకు తిరిగాక గేనం కలిగింది. లోకం పోకడ తెలిసిందని పీస చెప్పుకుంటాడు. ఊళ్ళో తన ఈడువాళ్ళు పీస మాపెద్ద తెలివైనోడంటూంటారు.

పుల్లయ్య పద పోదాం అన్నాడు.

పీస యెగువపొలాని కెళ్లొస్తా నన్నాడు. ఒకడుగు వేస్తూ "ఓరయ్యా! గాంధీమహాత్ముడున్నాడే! మారాజు-దేవుడితో సమానం!"

"ఓ ఓ! దేవుడే" అన్నాడు పుల్లయ్య!

"అలాంటి దేముడు మాపెద్ద పట్టుపటాడట! నూడు—కాంగ్రెసోడు రాజ్యం ఏలక

దగాపడినతమ్ముడు

మానడు! ఆగోచ్చాడూ అంటె—నున్నే నోడిదేపాలం అవుతాదంట! అయ్యా పుల్లిగా పెద్దరైతుకి ముప్పై ఎకరాలపొలం. ఒకకొడుకే అలా వుండానికి వీలుండదే! అడికంటె నాను పెద్దరైతు నవ్వాల. కొలమానం ఎలా తిరుగుతాదో? యోగం ఒకింటోడివైతే! ఒంటి కచ్చివా యిపుడు"...

పుల్లయ్య కులాసాగా నవ్వాడు. కొడుకు జ్ఞాపకానికి వచ్చి చరచరా నడిచాడు. గట్టుమీద నడుస్తూనే ఆగిపోయాడు. కొడుకు ముందు భుజాన చోరి గేసుకొని మిలటరీ మనిషిలా నడుస్తున్నట్లనిపించింది. ఒళ్ళంతా కళ్ళయి కొడుకు రీవిని చూస్తూ మురిసిపోతున్నట్లు భ్రమపడిపోతున్నాడు.

కొడుకు! నా కొడుకు! వాడిని ఎత్తుకుని ముద్దులాడా లని తను పిల్లి మొగేసి పాదాల దగరకు యొకబ్రాకి యొక్కినిల్చుని భుజాలు తడే వీరుడు తన కొడుకు...కొడుకు!"

గట్టుదాటి, పుటదాటి, గోడ్డుదాటి, మురగడి పొలందాటి, గుడిదాటి తిన్నగా ఆదెమ్మప్ప ఇంటివేపు వెళ్ళాడు.

ఆదెమ్మప్ప వూరంతటికీ అప్పే. చెవులకు నాగులూ, చేతులకు మురుగులూ. ముప్ఫయి యేళ్లప్పుడు మనిషి ముదరకుండా నిగనిగలాడింది. అప్పటికి ఒక్క రెకూతురు. మనిషి ఇరవై యేళ్ళదానిలా వుండేది. చిక్కితే రక్తంవచ్చే వంటిబింకం! అలాంటప్పుడు మొగుడుపోయాడు. మారుమనుం వెళ్ళమని చాలామంది చెప్పారు. పెద్దనాయుళ్ళు కోరివచ్చారు! ససేమిరా కాదంది! సూద్దాం దీనిపంతం అన్నారు. నడుంకట్టుకొని ఎలాగ ఇంటిలో ఇంకొకడ్ని సూడకండా వుంటుం దని...ఆ ఒక్క కూతుర్ని మేనల్లుడికిచ్చి ఇల్లరికం తెచ్చుకుంది. ఉన్న ఆస్తితో, నిలుపుకున్న శీలంతో వూరందరికీ అప్పయింది! ఈ యేభయోపడిలో వూరిలో ఎవరికి యే సలహా కావాలన్నా ఈ అప్పదగ్గిరకు రావలిసిందే.

పులయ్య వచ్చాడు. అరుగుమీద అప్ప బెండకాయలు పులుసులోకి తరుగుతోంది! చూడగానే చిన్ననవ్వు నవ్వింది.

"అడుగో వచ్చాడు! పెళ్ళి పెడాకులు లేని పాపడు!"

పుల్లయ్య అరుగుమీద అప్పదగరగా కూర్చున్నాడు. ముదర బెండకాయలవేపు చూస్తూ.

"అప్పా! పంతం వచ్చిందే!" అన్నాడు.

"బెండకాయలా ముదిరిపోనావు! ఈ వయుసుదాకా మన జాతిలో యెవరూ నేరురా! పెళ్ళి గిళ్ళి అయితే పంతాలెందుకొస్తాయ్! ఎవురితో యేం తగువు తెచ్చినావ్?"

పులయ్య చెప్పడానికి సిగ్గుపడ్డాడు. అప్పతో సెప్పకపోనే ఈలుపడదే? పెద్ద దిక్కు మరి! తెగించి చెప్పేశాడు.

"ఇన్నాళ్ళూ ఒక్కళ్ళ పాడవుతాదని పెళ్ళొద్దన్నాను కానీ..."

"ఏటి, ఏటి! పెళ్ళా పెళ్లా! నానాయనా! ఎంత మంచికబురు సెవిలో యేసినావురా! ఒక యింటోడివైతే...నీ పిల్లా...నీ జెల్లా....!"

పుల్లయ్యకు ఇంకా సిగ్గు చావలేదు. ముఖందించుకొని బొరిగతో గడపమీద మెల్లిగా పొడుస్తున్నాడు.

"మరి నాయనా! బంగారం యేమాత్రం వుంచినావు?—మన కులాచారంబట్టి పెళ్ళి నీ యింట్లో చెయ్యాలికదా? నువ్వంటే యెవర్తె వలచి రానంటాది?"

ఆమె ముఖంలోని ఒకనాటి అందచందపు శేషాలు కన్పిస్తూనేవున్నాయ్. కత్తిపీట ప్రక్కకు నెట్టి సర్దుకు కూర్చుంది. పుల్లయ్య వేపు చూసింది! రెండో అరుగుమీద కూతురు రాట్నం త్రిప్పుతోంది. ఎదురుగా పసువులసాలనుంచి ఆవులు తోలుకుని, మందకు పోతున్నాడు కాపరి! అప్ప అంది-

"మరి సెప్పు బంగారం యెంతుంచి నావో?"

"ఏవుందప్పా? నీకు తెలీదా? ఆ ఉన్న భూమిమీదే యేనైనా తీసుకరావాల!"

"దానిమాటకేంగానీ"..."

పుల్లయ్యకి నాన్సటం యిష్టంలేనట్లు గబగబ బొరిగ అక్కడ వదిలి అన్నాడు:

"అప్పా! మరి పంతం వచ్చిందే! నివ్వెళ్లి ఆ...నీలి!"

అప్ప బుగ్గమీద చెయ్యివేసి ఆశ్చర్యంగా చూసింది...చప్పున మాటాడలేక తికమక పడింది.

"ఇదేంటిరా నాయనా! ఎత్తైతి యెంగిలాకుమీద కావేసినట్టు! నువ్వంటే -ఏకూ పురేకలపాప రాదు?"

"అప్పా! మరి అడ్డుపెటకే! నాకు పంతం వచ్చిందని సెప్పినానుకదా?"

"తొందరపడకురా! నాయుడోరిబొటి నారాయణమ్మ మోజుపడి వస్తానంటే వద్దన్నావ్! ఈ వూర్లో పెద్దింటియేయెలవోడు నీకు బొట్టి నివ్వనంటాడు? సూడు నామాటిను! ఆ నీలా? ఏం సూపురేఖల నేవు! పోనీ, కన్నారిది రూపాయన్నర కోక పాలైనా తెచ్చుకోలేదు!"

"అప్పా అప్పా!" ఆగిపోయాడు.

"అది సెల్లక వుండిపోనాది! అతోరింటి కెళ్ళితే నువ్వు కాళ్ళు సేతులూ తీసుకు రావాల! తొందరపడకు నాయనా! బంగారం పళ్లెంలాంటిదానికే గోడసేరు వుండాలంటారు! ఏదో ఒక పెద్దింటిపిల్లని సేసుకుంటే-నీ కెవరున్నారు మరి? -కష్టాల్లోను నష్టాల్లోనూ సాయపట్టారు."

పుల్లయ్య తలదించేశాడు.

కంటి యెదట నీలి...ఆ విజృంభించిన యౌవనంతో వక్షం! ఆ కౌగిలి...ఒళ్లంతా జలదరించింది! పెదవులు చప్పరించుకొన్నాడు! నిన్నే పట్టుకోకపోతే...తన పంతం...సిగ్గులేదూ అందే? ఛాఛా పంతం పంతమే!

ముఖమెత్తి "అప్పా" అన్నాడు. అప్ప ఆతృతతో మనసు మార్చుకున్నాడేమోనని చూసింది.

"అప్పా! ఏం లేకపోయినా అది రెండు సేతులు తెచ్చుకోదా? రైతోడి కాళ్లుసేతులు గట్టిగా వుండాలికానీ...!"

అప్ప చిరాకుగా అంది "నానెందుకు యింత సెపున్నానో యినిపించుకున్నావు కాదు! దానికా ముసల్ది తప్ప మరెవరూ లేరు. అది మనవరాలియింటే వస్తాది. రేపొద్దున్న అది గుటుక్కుమంటే నువ్వే నెయ్యాల? నికున్నదెంత? నలుగురు పిలాజెల్లా అయితే యెక్కడుంటావ్? కోరి ఇందరు పెద్దింటోళ్ళు నీ కాళ్ళమీదకు వస్తూంటే, వస్తున్న సంపదని తన్నుకుంటూవురా?"

పుల్లయ్య—తెలిసిన వేదాంతంలోనికి దిగాడు "అప్పా! ఉన్నపుడు రెండు, ఎలిపోయేటప్పుడు రెండు, మనిషియెంట వుంటాయంట! ఆ కీర్తి, అపకీర్తి దానితోనే పడతానులే! నీమీదే యీ పెళ్ళి భారమంతా యేస్తున్నాను!"

అప్ప లేచింది: "నాయనా! యీ పెపంచకంలో యెలాగో బతకలేవా? నీళ్ళో, పాలో గంజో గడుగో అపుట్టించినోడు యివ్వడా? పెద్దింటి అల్లుడివయితే, ఎక్కడైనా పావలా డబ్బులకి పరపతి వస్తాదని యింత సెప్పినాను. ఆ నీలి అదుపం అలాగుంటే నేను యింత సెప్పటం తప్పే! నాను పెద్దదాన్నని నామీద భారమేసినావు కనక, నీ యమ్మ వుంటే ఎలాగయ్యేదో నానూ అలాగయాను. అందుకే యిన్ని మాట్లాడాను. నీ దగ్గర నీ మాటా, నాదగర నామాట అడటం నాకు తెలీదు. మనుసులో వున్నది మొగమాటం లేకుండా అనేశాను. తప్పకండా దాన్నే సేసుకో! అది యింటికొచ్చిన ముహూర్తాన నీ యిలు లచ్చిందేవితో గలగల్లాడి పోకూడదా? మాలాంటోళ్ళం మీ బాగుకోరతాం గానీ బష్టు కోరతామా? మా అమ్మిని అడగటానికి పంపిస్తాను...బంగారమా?"

పుల్లయ్య లేదన్నట్లుగా ముఖంపెట్టాడు. అప్ప చిన్ననవ్వు నవ్వి: "ఆ ముసల్ది కూటికి తక్కువదైనా కులానికి తక్కువదిగాదురా? యెన్నడక్కండా మనవరాల్ని పెళ్ళికిస్తాది? సరే నువ్వెళ్ళు-పోతులు కడగవా? నానేదో సూస్తాను!"

పుల్లయ్య ముఖం వెలిగింది. అరుగుమీద నుంచి వురికి బొరిగ పటుకొని వుల్లాసంతో విజిలు వేసుకుంటూ వెళ్ళిపోయాడు.

—ఇంకావుంది

భీష్ముడి పెళ్లి

పడకకుర్చీలో నడుంవాల్చి సిగరెట్ కాలుస్తూ, ఆలోచిస్తున్నాడు ప్రభాకరం. పెళ్ళిచేసుకొన్న తన స్నేహితుల్ని ఒక్కొక్కర్నే జ్ఞాపకానికి తెచ్చుకుంటున్నాడు.

'సూర్యచంద్రరావుకు పెళ్ళయి నాలుగేళ్ళన్నా కాలేదు. అప్పుడే ఇద్దరు పిల్లలు. మూరి పెళ్లయిన ఏడాదికే పిచ్చివాడయిపోయాడు. సుభద్ర పెళ్ళయిన ఆరేళ్ళకు, అత్తతో పోట్లాడి, బావిలో పడి చచ్చిపోయింది. కాంతమ్మకు ఒక జీవచ్ఛవం! సుబ్బరామయ్య అల్లుడు ఆయన కూతుర్ని పెళ్ళిచేసుకొన్న పాపానికి ఆయనకు బానిసగా పనిచేస్తున్నాడు. అతణ్ణి చూస్తే యెవరికైనా జాలేస్తుంది. కానీ అతను మాత్రం తను సుబ్బరామయ్యంతటి ఘరానామనిషి అల్లుడిననే గర్వంతో మురిసిపోతూ వుంటాడు. ఆ గొప్పకోసమే అంత అడవా చాకిరీచేస్తూ కూడా తృప్తిపడుతున్నాడేమో! ఆ పెళ్ళి చేసుకోనప్పుడు, అతను ఎవరికీ లొంగని పొగరెక్కిన ఆంబోతులాంటివాడు. బాబాయి కూతురు సరోజ పెళ్ళవకముందు ఉత్సాహంతో తుళ్ళిపడుతూ వుండేది. ఇప్పుడు నలుగురు పిల్లల్ని కనేసి పిచ్చెత్తిన స్కెలిటన్‌లా తయారయింది. ముషిది కూడా ఇంతకన్న మంచి బ్రతుకే బ్రతుకుతుంది. తను మనిషినేననే విషయం ఎప్పుడూ మరచిపోదు. ప్రాణంమీద ఆశతో, ఆత్మవిశ్వాసంతో నడుస్తూ వుంటుంది. సరోజ నడుస్తూవుండగా చూస్తే కడుపులో ప్రేవులు డోక్కుంటాయి. హఠాత్తుగా కళ్ళు తిరిగి క్రిందపడాల్సివస్తుంది. ఇలా ఎందరైనా వున్నారు.

వీళ్ళందర్నీ చూస్తూకూడా యెలా పెళ్ళి చేసుకోవడం? మనిషి జీవితం అర్థం కానంత వరకు పెళ్ళిచేసుకోకూడదు అలా అనుకుంటే జీవితం ఎప్పటికీ అర్థమయ్యేలా లేదు. నిజానికి తనలాంటివాడు పెళ్ళికి అనర్హుడు.

తన సంపాదన తనొక్కడికే చాలదు. తను పెళ్ళిచేసుకొని కాపురం పెడ్తే, ఇద్దరూ కష్టాలనుభవించాల్సిందే. తెలిసి, కావలసి కష్టాల్లో ఇరుక్కోవడ మెందుకు? పెళ్ళయి పిల్లలుపుట్టి, సంసారం పెద్దదయి, జీతం చాలకపోయి, అకారణంగా మనసు చెడిపోయి, నిత్యం ఇంట్లో పోట్లాడుతూ, చికాకుపడుతూ, ఇంటిని, జీవితాన్ని నరకంగా చేసుకోవడ మెందుకు?

ఒక్క ఆర్థిక కారణాలే కాదు. ఆ వచ్చే భార్య అనుకూలవతే అవుతుందని గ్యారంటీ ఏముంది? పోనీ తనైనా, బుద్ధిగా దయగా స్నేహంగా వుండబోతాడా? అప్పటికి తనూ దుర్మార్గుడు కావచ్చు. ఎంతమంది మారిపోవడంలేదు పరిస్థితులు ఎంతమందిని క్రూరుల్ని చేయడంలేదు.

తనభార్యకు తను అర్థంకాక పోవచ్చు. తన అలవాట్లు నచ్చకపోవచ్చు. తన 'జీవనస్థాయి' ఆమెకు తగ్గకపోవచ్చు. తనముఖం ఆవిడకు వికృతమూ,భయంకరమూ కావచ్చు.

రాజేంద్ర

ఆమెమాటా తీరూ తనకు నచ్చకపోవచ్చు. ఏది ఇష్టపడకుండా తప్పనిసరయి. 'ఎడ్జెస్ట్' అయి ఒకసీటులో ఇద్దరు ప్రయాణికులు ఇరుక్కు కూచున్నట్లు ఏంజీవితమది? రోత...కంపు...! ఎందుకలాంటి దాంపత్య జీవితం! పెళ్లి చేసుకోవడమంటే, శాంతిని, ఖూనీ చేయడమే అవుతుంది. పెళ్లిచేసుకొని కలతలతో, కష్టాలతో, కుళ్లిపోతున్న జీవితాలు వందలు, వేలు కనిపిస్తున్నాయి. ఎక్కడో షికారుకే కొత్తదంపతులు కనిపిస్తారు—నవ్వుతూ, తుళ్ళిపడుతూ...! వాళ్లు గతకాలపు జీవితాలకు నమూనాలు. లేదా రాబోయే శుభదినాల జీవితాలకు నమూనాలు. అంతే. వాళ్లయినా ఎన్నాళ్ళలా వుంటారు...సమస్యలు మీదపడి నలిపి నాశనం చేయవా?...వాళ్ళ ఆనందాన్ని మింగి, జీవితాన్ని ధ్వంసంచేయవా?

ముఖ్యంగా తనలాంటి మధ్యతరగతి వ్యక్తి పెళ్ళి చేసుకొని పిల్లలు కనడానికి అనర్హుడు. ఇప్పుడు కాలం కొంత ప్రశాంతంగానే గడిచిపోతోంది. దాన్ని నాశనంచేసుకోవడ మెందుకు? ఎవరెంత బలవంతం చేసినా లొంగకూడదు. మిత్రులతో ఇదే చెప్పాడు. తను పెళ్ళి చేసుకోనుగాక చేసుకోనని అరిచాడు. వాదించాడు. స్నేహితులూ వాదించారు. దాంపత్యజీవితంలో ఎంత ఆనందం, ఎంత ప్రశాంతత వుందో ఉదాహరణలతో మహామహుల మాటలను ఉటంకించి, వివరించారు. శృంగారజీవితంలో మానవుడు అందుకొనే ఆనందపు టంచులను వూహించలేవన్నారు. కుటుంబజీవితంలో మనిషికి లభించే ప్రశాంతత, తృప్తి ఇంతింత కాదన్నారు. పురుషార్థాలలో కామమొకటి గనుక పెళ్ళి చేసుకొని పిల్లల్ని కనడము పురుషునిధర్మమని దానినతిక్రమించడం పాపమని, హెచ్చరించి, వినాశానికి లోను కావద్దని ఉపదేశించారు. బ్రహ్మచారి ఏయే పాటు పడాల్సివుంటుందీ చిలవలు పలవలుగా చెప్పి భయపెట్టి చూశారు. జుట్టూజుట్టూ పట్టుకునేవరకు వాదించుకున్నారు. రోజుల తరబడి అలా వాదోపవాదాలు జరిగాయి. తేలింది సున్న! వాళ్ల అభిప్రాయాలు వాళ్లవే అయినవి. తన నిశ్చయం తనదే అయింది.

దరిమిలా ఉద్యోగంలో ప్రవేశించిం తర్వాత కూడా ఎన్నో జీవితాల్ని తను పరిశీలించాడు. భార్యాభర్తలమధ్య కలతలు... అనుమానాలు, ఆర్థికపు వొడిదుడుకులు, అభిప్రాయభేదాలు, అభిరుచుల్లో భేదాలు, ఆత్మల అంతరాలు, భిన్నస్వభావాలు, ఒకరిపనికి, ఒకరిమాటకు ఒకరు అడ్డుపడటం, కలహించుకోవడం, మానసిక ఆందోళనకు గురికావడం, పిచ్చెత్తడం...అత్తాకోడళ్ళ పోట్లాటలు, ఇల్లంటే భయపడే మగవాళ్ళు, పుట్టింటికి పారిపోయే ఇల్లాళ్ళు; భర్తల్ని విషంపెట్టి చంపేసేభార్యలు, భార్యల్ని ఖూనీచేసే భర్తలు...ఒకరిబంధువుల్ని ఒకరు అవమానపరచడం, పిల్లల్ని పెంచలేకపోవడం, వాళ్ళను సరయినమార్గంలో పెట్టలేక 'జాతి'ని నాశనంచేస్తున్న పాపాత్ములు; తమపిల్లల్ని రౌడీలుగా, దుర్మార్గులుగా, అపమరులుగా, పిరికిపందలుగా, కురూపులుగా, కుత్సితులుగా, చచ్చులుగా తయారుచేస్తున్న తల్లిదండ్రులు...వ్యభిచారులు, తండ్రులు తెలీని పిల్లలు, తల్లులే తెలీని పిల్లలు, ఎన్ని

★ భీష్ముడి పెళ్ళి ★

యెన్ని యెన్ని... యెన్నెన్ని, యెన్నెన్ని..." అతనిబుఱ్ఱ వేడెక్కింది. మరో సిగరెట్ ముట్టించాడు.

*   *   *

రోజులు గడిచాయి ప్రభాకరం పెళ్ళిచేసుకోలేదు. చేసుకోవాలనే ఉద్దేశమూ కలగలేదు. స్నేహితులు, బంధువులు, ఆడపిల్లల తండ్రులు... తమ ప్రయత్నాలు విరమించలేదు. 'యోగ్యుడైన' ఒక యువకుడు బ్రహ్మచారిగా వుండిపోవడం 'సంఘ' ద్రోహ్యమని ఎంచిన పెద్దలిద్దరు వారంరోజులు అదే పనిగా ప్రభాకరంమీద దండెత్తి...ఓడిపోయి, పారిపోయారు. మిత్రుడొకడు ఒకోసారి 'దస్తా' కాగితాల్లో ఉత్తరాలురాసి, ఆఖర్న, ఆ ఉత్తరాలను అతను చించి చూడటమే లేదని తెలుసుకుని, తనను తాను నిందించుకొని తోక ముడుచుకొని వూరుకొన్నాడు.

ప్రభాకరం ప్రసిద్ధుడయ్యాడు. 'బ్రహ్మచర్యం' ఎంత ఆరోగ్యకరమైనదో, ఎంత మంచిదో వివరిస్తూ, వివిధ పత్రికలలో వ్యాసాలు, నాటకాలు రాసి ప్రచురించి, ప్రదర్శింపించాడు. ఉపన్యాసాలిచ్చి అనేక యువ బ్రహ్మచారులకు ప్రోత్సాహం కలగజేశాడు. అనేక దూషణ, తిరస్కారాలను ఎదుర్కొన్నాడు. వాటిని ఖాతరు చేయకుండా నిబ్బరంతో తన దీక్షను నిలుపుకొన్నాడు ప్రభాకరం.

క్రమంగా అతని 'సర్కిలే' వేరయిపోయింది. బంధువులు, ఆత్మీయులు, హితులు ...దూరమై ఒక కొత్తవర్గం అతని చుట్టూ చేరింది. క్రమంగా 'పెళ్ళినిగురించి' 'జీవితాన్ని' గురించి ఆలోచించడం మానేసి, తను ఏర్పరచుకొన్న అభిప్రాయాల్ని ప్రచారంలోకి తీసుకురావడానికి మాత్రమే కాలాన్ని వినియోగిస్తూ వుండిపోయాడు.

*   *   *

ఒకరోజు సెలవునాడు ప్రొద్దుట, కాఫీ త్రాగి కిళ్ళీనములుతూ కూర్చున్నాడు ప్రభాకరం. పడక్కుర్చీ అనే కనకపు సింహాసనం మీద విజయవంతుడైన 'బ్రహ్మచారి చక్రవర్తి' కూర్చున్నాడు. అప్పుడే పోస్టుమన్ ఒక కార్డు తెచ్చిచ్చి త్వరత్వరగా నడిచి వెళ్ళిపోయాడు. ప్రభాకరం తనకూ పెళ్ళి చేసుకోవద్దని సలహాయిచ్చి, వొప్పుకోకపోతే తంతాడని కాబోలు అతను పారిపోయాడు! ప్రభాకరం అతని కంగారుచూసి నవ్వుకుంటూ, కార్డులోని గుండ్రని అందమైన అక్షరాలమీదికి దృష్టి సారించాడు.

"డియర్ భీష్ముడూ,

భయంభయంతో నీకీ ఉత్తరం రాస్తున్నాను. ఇక్కడికొచ్చి తంతావేమో నని భయం! నేను లక్షణంగా పెళ్లి చేసుకొన్నానని వినయంతో విన్నవిస్తున్నాను. క్షమించు...అందరిలాగే నేనూ నీకు శుభలేఖ పంపలేదు. నువ్వు శుభలేఖలుచూసి చాల వీళ్ళయిందనుకొంటాను.

నాకు ఈ వూరు బదిలీ అయింది. నువ్వు మరికొంత దగ్గరయ్యావు! మా శ్రీమతి ఇప్పుడు ఇక్కడే వుంది. నువ్వోకసారి మా యింటికి రావలసిందిగా కోరుతూ ఆహ్వానిస్తున్నాము. వీలయినంత త్వరగా బయలుదేరి రాగలవని నమ్ముతాను.

నీ, కృష్ణమూర్తి."

టక్కుమని లేచాడు ప్రభాకరం. పర్సు తీసి జేబులో వుంచుకొని ఇంటికి తాళంవేసి వీధిలోకి వచ్చాడు. పరుగెడుతున్న రిక్షాను కేకవేశాడు "అనరూపాయ్ ఎక్కువిస్తాను. త్వరగా తొందరగా వెళ్ళు" అన్నాడు. రిక్షావాలా తల 'టాక్' అన్నట్లు వూపాడు రిక్షా ఎక్కాడు రిక్షా తారురోడ్డుమీద జారుతూ తుఱ్ఱుమంది.

*   *   *

తన ఎదుట నిటారుగా నిల్చున్న ప్రభాకరాన్ని చూసి నిజంగా మూర్ఛపోయాడు కృష్ణమూర్తి. ప్రభాకరం కంగారుపడి, నీళ్ళకోసం ఏదో తంటగదివంటగది కనిపిస్తే పరుగెత్తాడు అక్కడో సుందరాంగి తనలో తాను రాగం తీసుకొంటూ, సన్నగా నవ్వుకొంటూ కూర్చుని, ఎఱ్ఱని టొమేటో పళ్ళ తోలు తీస్తూ వుంది ఒక్క నిముషం నిలిచి ఆ ఎఱ్ఱని వేళ్ళ కదలిక గమనించి, ముందుకురికి, గ్లాసుతో నీళ్ళు తీసుకొన్నాడు ఆ అమ్మాయి హడలిపోయి వెనక్కి పడిపోయింది.

నీళ్లు తెచ్చేసరికి కృష్ణమూర్తి లేచేశాడు.

జాలిగా మిత్రుడికేసి చూశాడు. ప్రభాకరం నవ్వాడు. కృష్ణమూర్తికూడా నవ్వుతూ లేచి ప్రభాకరం చేతులు పట్టుకొన్నాడు.

"ఇదిగో మా ప్రభాకరం"—అన్నాడు కృష్ణమూర్తి, దూరంలో బెదురుతూ గోడకు

అంటుకు పోయి నిల్చున్న తన భార్యకేసి నవ్వుతూ చూస్తూ!.

"ఎవరో అనుకున్నా! నిజంగా హడలి పోయాను. కూర్చోండి. ఇద్దరూ చాలమంచి పనిచేశారు గానీ...ఒక్క నిముషం కూర్చున్నారంటే, కాఫీ యిచ్చేస్తాను" అని ఆమె లోపలికి వెళ్ళింది.

మిత్రు లిద్దరూ కూర్చున్నారు.

"ఇంత హఠాత్తుగా దిగుతావనుకోలేదు. అయితే తప్పకుండా వస్తావనిమాత్రం అనుకున్నాం. ఎందుకంటే పెళ్ళియిన స్నేహితులమీ దేగదా...నీ పరిశోధనలు! అందుకని తప్పకుండా వస్తావనుకొన్నాను. ఏమిటి విశేషాలు. ఇంకా బ్రహ్మచారిగానే వుండిపోవా లనుకొంటున్నావా" అన్నాడు కృష్ణమూర్తి.

ప్రభాకరం మాట్లాడలేదు. చిరునవ్వు నవ్వాడు. బల్లమీది సిగరెట్ టిన్‌నుంచి ఓ సిగరెట్ తీసి వెలిగించాడు. క్రిష్ణమూర్తికొకటి అందిచ్చాడు. అతను తీసుకోలేదు.

"ఈమధ్య సిగరెట్లు తగ్గించేశాను. ఇంకా తగించేస్తాను..."అని ప్రభాకరం కళ్ళలోకి చూశాడు.

"ఇంకా...మానేస్తాను. గొప్ప నీతిమంతుణ్ణయిపోతాను...చచ్చిపోతాను..." అని పూర్తిచేశాడు ప్రభాకరం.

"చచ్చాం! ధోరణి ఇంకా ఏం తగ్గలేదన్న మాట! సరే సరే ..అయితే మమ్మల్ని చంపేస్తావ్! నువ్వు పూరికే వదిలేరకం కాదు" అన్నాడు కృష్ణమూర్తి.

ప్రభాకరం సిగరెట్ పీలుస్తూ, పైకి రింగు రింగులుగా పొగ వదులుతూ, దాన్నే చూసుకొంటూ. అప్పుడప్పుడూ చిరునవ్వు చిందిస్తూ వుండిపోయాడు. కృష్ణమూర్తి మధ్యలో ఒకసారి ఏదో అనబోయి, వూరుకున్నాడు.

ఒక పెద్దపళ్ళెంలో మంచినీళ్ళు, కాఫీ గ్లాసులు వుంచుకొని జానకీదేవి నెమ్మదిగా వచ్చింది. పళ్ళెం బల్లమీద వుంచగానే కృష్ణమూర్తి మంచినీళ్ళ గ్లాసు అందుకొని గడగడా తాగేశాడు. అతనికి మంచినీళ్ళే ప్రాణం! జానకీదేవి తన కాఫీ గ్లాసు తీసుకొనివెళ్ళి కూర్చుంది. ప్రభాకరం' కృష్ణమూర్తి కాఫీ అందుకొన్నారు.

కాఫీ త్రాగడం పూర్తయింది. కృష్ణమూర్తి జానకీ నవ్వుకొంటూ త్రుళ్ళుతూ వున్నారు. అక్కడ ఆనందం పరవళ్ళు త్రొక్కుతోంది. ఎప్పుడూ తీవ్రంగా ఆలోచిస్తూ వుండే ప్రభాకరం ఇక్కడ వీళ్ళ మాటలలో కలిసిపోయాడు.

ఆ రాత్రి భోజనాలు తర్వాత పన్నెండు వరకు పిచ్చాపాటీ మాట్లాడుకున్నారు. మాటలమధ్యలో జానకి తనచెల్లెలు సుజాత రేపు ఉదయం మద్రాసునుంచి వస్తోందని చెప్పింది

జానకీదేవి చెల్లెలు సుజాత ఇంటర్ మీడియట్ పాసయి. ఇక చదివే అవకాశంలేక, ఇంట్లో కూర్చుని పుస్తకాలతో కుటుతో కాలక్షేపం చేస్తోంది. 'ఆ పిల్ల చాల చలాకీ అయినదని' ఆమె చెప్తావుంటే ప్రభాకరం. చెవులప్పగించి విన్నాడు. జానకీదేవే అతనికి చాలహుషారయిన అమ్మాయిగా కనిపిస్తోంది. ఇంకా ఆ చిన్నపిల్ల ఎంత చలాకీగా వుండాలో మరి... అనుకొన్నాడు... ఏదో క్రొత్తలోకంలో ప్రవేశిస్తున్నటనిపించింది.

ఉదయం జానకీదేవి చెల్లెలు సుజాత దిగింది. ఆమె రాకతో ఆయింటి కళ ఎక్కువయింది. నవ్వులూ, మాటలూ ఎక్కువయ్యాయి.

కృష్ణమూర్తికి ఆవేళ సెలవురోజు. ఇంట్లోనే వుండిపోయాడు. సుజాత భావ దగ్గర్నుంచి కదలలేదు. అక్కడే కూర్చుని కబుర్లు చెప్పసాగింది. జానకి వంటగదినుంచి అప్పుడప్పుడూ వచ్చి, వాళ్ళ మాటల్లో కల్పించుకొంటోంది ప్రభాకరానికి వాళ్ళ మాటలు చాలసేపటివరకు సరీగా బోధపడలేదు. కానీ వింటూవుంటే హాయిగావుంది. నవ్వులు, చమత్కారాలు... ఏవేవో గమ్మత్తయిన విషయాలు 'ఇదా జీవితం' అనుకొన్నాడు. అతనిమీద దేవతలు పన్నీటి జల్లు కురిపిస్తున్నట్లుంది. శరీరం పరవశమై ఆనందంగావుంది.

నీరసత్వంగానీ, మనస్సులో తీవ్రతగానీ ఏమీ లేవు. అంతా ప్రశాంతం!

ఆ రోజంతా గడచిపోయింది. ఆ సాయంకాలం ఊరవతలికి షికారు వెళ్ళారు. ఊరవతల ప్రక్క ప్రక్కనే రెండు చెరువులున్నాయి. చెరువుల్లో దాదాపు నిండుగా నీళ్ళున్నాయి ఒక ప్రక్క మామిడితోటలు. ఒకప్రక్క తారురోడ్డుమీద కార్లు, బస్సులు బర్ మని జారుతూ పోతున్నాయి. నలుగురూ అలా నడుస్తున్నారు. చెరువుకట్టమీద నడుస్తూ, చెరువునీళ్లలో కదలాడే నీడల జాడలు, సూర్యుని కిరణాల రంగులు... చూస్తూవుంటే హాయిగావుంది. మనసుకు ఎంతో 'ఇంపు'గా వుంది. సుజాత మాట్లాడుతోంది.

"మీరు బ్రహ్మచర్యం ఎంతకాలం సాగిస్తారండీ. అయితే పేషరుగారూ! మీరు ఎందుకలా వుండిపోవాలనుకొన్నారూ? ఆడవాళ్ళంటే భయమా? జీవితమంటే పిరికితనమా? లేకపోతే ఎక్కడైనా విఫలులై..?"

"ఏంలేదు... ఏంలేదు. అదేంలేదండి. ఉటినే" అన్నాడు దిగులుగా ప్రభాకరం.

"ఫరవాలేదు—చెప్పండి. అంతమంది దగ్గర బల్లగుద్ది వాదించారు. వ్యాసాలు రాశారు. గంభీరోపన్యాసాలు చేశారు. హేమాహేమీల ముందు మీ 'వాదం' నెగ్గించి "భేష్ అనిపించుకొన్నారు. నాతో చెప్పలేరా!" అంది సుజాత.

★ భీష్ముడి పెళ్లి ★

అదో సవాల్ అతనికి!

'అవును తను చెప్పలేదు. ప్రపంచంలో ఎవరి ముందైనా రొమ్ము విరుచుకొని నిలబడి ఇదీ నావాదం. అని తన ధీరత్వాన్ని చాతుర్యాన్నీ కూడా ప్రదర్శించి తన వాదం వాళ్లి కామోదయోగ్యంగా కనిపించక పోయినా సరే "భేష్" అనేలా చేయగలడు. కానీ ఆమె ముందు తను చాల బలహీనుడయి పోతున్నాడు. తన వాదన నోట్లోకి రావడం లేదు. మస్తిష్కంలో వేడిలేదు. నరాల్లో మటుకు కదలిక కనిపిస్తోంది.

మౌనంగా చెరువు నీళ్ళ అలలలో ఆడు తున్న నీడల్ని తిలకిస్తున్నాడు. సుజాత రెండు నిముషాలు ఊరుకొని మళ్ళి సాగించింది! తనెరిగిన బ్రహ్మచారుల్ని గురించి చెప్తోంది. కృష్ణమూర్తి, జానకీదేవి...ముందు దూరంలో నడుస్తున్నారు. ప్రభాకరం సుజాతా వెనకబడిపోయారు. సుజాత అతనితో చనువుగా దగ్గరగా మాట్లాడుతోంది. కంఠంలోంచి గాంభీర్యము, మృదుత్వము మధురత్వము అన్నీ సమపాళ్ళలో కలిపి వొలకబోస్తోంది.



పంటకళ్లంలో ధాన్యం తూర్పార

—ఫొటో : ఎ. వి. రామమూర్తి.

తండ్రి : ఏరోయ్! నీవు పంతులికే పంగనామాలు పెడ్తున్నావుటగా!

కొడుకు : అబ్బే! లేదండి! ఆయన వైష్ణవులు. ఆయనే రోజూ ప్రొద్దున్నే పంగనామాలు పెట్టుకొని బడికి వస్తుంటారు.

* * *

యజమాని : టైరుకూడా బాగా లేదు. అంత స్పీడుగా వెళ్తున్నావ్! టైరు పగిలిందంటే కారు తలక్రిందులై కారుతో పాటు మనంకూడా తునాతునకలై పోతామ్! జాగ్రత్త!

డ్రైవర్ : మరీ మంచిది. నేను ఎలాగో ఆత్మహత్య చేసుకుందా మనుకుంటున్నాలెండి.

ఎల్. వెంకటేశ్వర్లు, గుంటూరు.

"మేమంతా మొన్న ఒక సినిమాకు వెళ్ళాము అందులో కథానాయకుడు..." ఆసినిమా కథంతా చెప్పుకుపోతోంది సుజాత. ఎందుకు చెప్తోందో అనుకుంటూ శ్రద్ధగా విన్నాడు ప్రభాకరం. వింటున్నంత సేపూ అతనీ ప్రపంచంలో లేడు. సుజాత మాటలు అతనికి కితకితలు పెడ్తోంది. కొత్త అనుభవం!

"మరి... నేను నడవలేను తిరిగిపోదాం" అంది సుజాత:

"నేను నీతో ఎంత దూరమైనా సరే నడవగలను. అడవులు, కొండలు, గుట్టలు, సముద్రాలు అవలీలగా దాటేస్తాను. నువ్వు ప్రక్కనుండి మాటాడుతూ వుంటే చాలు. అంతెందుకు నువ్వు ప్రక్కనున్నావనే 'భావన' చాలు నడవటానికి శక్తినిస్తుంది. కానీ నిన్నలా 'కంటకపు రస్తా' వెంట నడవనిస్తానా..." అని మనసులో అనుకొన్నాడు ప్రభాకరం. మరుక్షణంలో అతనికే ఆశ్చర్యం కలగజేసింది. తను మునపటి ప్రభాకరం కాకుండా మరెవరో అయిపోతున్నాడు. ఇలాంటి తలపులు, ఇంత కవిత్వం కమ్మని భావాలు ఇదివరకు అనుభవంలో



కామధేనువు

—చిత్రకారిణి: శ్యామసుందరీ దేవి.

లేదు. శరీరంలో ఎప్పుడూ ఇలాంటి ఉత్తేజం కలగలేదు, మనసెప్పుడూ ఇలా పైకిలేచి పోతున్నట్లు లేదు.

సుజాత "అక్కయ్యా" అని పిలిచింది. వాళ్ళు తిరిగి వచ్చారు.

"ఏమిటె మావాణ్ణి హడలు గొట్టించేస్తున్నావ్. కెమిస్ట్రీ చెప్తున్నావా" అన్నాడు సుజాతతో కృష్ణమూర్తి.

సుజాత గలగలా నవ్వింది.

"ఇలాంటి నవ్వుకోసం ఏ ఆదర్శాన్ని వదులుకుంటేనేం? ఎంత త్యాగంచేస్తేనేం ...హృదయంలో నుంచి వచ్చే అమధుర మైన ధ్వనికోసం ఆహుతయిపోతేనేం... కాదుకాదు, నేను పొరబడుతున్నాను... అన్నిటికన్న మనిషికి ప్రధానమైనవి "సిద్ధాంతాలు" ఆదర్శాలు కాదేమో! కానీ ఈ ఆదర్శాలేమిటి ఎందుకు, జీవితాదర్శం ఏమిటి? ఒక సిద్ధాంతంకోసం కృషిలో బలై పోవటమా; 'ఆనందం' పొందడానికి నిరంతరం అన్వేషిస్తూ వుండటమా..., ప్రశాంత వాతావరణం కల్పించుకొని సుఖించడమా: అసలు ఏది సుఖమిస్తుంది...ఏది...యేది? తాను ఒకదానితో ఒకటి కలిపి తికమకపడుతున్నాడు. ఒకదానితో ఒకదానికి పొంతే లేదేమో? తను సహజంగా బ్రతుకు సాగించడం లేదు. సహజంగా పెరగడం లేదు. అందరికన్న భిన్నంగా వుండాలని ఇలా అయిపోతున్నాడా...తన సిద్ధాంతం, తన వూహలు నిరాధారాలా...కాదు...అవన్నీ సరయినవే! తను 'తికమక' లో పడివున్నాడు. మామూలు స్నేహిడికన్న కొంత సన్నిహితురాలు అర్ధాంగి! స్నేహితులవల్ల ....ఏం నష్టం? భార్య పిల్లలు కంటుందా. సంసారం పెద్దదిచేసి ఆర్థికపు వొడిదుడుకులు కలగజేసి శాంతి నశింపజేస్తుందా...ఇవన్నీ అదుపులోవుంచే వీల్లేదా...ఎందుకు వీల్లేదు. తన ఆలోచనలు సరయినదారిలో నడవటం లేదు. మొదట్నుంచీ తను చాల 'తికమక' లో వున్న మాట వాస్తవం...అవును...కాదు ...ఛా...ఛీ...'

ఇల్లు చేరుకొన్నారు. ప్రభాకరం ముఖం తీవ్రంగా వుండటంగమనించి దారిలో ఎవరూ మాట్లాడలేదు.

భోజనం పూర్తిచేశారు. ప్రభాకరంతప్ప మిగిలిన ముగ్గురూ నవ్వుకుంటూ మాట్లాడుతూనే వున్నారు. "స్వామీ! ఇంత చైతన్యానికి, ఇంతి ఆనందానికి అనర్హుడను!" అనుకొన్నాడు ప్రభాకరం.

ఇక్కడ రెండురోజులూ రెండుక్షణాల్లా గడచిపోయాయి. కానీ ఒక జీవితకాలంలో పొందదగిన ఆనందాన్ని రెండుక్షణాల్లో పొందినంత సంభరితు డయ్యాడు ప్రభాకరం.

మూడోనాడు ఉదయం ప్రభాకరం ఊరికి బయలుదేరాడు.

స్టేషన్లో చేయి వూపుతూ సన్నగా నవ్వుతున్న సుజాత అతని మస్తిష్కంలో నృత్యం చేయనారంభించింది.

అతనామెను మరచిపోలేకపోయాడు.

"పెళ్ళిగురించి నీ అభిప్రాయం ఏ కొంతయినా మారిందా?" అని కృష్ణమూర్తి రాశాడు.

"కొద్దిగా మార్చుకున్నాను" అని ప్రభాకరం జవాబు రాశాడు.

ప్రభాకరం తనెరిగిన కుటుంబజీవితాలను మరోసారి జ్ఞాపకానికి తెచ్చుకొన్నాడు. "తల్లిదండ్రులు తమ పిల్లల్ని ఎవ్వరూ కూడా సరిగా పెంచడంలేదు పిల్లలు నాశనమైపోతున్నారు. యావజ్జాతీ నీరసపడిపోతోంది. వారి శారీరక, మానసిక ఆరోగ్యాలు పాడయి 'భవిష్యత్ ప్రపంచం' చాల 'అనారోగ్యకరంగా' తయారయ్యే సూచనలు కనిపిస్తున్నాయి ఈతల్లిదండ్రుల్ని మేల్కొల్పాలి. 'కుటుంబ నియంత్రణం' అమలుపరచాలి. కుటుంబాల ఆర్థిక దుస్థితి బాగుపడటానికి అప్పుడు స్త్రీలుకూడా ప్రయత్నించవచ్చు. అవును దీనిగురించి వ్యాసాలు రాయాలి..." అనుకొంటూ ఇదంతా కృష్ణమూర్తికి ఉత్తరంలో రాశాడు.

ఒకరోజు క్యాంపునుంచి ఇంటికి వచ్చేసరికి కృష్ణమూర్తి ఉత్తరం వుంది.

"ప్రభాకరానికి,

నీ ఉత్తరం అందినది. చాల సంతోషం. నా ఆనందాన్ని అక్షరాల రూపంలో వ్యక్తపరచలేని నా అశక్తతకు చింతిస్తున్నాను. సుజాత ఇక్కడే ఒక ఆఫీసులో ఉద్యోగంలో ప్రవేశించింది. తనే ఇష్టపడి వాళ్ళ నాన్నగారికి ఇష్టంలేకపోయినా చేరింది. ఇప్పుడెవరూ ఆమెను నిందించటంలేదు నీవు కూడా ఈ వూరొచ్చేస్తే చాల బావుంటుంది. ఇంతకు మునుపు ఈ వూరు వేస్తామంటే 'వద్దని' అక్కడే వేయించుకొన్నావనుకొంటాను. ఇప్పుడీవూళ్ళో నీ ఉద్యోగం ఖాళీగానే వుంది. నువ్వు 'ఊ' అంటే వేసేస్తారనుకొంటాను.

సుజాత నీ పేరు మార్చేస్తుందట!

నీ ఉత్తరంకోసం చూస్తూ వుంటాను.

నీ

కృష్ణమూర్తి."

* * *

ప్రభాకరానికి కృష్ణమూర్తి వూరికి బదిలీ అయింది. 'పిల్లల పెంపకం' అన్న వ్యాసం రాసి ట్రంకులో వుంచుకొని ప్రభాకరం బయలుదేరాడు. సుజాతకోసం చేతులు చాచుకొని స్టేషన్లో దిగాడు. ★

సాంబశివంగారు భయస్థులని లోకంలో ఒకప్రతీతి వుంది. కానీ ఆప్రతీతి పూర్తిగా నిజంగాదు. ఆయన భయం ఓపరిమిత వలయంలో గిరికీలుకొడుతుంది. ఆ వలయానికి ఆవలివైపున సాంబశివంగారు ధైర్యంలో నెపోలియనులాంటి మనిషి. ఆయనకు చీకటి, దయ్యాలు, అంటు రోగాలు, మృత్యువు ఇలాటివి భయ కారణాలు గావు. నెపోలియను అంతటి వీరుడుగదా మరి. ఆయనకు ఉష్అంటే కలుగుల్లోకి పారిపోయే ఎలుకలంటే చెప్ప రానంత భయమని చెబుతారు. సరిగ్గా అలాగే సాంబశివంగారికి తమ ఉద్యోగానికి సంబంధించిన భయాలెక్కువ. టచింగు నోట్సు రాయకపోతే హెడ్మాస్టరు ఏమంటాడో! వేళకు బడికి చేరుకోకపోతే లేటు మార్కు పడుతుందేమో! 'క్వొశ్చన్ పేపరు' అవుటయిపోతే పైఅధికారులు తనపైన తిరుచర్య తీసుకుంటారేమో! సాంబశివం గారి కిలాటిభయాలు ఒకటిపోతే ఒకటి ఎదురౌతూనె వుంటాయి. జీవితంపట్ల సాంబశివంగారి తాత్విక దృక్పథాన్ని శ్రద్ధగా పరిశీలిస్తే యిందుకొక కారణం కనిపిస్తుంది. చావడంగానీ బ్రతకడంగానీ మనచేతుల్లో లేదు. నువ్వు పురుగు, పుట్రా వుంటాయని చీకటిల్లో బయటికి పోకుండా యింట్లోనే కూచోవచ్చు. పరీక్షిత్తు కూడా అలాగే చేశాడు. చివరికేమైంది?...బ్రతికి వంతవరకూ పొటపూడ్చుకోక తప్పదు. అందుకు ఉద్యోగనిర్వహణ వినాగత్యంతరం లేదు. ఏదిలేకపోతే తనకు బ్రతుకులేదో, దాన్ని శ్రద్ధగా, లోపరహితంగా నిర్వర్తించడం మానవుడి కర్తవ్యం కాదా మరి!

ఇక పార్వతమ్మ ఉందంటే, ఆమెధోరణి యిందుకు పూర్తిగా విరుద్ధం. దేనికోసమైతే భయపడి లాభం లేదో, దానికోసమే భయపడటం ఆవిడ స్వభావం. వీథిలో నిల్చుని ఓ బిచ్చగాడు 'అమ్మా! ఆకలి' అని అరుస్తాడు. 'వెళ్ళా, వెళ్ళు. ఇంకా అన్నం కాలేదు' అన్నమాట పార్వతమ్మ నాలుక చివరిదాకా వస్తుంది. కానీ అంతలోనే—ఒకభయం ఆ మాటకు అడ్డు తగులుతుంది. 'ఇకపైన రాబోయే జన్మలో తనే ఆవిధంగా ముష్టికి వచ్చి ఆ బిచ్చగాడే యింటి యజమానుడై తనని వెళ్ళిపొమ్మని కసురుకుంటే!' ఆ భయంతోనే పార్వతమ్మ బిచ్చగాడికి పట్టెడన్నం విదిలిస్తుంది.

'ఈరోజు ఓ కుర్రాడి లెంపలు వాయించేశాను' అంటారనుకోండి, సాంబశివంగారు ఆయనలా అనగానే పార్వతమ్మలో భయం చెలరేగుతుంది. 'ఊరివారి బిడ్డను నగరివారు కొడితే, నగరివారి బిడ్డను నారాయణుడు కొడతా' డంటారు. ఈయనకూ నలుగురు బిడ్డలున్నారు. ఈయన వాడినెవడినో కొట్టినందుకు ప్రతిఫలంగా, వీళ్ళను మరెవరైనా చావబాదితే?'

మధురాంతకం రాజారాం

అలాటి సాంబశివంగారికీ, యిలాటి పార్వతమ్మకూ ఓరోజు సాయంత్రం జరిగిన సంభాషణలో ఈ కథ ప్రారంభమవుతుంది.

ఆ సాయంత్రం సాంబశివంగారు హడావుడిగా స్కూలునుంచి యింటికి వచ్చారు. చేతి సంచీలోనుంచి కాగితాలకటని పైకితీసి టేబిల్ పైన వుంచారు. కళ్ళజోడు తీసి, అంగవస్త్రంతో తుడుచుకుంటూ "ఇదిగో.. ఏమిటే ... ఎక్కడున్నావ్" అని లోపలికి కేక వేశారు.

"ఏమండీ! ఏం కావాలి?" అంది నింపాదిగా వంటగదిలోనుంచే పార్వతమ్మ.

"బ్రతికాను! 'నరుడా, ఏమి నీకోరిక' అని అడిగావు కావు. ఆ తాళంచెవి యిలా తీసుకురా" అన్నారు సాంబశివంగారు.

స్కూలునుంచి యింటికిరాగానే సాంబశివంగారు తాళంచెవికోసం కేక వేయడమన్నది నెలకంతా ఒక్కసారి మాత్రమే జరిగే సంఘటన! ఆయనలా కేకవేస్తారు. పార్వతమ్మ తాళం చెవి తెచ్చియిస్తుంది. ఆయన పెట్టెతీసి జేబులోని డబ్బును అందులో భద్రపరుస్తారు.

కానీ ఈదఫా అలాటిదేమీ జరుగలేదు. సాంబశివంగారు పెట్టెలోని బట్టల్ని అటూ యిటూ తొలగదోసి, టేబిలుపైన పెట్టిన కాగితాలకట్టను తీసి అందులో వుంచి మూతవేసేశారు.

"అదేమిటండీ! ఎక్కడవేస్తే అక్కడ పడివుండే కాగితాల్ని అలా జాగ్రత్త చేస్తున్నారు." అంది పార్వతమ్మ. ఉద్యోగులందరిలోనూ బడిపంతుళ్ళపట్ల లోకులకు చిన్నచూపు వున్నట్టే, బడిపంతుళ్ళ యిళ్ళల్లో అన్ని వస్తువులకన్నా కాగితాలకూ, పుస్తకాలకు కనీసపు గౌరవాదరణలు లభ్యమౌతున్నాయి. ఓసారి పార్వతమ్మ వుట్టిలో పాలచెంబు పైన వుంచిన మార్కుల రిజిష్టరు, పిల్లికీ చెంబుకూ జరిగిన సంఘర్షణలో, నీళ్ళతబిలలో పడి 'మార్కుల రాజ్యం'లో గరీబు, నవాబు అంతరాలు మాసి సోషలిజం సిద్ధించిన సంఘటన యిందుకు ప్రబలనిదర్శనం!

పార్వతమ్మ అమాయకత్వానికి సానుభూతి ప్రకటిస్తున్నవారిలా మెల్లగా నవ్వుతూ సాంబశివంగారు "ఓసి వెర్రిమొహమా! అవేం కాగితాలనుకున్నావు? గవర్నమెంటు పరీక్షపేపరు. రాక రాక యింతకాలానికొచ్చాయి. ఒక్కొక్క పేపరుకూ ముప్పావలా చొప్పున నాలుగువందల పేపర్లకు మూడువందలు ఒక్కసారిగా కళ్ళబడతాయన్నమాట; ఏమిటనుకున్నావో" అన్నారు.

"మూడొందలే! వాడెవడండీ, యింతగా డబ్బును రాసిపోసుకున్న పుణ్యాత్ముడు! ఇలా అందరికీ డబ్బుదోచిపెడ్తే వాడి సంసారమేం గటెక్కనబ్బా!" పార్వతమ్మ ముక్కుమీద వ్రేలేసుకుని విస్తుపోసాగింది.

సాంబశివంగారు చిరాకుతో నుదురు చిట్లించి "ఐనా నీకు బోధపరచడం ఎవరి చేతనౌతుంది? ఇవి గవర్నమెంటువాళ్ళు స్వయంగా నడిపే పరీక్షలతాలూకు పేపర్లన్నమాట. గవర్నమెంటు వాళ్ళకేం డబ్బుకు కొదవా?" అన్నారు.

"అంతగా డబ్బుకు కొదవలేనివాళ్లు, మీరు ప్రతివారమూ బోలెడన్ని పుస్తకాలు సరిచూస్తున్నారుగదా, పుస్తకానికొక పావలా చొప్పున పారేయకూడదటండీ?"

"అది ఉద్యోగరీత్యా తప్పనిసరిగా చేయవలసిన పని. ఇది అదనంగా చేయవలసి

వస్తున్న పని, దానికీ, దీనికీ తేడావుంది."

పార్వతమ్మకా సమాధానమేమీ తృప్తికరంగా లేదు. ఐనా మూడువందల రూపాయలు లభ్యం కాబోతున్నాయి గనుక ఏ రాజు ఏ రాజ్యం పాలిస్తే మనకేమన్న తృప్తితో ఆమె లోపలికి వెళ్ళిపోబోయింది.

"ఇదుగో" అని మళ్ళీ ఆమెను దగ్గరికి పిలిచి "నీ నోట్లో నువ్వు గింజయినా నానదు. మనకు పేపర్లొచ్చాయన్న సంగతి వీధిలో నిలబడి బాకా వూదసేవు! చాలా రహస్యంగా వుండాలి, తెలుసా!? అన్నారు సాంబశివంగారు.

"పైగా యిదొకటా! ఐనా ఆ పేపర్ల గొడవ నా కెందుకండీ! ఏమో, డబ్బిస్తుందంటున్నారు. వస్తేగిస్తే అమ్మాయికి రెండు జతల గాజులు చేయించండి. పెళ్ళికన్నీ ఒక్కసారిగా చేయాలనుకుంటే, మనవల్ల కాదు."

"మరి నాకు గడియారమో" అంటూ గదిలోనుంచీ బయటికి వచ్చాడు, అంతవరకూ తల్లిదండ్రుల ప్రసంగాన్ని వింటూ వుండిన శంకరం.

"అది నువ్వు పరీక్ష పాసైతే, ఆ తరువాతి మాట" సూటిగా బదులు చెప్పారు సాంబశివంగారు.

"వాడెందుకు పరీక్ష కాడండీ, మీరు మరీనూ! ఇదివరకెన్నిసార్లు వాడు పరీక్ష కాలేదు? ఇచ్చేవాళ్ళు సరిగా మార్కులిస్తే వ్రాళ్ళెందుకు పరీక్ష కారు?" అంది పార్వతమ్మ.

"అదీ! నాన్నగారికి పేపర్లొచ్చిన ఈ శుభసమయంలో నవు గట్టిగా అడగవలసిన మాట అదేనమ్మా!" అన్నాడు శంకరం.

"బాగా వ్రాసి ఏడిస్తే, మార్కులు వాటంతట అవే వస్తాయి. ఎందుకు రావు?" అంటూ సాంబశివంగారు కాళ్ళూ, చేతులు కడుక్కోడానికి పెరట్లోకి వెళ్ళారు

*   *   *

నాలుగు రోజుల తర్వాత ఓ సాయంత్రం యింట్లో ఏదో పనిచేసుకుంటున్న పార్వతమ్మకు "సార్, సార్" అని ఓ అపరిచిత కంఠం పిలవడం వినిపించింది.

"ఎవరూ, ఎవరు" అంటూ ఆమె బయటికి రాబోతుండగా, ఆగంతకుడే వరండా దాటుకుని హాల్లోకి వచ్చేశాడు.

వచ్చిన వాడు, బరువుగా వున్న చేతి సంచిని గోడకానించి "నమస్కారమండీ" అంటూ పార్వతమ్మకు చేతులు జోడించాడు.

ఏ అమ్మగన్న బిడ్డోగానీ, అంత ఒడ్డూ పొడవూవున్న యువకుడు చేతులెత్తి తనకు నమస్కరించినందుకు పార్వతమ్మకు ప్రాణం వచ్చిపోయినట్టయింది. 'అయ్యో, పాపం' అని మనసులో నొచ్చుకుంటూ "కూచో నాయనా కూచో! ఏ వూరు బాబూ" అని ఆమె ఆప్యాయంగా పలకరించింది.

ఆగంతకుడు గోడకానుకుని, ఏదో నేరం చేసినవాడిలా తలవంచుకుని నేలవైపు చూస్తూ "విశాఖపట్నంనుంచి వస్తున్నానండీ!" అన్నాను.

"విశాఖపట్నంనుంచే! అమ్మో, అంత దూరమే! ఎవరికోసం వచ్చావు నాయనా" అంది పార్వతమ్మ

అపరిచితుడీసారి పైకప్పుకేసి చూడ్కులు నిగుడించాడు. ఆతరువాత, విశాఖపట్నం నుంచి రైల్లో ప్రయాణంచేసి వచ్చినందుకు తార్కాణగా నల్లగా మాసిపోయివున్న తన దుస్తులనైపోసారి చూచుకున్నాడు. గుబురుగా పెరగనుంకిస్తున్న గడ్డాన్ని ఒకసారి ఎడమచేతితో పరామర్శించుకున్నాడు. ఇన్నీ చేసిన తర్వాత ఏడుపు ముగం పెట్టి "పంతులుగారు లేరండీ?" అన్నాడు.

పార్వతమ్మ మేడ మెట్లు దగ్గరకువెళ్ళి "ఏమండోయ్! మిమ్మల్నే! ఇలారండి" అని సాంబశివంగారిని పిలిచింది.

చేస్తూచేస్తూవున్న పనిని మధ్యలోవిడిచిపెట్టి, ఎర్రసిరాకలాన్ని అలాగే చేతిలో వుంచుకుని సాంబశివంగారు మెట్లు దిగి క్రిందికి వచ్చేశారు.

"మీకోసం ఈ అబ్బాయెవరో విశాఖ

★ అడ్డుదారి ★

పట్నంనుంచీ వచ్చాడటండీ" అంటూ పార్వతమ్మ ఆ యువకుణ్ణి సాంబశివంగారికి పరిచయం చేసిపెట్టింది.

"నాకోసమా! ఈ అబ్బాయా? ఎందుకొచ్చావయ్యా?" అన్నారు సాంబశివం గారు.

ఆగంతకుడు కాసేపు దిక్కులుతోచని వాడిలా నిస్తబ్ధుడై వుండిపోయాడు. కళ్లల్లో క్రమ్ముకుంటున్న కన్నీటిని ఆ భార్యాభర్తలెక్కడ చూచిపోతారోనని దుఃఖాన్ని ఆపుకోడానికి వృథాప్రయత్నాలు చేశాడు. కానీ అతడు నోరు తెరిచే సరికి కంఠం గద్గదికమే అయిపోయింది.

"మాది చాలా పేదకుటుంబం సార్! మా నాన్నగారికి కళ్ళు కనపడవు. అక్కడా, యిక్కడా చాకిరీచేసి ఇందాకా మా అమ్మే కాపురాన్ని నెట్టుకొచ్చింది. వాళ్ళ ఆశలన్నీ నా పైన్నే వున్నాయిసార్! వాళ్ళు ఒకపూటతింటే, రెండుపూటలు తినకుండా నన్ను చదివించారు. నేను పరీక్ష ఫెయిలయ్యానంటే వాళ్ళగుండెలు పగిలిపోతాయి. ఇవి చేతులుగావు, కాళ్ళనుకోండిసార్..."

చేతుల్ని దూరంగా తీసుకుంటూ సాంబశివంగారు "ఏమిటయ్యా నీ గొడవ? నువ్వు పరీక్ష ఫెయిలు కాబోతున్నందుకు, నాకూ సంబంధమేమిటి?" అన్నారు

"అన్ని సబ్జక్టూ బాగానే వ్రాశాను సార్! దేనిలోనూ ఫిఫ్టీ పర్సెంటుకు తగ్గదు. ఒక్క యింగ్లీషులోమాత్రమే డౌట్‌గా వుంది. ఇంగ్లీషు పేపర్లు మీ దగ్గరికొచ్చాయని తెలిసింది..."

"నా దగ్గరకా: పేపర్లొచ్చాయా? అబద్ధం. నాకు పేపర్లే రాలేదే!"

పార్వతమ్మ సాంబశివంగారు నిండుచెరువులో నీళ్ళ లేవంటున్నందుకు ఆశ్చర్యపడకుండా వుండలేకపోయింది. ఈయన సత్యహరిశ్చంద్రుడు గాకపోయినా, పచ్చి అబద్ధాన్ని కుండ బద్దలుకొట్టినట్టుగా చెప్పేయగలరని ఆమె ఏ నాడూ అనుకోలేదు!

"మీ దలాగంటే నేనేం చెప్పగలను సార్?" అంటూ ఆగంతకుడు వేళ్ళు నలుపుకోసాగాడు.

క్షణక్షణానికీ విచారమేఘాలు అలముకుంటున్న అతడి ముఖాన్ని చూస్తుంటే పార్వతమ్మకు గుండె తరుక్కుపోసాగింది. ఇంగ్లీషు పేపరులో మార్కుల సంగతి ఎలా వున్నా మొదట అతనికి పట్టెడన్నం చాలా అవసర మనిపించింది పార్వతమ్మకు!

"నువ్వెప్పుడు భోంచేశావు బాబూ?" అంది పార్వతమ్మ.

"విజయవాడలో రైలాగితే పెరుగన్న పొట్లం ఒకటి కొనుక్కున్నానండీ! ఆతరువాత బిట్రగుంటలో ఓ కాఫీ త్రాగాను. గూడూరి కొచ్చేసరికి బాగా రాత్రయిపోయింది..."

సాంబశివంగారు అతడివైపు చూచి ముఖం చిట్లించుకున్నారు. ఆ చిట్లించుకోడంలో ఈ వ్యవహారం ఆయనకేమాత్రమూ నచ్చలేదన్న భావం ఎవరికైనా వ్యక్తమవుతుంది, ఒక్క పార్వతమ్మకు తప్ప!

"నాకెలాగూ యిరవై మార్కులొస్తాయి సార్! మీరింకొక పదిమార్కులు..."

సాంబశివంగారు కోపాన్ని పిలిచారు. అది పిలవగానే పలికింది!

రూక్షవీక్షణాలతో ఆయన ఆగంతకుణ్ణి దహించివేస్తూ "నీకు మంచి మాటలతో చెబుతున్నాను. పోనీ అని వూరుకున్నాను గానీ లేకపోతే, ఓ చీటీ వ్రాసి పంపి పోలీసుల్ని రప్పించడం నాకొక పెద్దపని గాదు. వీలైనంత త్వరగా యిక్కడినుంచి వెళ్ళిపోవడం నీకన్నివిధాలా శ్రేయస్కరం" అని ఆదరాబాదరాగా మెట్లెక్కి మేడపైకి వెళ్ళిపోయారు.

ఆయన మేడపైకి వెళ్ళిపోవడ మేమిటి, క్రికెట్ బ్యాటు వూపుకుంటూ శంకరం లోపలికి రావడమేమిటి, రెండూ ఒక్కసారే జరిగాయి.

"నువ్వొచ్చావు, ఎందుకురా శంకరం! ఈ అబ్బాయిని చూడు, ఏం లేదు, పది మార్కుల భాగ్యానికి విశాఖపట్నంనుంచీ ఈ వూరొచ్చాడు! మరి నీ నాన్నగారేమైనా చెబితే వినేరకమా! తెట్టతేరపు యితడిపైన మండపడిపోతున్నారు." అంది పార్వతమ్మ.

తండ్రిగారి పెడసరితనాన్ని, తల్లి భోళాతనాన్ని బాగా గుర్తెరిగిన శంకరం ఈ పరిస్థితిలో ఏం చెప్పడానికీ తోచక మౌనంగా వుండిపోయాడు.

ఆగంతకుడు చేతిసంచీ పైకితీశాడు. అందులోవున్న వాటిని ఒక్కొక్కటిగా తీసి టేబిలు పైనవుంచాడు. ఓ డజను కమలాపళ్ళు ఒక చీపు అరటి పళ్ళు, పువ్వులు...

"అయ్యో పాపం! ఇవన్నీ ఎందుకు తీసుకొచ్చావు బాబూ?" అంది పార్వతమ్మ.

అతడు మళ్ళీ ఒకసారి పార్వతమ్మకు నమస్కరించాడు. ఓ చీటీపైన నంబరు వేసి, దాన్ని జాగ్రత్తగా టేబిలు పైనవుంచి "ఎంతో ఆశగా యింత దూరం వచ్చాను. మేష్టరుగారు కోపంగా వున్నారు. నేకింకా యిక్కడేవుంటే ఆయనకు మరీ కోపం వస్తుంది. పాలముంచినా, నీటముంచినా మీదేభారం" అంటూ అతడు తిరిగిచూడకుండా బయటకు వెళ్ళిపోయాడు.

* * *

వెండితెరపైకి వచ్చి వెళ్ళిపోయే బొమ్మలా ఆ విశాఖపట్నం యువకుడు సాంబశివగారింటికి వచ్చి, విఫలమనోరథుడై, వచ్చిన దారి వెంబడే తిరిగి వెళ్ళిపోయిన తర్వాత ఐదారు నెలలు గడిచిపోయాయి. ఈ అయిదారు నెలలుగా అప్పుడప్పుడు అతని ప్రసక్తి ఆ యింట్లో పొడసూపుతూనే వుంది.

"పాపం, అతడు పరీక్ష తప్పిపోయి వుంటాడు. అంటే ఏమన్నమాట? ఆ సంసారం మీ పుణ్యమా అని చిదికిపోయి వుంటుంది. ఆ కళ్లుగానని కబోది ఏమైపోయాడో? ఇంటింటా చాకిరీచేసి కొడుకును చదివించిన ఆ తల్లిప్రాణం ఎంతగా వునూరుమందో? ఆ పాపం మనల్ని కట్టికుడుపకమానుతుందటండీ?"

ఇలా భార్య తనని దెప్పినప్పుడల్లా సాంబశివంగారు ఆమెకు కటువుగా సమాధానం చెబుతూనే వున్నారు.

"నువ్వు నూరు చెప్పు, వెయ్యి చెప్పు. నేను చేస్తున్నది నౌఖరీ. నౌఖరీ అంటే నోటిమాటగాదు. బాగా చేసినంతవరకూ మెప్పుదల వుండదు. కానీ తప్పిదారి డ్యూటీలో తప్పటడుగు వేశానో, నీకు కీడు మూడినట్టే! ఎక్స్‌ప్లనేషన్ అడగొచ్చు. ఇంక్రిమెంట్ కట్ చెయ్యొచ్చు. నాలుగు నెలలు సస్పెండ్ చెయ్యొచ్చు. లేదా అమాంతంగా 'ఫ్రూస్'

చేసి వెళ్ళిరమ్మనవచ్చు! ఏం చేసినా నీ కెవరుదిక్కు? నీ నీతీ, నీ నిజాయితీ నిన్ను కాపాడలేకపోతే, ఆ తరువాత భగవంతుడు సైతం కాపాడలేడు. నువ్వమాయకురాలివి! నీకు లోకంపోకడేం తెలుసు? ఈ రోజుల్లో సజావుగా ఒక పనిచేసి సత్ఫలితం సాధించడానికి ప్రతివాడూ బద్ధకిస్తున్నాడు. ఉద్యోగి వున్నాడనుకో, బాగా శ్రమపడి పనిచేయడానికి బదులు, పై అధికారులమీద ముఖస్తుతుల పన్నీరు చిలకరించి ప్రమోషనులు సాధించుకుంటున్నాడు. ఆడబిడనుగన్న తల్లిదండ్రు లున్నారనుకో, కాళ్ళరిగిపోయేటట్టు తిరిగి వరుణ్ణి వెదికి తెచ్చి కన్యాదానంచేసి సాగనంపడానికి పొలుమారుతున్నారు. వాళ్ళు పడవలసిన శ్రమంతా ఆ అమ్మాయే పడవలసివస్తోంది! ఇక కుర్రాళ్ళున్నారనుకో, వీళ్ళు చదువరు. రేపు పరీక్షనగా ఈ రోజు రాత్రి సినిమాకు వెళ్ళొస్తారు. వీలయినంతవరకూ పరీక్షల్లో కాపీ కొట్టడానికి ప్రయత్నిస్తారు. అది సాధ్యంకాకపోతే యిలా గోవుసెంట దగిలే కోడెమాదిరిగా ఆ నర్సు పేపర్లని వెదుక్కుంటూ దేశయాత్రకు సన్నద్ధులవుతారు. నువ్వు మనవూరినుంచీ రామాపురం వెళ్ళాలనుకో! హాయిగా తారురోడ్డు వెంబడే నడిచిపోతే పన్నెండు మైళ్ళు. అలా కాదని అడ్డుదారిపైన వెళ్తే, దూరంలో నాలుగు మైళ్ళు తగ్గుతుంది. నిజమే! కానీ కాలికి రాళ్ళు తగలొచ్చు ముళ్లు గుచ్చుకోవచ్చు. కాలు జారడంవల్ల మనిషి బురదలో ఫల్టీ కొట్టినా కొట్టవచ్చు. వానా వంగిడీ వస్తే తలదాచుకోడానికి వెరవులేక తడిసి ముప్పందుం కావచ్చు. అందుకనే నాకు అడ్డుదోవలంటే ఒళ్ళుమంట..."

అంతగాదు, సాంబశివంగారు మరింతగా విడమరిచి చెప్పినా పార్వతమ్మను పాపభీతి వదిలిపెట్టేదిగాదు. "అయ్యో, ఆ కుర్రాడింకా నా కళ్ళల్లో మెదలుతున్నాడండీ! పాపం, ఆ కాపురమేమయిందో, ఆ తల్లి ఎంతగా ఏడ్చిందో..." పాచిపళ్ళదాసరి పాటలా ఈ గోల యింట్లో వుండి వుండీ పునరావృత్తమవుతూనే వుంది.

ఇంతలో శంకరానికి ఉద్యోగం దొరికి, ఏతదుద్యోగరీత్యా అతడు విశాఖపట్నం వెళ్ళి వెళ్ళిన పదిరోజులకు ఈ క్రింది వుత్తరం గనుక వ్రాయకపోయివుండి నటయితే సాంబశివంగారిని ఈ పిడ జీవితాంతంవరకూ వెన్నంటుతూనే వుండేది!

"పూజనీయులైన తల్లిదండ్రులకు నమస్కారాలు" అంటూ ప్రారంభమైంది ఉత్తరం.

"ఈ వూరు సురక్షితంగా చేరినాను. ఇక్కడి హోటళ్ళలో ఆహారపదార్థాలు మన యింటి భోజనమువలే రుచిగా, శుచిగా వున్నవి. ఈ పట్టణము సముద్రతీరమున వుండుటచేత మండు వేసంగిలో సైతము ఇక్కడ ఎండలు తీక్ష్ణముగా వుండవని చెబుతున్నారు. ఆఫీసు పనుల తొందరలో వ్యవధి లేనందువలన, మిగిలిన విశేషములను మరుజాబులో వ్రాయగలను. అన్నింటి కన్నా ముఖ్యమైన విశేషం ఒకటి వున్నది. ఆరునెలలకు మునుపు మార్కులకోసం మన యింటికి వచ్చిన యువకుడు మొన్న బజారులో ఎదురయ్యాడు. నన్ను గుర్తుపట్టనివాడిలా, చూచీచూడనట్టు వెళ్ళిపోబోయాడు. నేనే అడ్డుతగిలి పలకరించాను. నేనెవరినో తనకు తెలియదని అతడు నన్ను దాటుకుని చరచరా వెళ్ళిపోయాడు. ఆ తరువాత నేనతణ్ణి గురించి విశ్వసనీయవర్గాల్లో వాకబుచేయగా, అతడు యస్. యస్. ఎల్. సి. పరీక్షకు కాదుగదా, రెండోఫారం పరీక్షకు గూడా కూర్చుని ఎరుగడని తెలియవచ్చింది. పరీక్షకు కూర్చుని పేపర్లు తగలేసిన విద్యార్థులదగ్గర ధారాళంగా డబ్బుతీసుకుని, అతడు వాళ్ళ తరఫున మార్కుల వేటకోసం బయల్దేరుతాడనీ, ప్రతి సంవత్సరమూ మార్చి అక్టోబరు—రెండు సీజన్లకు కలిసి వెయ్యో, రెండువేలో కళ్ళజూడగలుగుతున్నాడనీ తెలిసింది. ఈసారి అతడెప్పుడైనా కనిపిస్తే తీరికసమయాల్లో అమెచ్యూర్ నాటక సంస్థల్లో చేరి నాటక కళాసేవ చేయమని సలహా యిద్దామనుకుంటున్నాను—"

ఉత్తరం పూర్తిచేసి సాంబశివంగారు పార్వతమ్మకేసి చూచారుగదా, ఆమె ముఖాన కత్తివేటుకు నెత్తురుచుక్క లేదు!

★

ఆంధ్రనామ వైపరీత్య సంగ్రహము

మండపాక రాజేశ్వర శాస్త్రి

అతని ముద్దు పేరు చిట్టిబాబు. తల్లి 'నాయనా చిట్టీ' అని కూడా పిలుస్తుంది. తండ్రి బాల్యంలో నే గతించగా, మేనమామా తల్లీ భూమిమీది రాబడి పొదుపు చేస్తూ, తనూ తమ్ముడూ చెల్లీ ఏలోపమూ పడకుండా చదువుసంధ్యలు చెప్పించారు. ఇట్టే బి.యిడి. అయి, చిట్టిబాబు ఉద్యోగం—ఉన్నత పాఠశాలలో మాస్టరీ—చేస్తున్నాడు. తమ్ముడు ఇంటరూ, చెల్లి ఏదో ఫారమూ చదువుతున్నారు. 'చిట్టిమాస్టారు'కు ఈమధ్య ఇవీ అవీ సంబంధాలొస్తున్నవి కాని, 'ఎందుకీ తొందర' అంటూ వాయిదా వేస్తూ వస్తున్నాడు. తనకు ఆడపిల్లలు లేకగాని, మేనమామ ఇలా మాసూ ఊరుకోనేవాడా? ఆఖరికి ఎలాగైతేయేం, క్రిందటిరోజే ఓ మాంచి సంబంధం తటస్థమైంది. అమ్మ, మామా ఆలోచించారు. ప్రైవేటుగా పిలను చూసుకున్నారు. కట్నాలూ ఖరాముత్తులూ తమ హుందాకు తగ్గట్టుగానే ఉన్నాయి ఆవుదయమే పిల్లను చూచుకోవడానికి చిట్టిబాబు సిద్ధం కావాలి. అందుకే పిల్లను వాళ్ళ పినతండ్రిగారింటికి 'చూపులతంతు'కు తీసుకు వచ్చేరట.

చిట్టిబాబు ఫాంటూ, షర్టూ, టై గట్రా వేసుకొని ఒత్తుగా పెరిగిన క్రాపు జుత్తు యథాశక్తిగా దువ్వి, నడవలో పడకకుర్చీలో చేరబడి దినపత్రిక చూస్తున్నాడు.

మండేశ్వరరావు కళేబరం ఊపుకుంటూ లోపలికి వచ్చేడు. మండేశం, చిట్టిబాబూ పాతస్నేహితులు లెండి.

"హల్లో, మిస్టర్ చిట్టి పంతుల్" అన్నాడు మండేశం. "ఏమిట్రోయ్ విశేషం తెలారకముందే పెళ్ళికొడుకులా తయారై కూచున్నావ్?"

"అయం విశేషః ఇత్యమరః - అన్నట్లు మండేశం భాయ్, వీధి గుమ్మంలో కాస్త పక్కకి తిరిగేవా లేదా? కళేబరం దూరిందో లేదో అనీ—"

"మనుషులు, మనుషులు! కాస్త వొళ్ళున్నవాణ్ణి చూస్తే కళ్ళుకుట్టే 'నిర్జీవపు పేలికలు!"

"తగ్గరా మండేశం, తగ్గరా. హాస్యాని కన్నాన్రా. నా మేకప్పెట్రా? ఇప్పుడు పెళ్ళిచూపుల కెళ్ళాల్రా."

"చెప్పవు మరి! శ్రీభియుర్స్ నని అంతా విచిత్రంగా వుందే! పెళ్ళొద్దు మొర్రో అంటూ నిన్నా యివాళా-అంటే ఆజ్ కల్—గోలెడుతూ ఉండేవాడివే!"

"ఏం జెయ్యమంటావ్ మరి, అమ్మ వాళ్ళు పీకమీద కూచుంటే? ఇహ, కాబోయే అర్ధాంగిని కళ్ళారా చూసుకోవాలిగదరా!"

"వా, వా! అదీపాయింటు!-కాని-"

"కానీ ఏమిట్రో, కానీ నయా పైసానూ?"

"ఒరే, చిటినాయినా, ఒకటి చెప్తా వింటావా? నువ్వు మాత్రం నాలాగు తొందర పడకు సుమా. పిల్లాన్ని బాగా చూసుకో, కాదనను. తరవాత సావకాశంగా ఆలోచించు."

"నీకేం దిగదిసిందిరా, తొందరపడ్డావంటావు? అప్సరసను చేసుకొని హాయిగా స్వర్గభోగం బనుభవించుచు ఆనందడోలికలలో నుర్రూతలూగుచున్నావు."

"కాదనురా, నీ గ్రాంథికనోటివాక్యాన నాకలాగే జరగనీ. కాని—వాళ్ళ టేస్టులు కూలా, మా అత్తవారింట్లో ఇంటిల్లిపాదికీ ఆపేర్లేమిట్రా!"

"ఏమిటొచ్చిందిరోయ్, వాళ్ళ పేర్లకి?"

"వినరా. మా మామపేరు చిన తిమ్మయ్య పంతులు. అత్తపేరు అలిమేలు మంగతాయారు"

"కూతురు పేరు చూడికుడత్తనాంచారు కాయగద!"

"అలా ఐతే వరస సరేపోను. గ్రహచారం! కూతురి పేరు ఝాన్సీ లక్ష్మీభాయి."

"వీళ్ళ యీ స్టటిక్ సెన్సు కూలా. ఈ తెలుగువాళ్ళకిదేం తెగులురా! ఇతర రాష్ట్రాలవాళ్ళ పేర్లు కుంకటి వేరునుంచి కొసకొమ్మదాకా అపశంగానే పెట్టేసుకొని మరీ కులుకుతారు! బాలగంగాధర తిలక్కట—సురేంద్రనాథ్ బెనర్జీట—ఆఁ? ఇవి తెలుగుపేర్లేనా? ఓరి వీళ్ళ టేస్టులూ వీళ్ళూనూ! రఘుపతి వెంకటరత్నం నాయుడట—ఇదో బ్రాహ్మణకుర్రవాడికి పెట్టిన పేరటసుమా-గోపాలకృష్ణ గోఖేలట - తెలుగు ఇంటి పేర్లతో సహా మరీనీ! ఇంకా నెహ్రూ పూర్తిపేరూ, గాంధీగారి పూర్తిపేరూ ఇప్పుడే పెట్టేసుకుంటున్నారు-వీళ్ళ దేశభక్తి యిదైపోను. ఏదీ, ఒక్క మహారాష్ట్రం వాడినైనా, బంగాళీవాణ్ణయినా, హిందూస్థానీవాణ్ణయినా చూపించు, మన తెలుగు పేర్లుంచుకున్నవాణ్ణి?"

ఇంతలో లోపలితలుపు తోసుకుంటూ చిట్టిబాబు తల్లి వచ్చింది.

"ఏమిట్రా, ఆనోళ్ళు—ఎప్పుడొచ్చావురా మండేశం బాబూ?"

"ఇదుగో, ఇదే రావడం" అన్నాడు మండేశం.

"ఏమీ లేదే అమ్మ" అన్నాడు చిట్టిబాబు. "అన్నట్టు అమ్మా, నీ పేరేమిటా చప్పగా మీ వాళ్ళిలా పెట్టేసేరు?"

"నా పేరు గవరమ్మరా, బంగారం లాంటి పేరు. గౌరీపార్వతీ అన్నమాట."

"ఇప్పటి ఫాషన్లు వేరమ్మ దొడ్డమ్మ" అన్నాడు మండేశం. "ఇప్పటివాళ్ళు గిరిబాల, లలితకుమారి, వనజాక్షి, పద్మావతి—"


"హారి మందన్నా, నువ్వింకా పెరటి వెనకాలే ఉన్నావురోయి" అన్నాడు చిట్టిబాబు. "ఇప్పటి ఫాషను సినిమా తారల పేర్లే పెట్టేసుకోవడం—అంజలి, సూర్యకుమారి, కృష్ణవేణి, డిటో కుమారి (సావిత్రి పేరు పాటకజనాల్లో జాస్తీ లెండి) ఇవి ఆడపిల్లల అప్టుడేటు పేరు! ఈమధ్య వోయిద్దరాడపిల్లలు—అక్కచెల్లెళ్ళకి-ఏం చెప్పను! లతా మంగేష్కరు, ఆమె చెల్లెలూ పేర్లు పెట్టేసి ఊరుకున్నారట!—అన్నట్టు, మై డియర్ మేనమామా, నీ పేరేమిటోయ్, ఎక్కడా కనివినీ యెరుగని పేరొకటి తగిల్చేసేరు!"

అప్పుడే చిట్టిబాబు మేనమామ లోపలికి వస్తున్నాడు.


"నా పేరు బాగీరావురా. 'వ్యాఘ్రేశ్వ

(40-వ పేజీ చూడండి)

ఆర్. హెచ్. కుమారి



సంక్రాంతి ముగ్గులు



యం. పరళాదేవి

చిరిగిపో

టేబిలులాంపువంక ఒక్క క్షణం నిశ్చలంగా చూసి, కలంతీసి వ్రాయడం ప్రారంభించింది విమల. నల్లని కలం, స్వచ్ఛంగా తెల్లగావున్న కాగితాలమీద నాట్యం చేస్తోంది. బారులు తీర్చిన అక్షరాలు, వంపులతో, అందంగా భావాన్ని పలుకుతో నిల్చుంటున్నాయి. గడియారం పన్నెండుకొట్టేవరకు వ్రాసి, కలం మూసింది ఆమె.

కాగితాలన్నీ తిరగేసి, అంకెలువేసి, 40 అనుకుని తృప్తిగా వూపిరి విడిచింది. ఆ కాగితాలకి పదిలంగా క్లిప్పు పెట్టి, రంగుపూల పేపరు వెయిటు వుంచి లేచింది. మంచంమీద పడుకుని రగ్గు కప్పుకున్న దన్నమాటేకానీ రెప్పలు మూతపడటం లేదు. కథలోని ప్రమీల, శంకరం, ఆ ప్రణయం అన్నీ మనస్సులోకి వస్తున్నాయి. జాలువారుతూ వచ్చింది ఆ కల్పన. ఇంత కాలం తను వ్రాసిన కథలన్నీ ఒకయెత్తు—ఇదొక్కటీ ఒకెత్తు. భర్తకి మాటైనా చేయకుండా వ్రాయడం యిదే మొదటిసారి. ఏమంటాడు, అతను చదివి?

గడియారం అరగంట కొట్టింది. విమల లేచి కూర్చుంది ప్రక్కమీద. ఆనందరావు వూపిరి వినిపిస్తోంది ఆ నిశ్శబ్దతని చీల్చుకుని.

లేచి, మళ్ళీ దీపం వేసుకుని, తన కథనితీసి చదవడ మారంభించింది. ఒక్కొక్క పేజీ త్రిప్పుతున్నకొద్దీ ఆమెలో ఆవేశం

కుమారి ఎం. జానకీరాణి

ఎక్కువైంది. "ఎప్పుడైనా వ్రాశానా యిల్లా?" అనుకుంది. "ఎప్పుడైనా వ్రాస్తానా యిల్లాగా?" అనుకుంది. ఆవేశంతో ఆమె కళ్ళు చెమర్చాయి.

తలత్రిప్పి చూసింది. ఆనందరావు కళ్లు తెరుచుకుని నవ్వుతున్నాడు. "ఏమిటి విమలా అర్ధరాత్రివేళ? ఏమి వ్రాశావు?" అన్నాడు.

విమల సిగ్గుపడింది. "కథ వ్రాశాను చూడరూ?" కాగితాలు చేత్తో పుచ్చుకుని లేచింది.

"ఒంటిగంటైంది. ఇప్పుడేమిటి? తెల్లారి చూస్తాను. కోపం రాకూడదు. చూడు, రేపొద్దున్నే చదువుతాను" అని అతను లేచి కూర్చున్నాడు.

విమల పెదిమలు బిగించుకుని, లేచి తనమంచంమీదకు వెళ్ళిపోయింది. "అల్లాగే—ఒద్దు. మీరు చూడక్కర్లేదు." అని కాగితాలు తన దిండుక్రింద పెట్టుకుంది.

ఆనందరావు నవ్వుతూ మళ్ళీ పడుకున్నాడు. "ఇప్పుడు చదివాననుకో నేను. నాకేమీ అర్థంకాదు. అందులోను నువ్వు ఒలకబోసిన ముత్యాలు, ఏరుకుని చదివేసరికి దానిలోని భావం అందకుండా పోతుంది."


విమలకి తన దస్తూరీని ఎవరైనా ఆక్షేపిస్తే అందులోనూ భర్త ఆక్షేపిస్తే మరీకోపం. తన అక్షరాలు భావాలు పలుకుతాయని అంటుంది విమల.

"నిజమే పాపం, భగవంతుడు మీకిచ్చినట్లుగా అందరికీ యివ్వడుగా ముత్యాలకోవలాంటి దస్తూరి?" ఆమెకు తెలుసు దస్తూరీ భగవంతుడు యిచ్చింది కాదని.

"అది నిజమే అనుకో, ఒకవేళ నాకు అర్థమైందే అనుకో. నేను మెచ్చుకోలేను. సగమయ్యేసరికి అవులింతలు వస్తాయి, నా ఎదురుగా తీర్పుకి నిలబడిన ముద్దాయిలాగా నువ్వు కూర్చుంటే.



మన కథ



నవ్వొస్తుంది. ఎర్రగావున్న నీ కనురెప్పలు..."

విమల కిల్లాటివన్నీ అలవాటే. "బస్ నాకునిద్రొస్తోంది" అన్నది.

"గుడ్ నైట్" అన్నాడు ఆనందరావు. పది నిముషాల్లో అతను బరువుగా వూపిరి తీసుకోవడం వినిపించింది విమలకి. "హూ!" అనుకుని కిటికీలోంచి నక్షత్రాలు చూస్తూ పడుకుంది ఆమె.

తెల్లారి కాఫీ కప్పుతోపాటు కాగితాలు అందుకున్నాడు ఆనందరావు. "ప్రమీలాదేవి ప్రణయగాథ! ఏమిటిల్లా పోయింది మనస్సు?" అన్నాడతను. విమల తనకేమీ సంబంధించనట్లు అవతలికి వెళ్ళిపోయింది కానీ ఐదేసి నిముషాల కొకమాటు తెరలోంచి చూస్తూనే వున్నది ఆమె.

ఆనందరావు ప్రేళ్ళమధ్య సిగరెట్టు అల్లా కాలుతూనే వుంది. ఆ పొగ వుంగరాలుగా పైకి పోతోంది. అతనికళ్ళు తదేకంగా చూస్తున్నాయి. అతను మునిప్రేళ్ళతో ఒక్కొక్క కాగితం త్రిప్పుతుంటే విమల మనస్సులో ఆందోళన, సంతృప్తి, లజ్జ ముప్పిరిగొంటున్నాయి.

కథలో ప్రమీల ప్రణయాంకురం, శంకరాన్ని మొదట్లో నిర్లక్ష్యంచేసి, తరువాత అతన్నే ఆమోదించడం, అతని కాఠిన్యం ప్రేమే ద్వేషంగా మారడం, ప్రమీల ఆత్మహత్య—'ఎంత చక్కగానో వుంది ఆ కల్పన. ఆ భావ, ఆ వాక్యాల పొందిక-అన్నీ విశిష్టంగా వున్నాయి,' అనుకుంది విమల.

వక్క పొడి భరిణె తెచ్చి, బల్లమీదపెట్టి, ఎదురుగా కూర్చుంది విమల. ఆనందరావు కళ్లు ఎత్తిలేదు. నిశ్చలంగా చదువుతున్నాడు. ఒక్కనిముషం కూర్చుని, వెంటనే లేచింది విమల. ఆమె కేమిటో తోచడంలేదు.

'ఎంతబాగున్నదీ విమలా!' అని అతను తనను కళ్ళతో, మనస్సులో మెచ్చుకుంటాడనీ-ఆ సమయంలో తన బుగ్గలమీదనుంచి కంఠంవరకు ప్రాకి, కనురెప్పల్లో తేలియాడే అరుణకాంతులను తలచుకుని, తలచుకుని—ఆమె కేమిటో తోచడంలేదు.

తోటలోకి వెళ్లింది. మంచుతోనిండిన గులాబీలు, పారిజాతాలు అన్నీ చూస్తోంటే విసూత్నమై, సహజమైన తనకథే జ్ఞాపకమొచ్చింది ఆమెకి.

భర్త అడుగులసవ్వడి, 'విమలా!' అన్న అతని మధురమైన పిలుపు ఒక్కసారే వినిపించాయి. పాడుకుంటూ వచ్చి ఎదురుగా నిలబడ్డాడు అతను.

"ఏమిటి దేవిగారి ఆజ్ఞ? టిఫిను ఏమిటి యివాళ్ల? షికారు ఎక్కడికి? సాయంకాలం ప్రోగ్రాము ఏమిటి?" విమలహాతాశురాలయింది. చిన్నగా నవ్వింది. "ఏముంది? సాయంకాలం ఏంచేయాలో భోజనాల తర్వాత ఆలోచిద్దాం." ఆనందరావు నవ్వుకుంటూనే నాలుగు పారిజాతాలు ఏరుకున్నాడు.

"మరి ప్రస్తుతానికి యీ పవిత్రపాద పీఠసన్నిధిని కూర్చోమని సెలవా?"

విమల తిన్నెమీదనుంచి లేచి "ఇల్లా కూర్చోండి." అన్నది.

"అన్నట్లు చూడు, మీ అమ్మగారు ఎప్పుడు వస్తున్నారు? ఈ త్తరం రాలేదూ?" అని ప్రశ్నించాడు ఆనందరావు.

విమలకి దుఃఖం రావటం లేదుకానీ—"ఈ త్తరం రాలేదు. నాకు పనుంది." అంటూ లోపలికి వెళ్ళింది—ఆనందరావు తనమీదకి ఎసరిన పారిజాతాలనైనా లెక్క చేయకుండా.

మధ్యాహ్నం భోజనాలుకాగానే నిద్రపోయాడు ఆనందరావు. నాల్గుగంటలకి లేచి, ఒక తీపి, కారం తిని, టీ త్రాగాడు. పేము కుర్చీ మల్లెపందిరిదగ్గరికి యీడ్చుకుని పేపరుపుచ్చుకున్నాడు.

★ చిరిగిపోయిన కథ ★

హైదరాబాదు నవ్యసాహితీ సమితి పంచమ వార్షిక సమావేశం డిసెంబరు ఆఖరున జరిగినప్పుడు కుమారి జానకీరాణి తాను ప్రత్యేకించి వ్రాసిన ఈ కథానికను చదివి సదస్యులను ఆహ్లాదపరచింది. కథారచనలో కుమారి జానకీరాణి చాతుర్యం సచిత్ర వారపత్రిక పాఠకులకు తెలిసిందే. —సం]

విమల దగ్గర్లోనే మరో కుర్చీలో కూర్చుంది. "చెప్పండి." అన్నది. వెంటనే నాలిక్క అనుకుంది ఎందుకడిగానా అని. "ఏమిటి చెప్పాలి!" పరధ్యానంగా అన్నాడు ఆనందరావు. ఏమంత శ్రావ్యంగా లేదు విమలకి యీ ప్రశ్న.

"ఎల్లావుంది నాకథ ?"

ఆనందరావు మాట్లాడలేదు. జేబులుతడిమి సిగరెట్టు ప్యాకెటు తీసి సిగరెట్టు ముట్టించాడు. నీలిపొగలవేపు, నిమీలిత నేత్రాలతో చూశాడు. నుదుటిమీదపడిన అతని వెంట్రుకలు అందంగా వూగాయి గాలికి.

"ఏమిటంటావు ?"

"ఏమీ లేదు."

"నీ కథ కాదూ ? ఊ. బాగుండలేదు."

విమల పలకలేదు. ఊపిరి కూడా తీసుకోలేదు. ఏమిటో యిది. పరిహాసంకాబోలు–నీరసంగా నవ్వి "అల్లాగా ?" అన్నది.

"నిజం విమలా, ఏమీ బాగుండలేదు. నీకథవస్తువు మంచిది, పాత్రలు మంచివి, నువ్వువ్రాసిన భాషకూడా మంచిదే. కానీ నువ్వు సృష్టించిన ఆ సన్నివేశాలు; సంభాషణలు నిజమయ్యే అవకాశం లేదు. ఏదో కృత్రిమత్వం వుంది. అసహజత్వంతో నువ్వు పాఠకుణ్ణి మెప్పించలేవు. మనుష్యులంతా నిజాలుగా మనకు సమీపమైన వాళ్ళుగా గోచరించాలి."

విమల నరాల పట్టు సడలి, మనస్సు, శరీరం పట్టుతప్పుతున్నట్లనిపించింది. వణికే తన వ్రేళ్లను చూసుకుంటూ కూర్చుంది ఆమె.

అదీకాక—నువ్వు కథని ఎక్కడ ప్రారంభించావు? ఎక్కడ పూర్తి చేశావు? ఎక్కడెక్కడ ఏ పాత్రని నిష్క్రమింప చేశావు? అతుకులు అతుకులుగా, అర్థంలేని ప్రారంభంతో అసంపూర్ణమైన ముగింపుతో వుంది నీకథ నువ్వు మళ్ళీ వ్రాయాలి విమలా! ఆలోచించి ఆ పాత్రల్ని కథావస్తువును బాగా ఉపయోగించుకోవాలి ... ఏదీ నీ కాగితాలు తీసుకురా."

విమల లేవలేదు. అయిష్టంగా, చలించే కళ్ళతో చూసింది. "వద్దు." అన్నది తల వంచుకుని.

"అల్లాకాదు. తీసుకురా."

ఆమె మెల్లిగా లేచి, లోపలకు వెళ్ళి తన కథని తీసుకువచ్చింది, "చూడు విమలా, చూడాలి మరి. దీనికి రెట్టింపు కాగితాలు నువ్వు తలచుకుంటే, యింతకంటే చక్కని కథతో, గంటలో నింపివేయగలవు. చూడు – ఇది చింపేయి. వద్దు నీకీకథ, భ్రమలో పడకు విమలా, నామాట విని చింపేయి యీ కథని."

విమల మాట్లాడలేదు. ఆమెహృదయంలో కొంచెంబాధ — "వద్దండీ, నేను చింపను. దీన్ని మారుస్తాను మీరు చెప్పేవట్లుగా"

"వద్దు విమలా, నామాట విను. అద్భుతమైన కథ వ్రాయగలవు నువ్వు. ఇది వుండగా మళ్ళీ నీవల్లకాదు వ్రాయడం. చింపేయి"

యాంత్రికంగా, ఆ నలభై కాగితాలని, రెండుగా, నాలుగుగా, ఎనిమిదిగా — ముక్కలుముక్కలుగా చింపేసింది విమల. ఆనందరావుచిన్నగానవ్వి "చూడు, యివాళే వ్రాద్దువుగాని మళ్ళీ — నీ కలానికి సాధ్యం కాని దేముంది?" అన్నాడు.

ఆరాత్రి నీరసంగా అనిపించింది ఆమెకి. మరురాత్రి తీరికలేదు. మూడోనాడు కలం, కాగితాలు తీసుకుని కూర్చుంది. ఆనందరావు నిద్రపోయాడుపసిపిల్లాడిలాగా. అతను విమర్శకుడు—తను రచయిత్రి—అతను రచయిత ఐనప్పుడు తను విమర్శకురాలు కాదు. ఎందుకంటే అతన్ని ఆమోదించేలోకం తన విమర్శనని ఆమోదించదు.

కలం కాగితాలమీద నడుస్తోంది. నాట్యం చేయటంలేదు. తప్పటడుగులు వేస్తోంది. ఒక పేజీ వ్రాసి నిస్పృహతో చింపేసింది. మరో కాగితం, మరొక్క కాగితం—అన్నీ ముక్కలైనాయి. అసంతృప్తితో, బాధతో పడుకుంది ఆరాత్రి విమల.

* * *

ఆతర్వాత కొన్ని కథలు వ్రాసి పత్రికల్లో వేసింది విమల. 'ఈవిడ బాగా వ్రాస్తుందే' అనుకున్నారు ప్రజలు కొందరు. రెండేళ్ళు తిరిగేసరికి 'విమల అనే ఆవిడ చాలా బాగా వ్రాస్తుంది" అనుకున్నారు చాలామంది.

* * *

రాత్రి—సోఫాలో పడుకుని ఏదో పత్రిక తిరగేస్తోంది విమల. ప్రక్కగదిలో నుంచి "అక్బరు చక్రవర్తి చాలా గొప్పవాడు. ఆయన హిందూ ముస్లింలను సమానముగా..." వినిపిస్తోంది ఎనిమిదేళ్ళ పసికంఠం. ఆవులించి లేచికూర్చుంది విమల. గాలికి దీపాలు వూగిసలాడుతున్నాయి. కొంచెం చలిగా అనిపిస్తోంది. ఆయన ఇంకా రాలేదేం? అనుకుంటూ లేచి, గదిలోకి వెళ్ళింది విమల. బుల్లి మంచంమీద నాలుగేళ్ళ చిట్టి నిశ్చింతగా నిద్ర పోతోంది— చేతిలోని ఆటబొమ్మతో. మెల్లిగా బొమ్మ తీసి వత్తిగిలించి పడుకోబెట్టి, రగ్గు కప్పింది విమల.

"బుజ్జీ, చాలమ్మా చదువు. రేపు చదువుకోవచ్చు." అని కొడుకుని కేకేసి, వంటింట్లోకి వెళ్ళిందో లేదో భర్త వచ్చిన అలికిడయింది. బుజ్జితో ఖబుర్లు చెబుతూ భోజనానికి వచ్చాడు ఆనందరావు.

పను లన్నీ అయ్యేసరికి నిద్ర వచ్చేసింది--

: అరే రామూ? మన చుట్టు గాలి ఏ దిక్కుగా వీస్తుందో తెలుసుకొనుటకేంచేయాలో చెప్పు?

కు: మా అన్నయ్య సిగరెట్టు తాగి పొగవదిలితే తెలుస్తుందన్నాడండి.

* * *

మే: పొగ త్రాగుట చాలా దురలవాటు. వంటిని చెరచును.

కు: మరి త్రాగేవాళ్లందరు పొగమళ్లీ బయటవదిలేస్తారు కదండీ, తాగకుండా......

—కె. సర్వలక్ష్మి, రాజమండ్రి.

విమలకి. ఇంకా భర్త బల్లదగ్గర కూర్చుని ఏదో వ్రాసుకుంటున్నాడు.

"పాప నిద్రొస్తోంది" అని చెప్పి, మంచం మీద వాలింది విమల—గండం గడిచింది!

ఉలిక్కిపడి లేచింది ఆమె. గాలి విపరీతంగా వీస్తోంది. కిటికీలు కొట్టుకుంటున్నాయి. దోమ తెరలు, కిటికీ తెరలు, వూగుతున్నాయి.

విమల కళ్లు తెరచి చూసింది. ప్రక్కనే పాప వున్నది. నిశ్శబ్దంగా నవ్వుతూ, కాళ్ళు చేతులు వూగించి ఆడుకుంటోంది. పాప ముఖంలో కళ చూసేసరికి, విమల హృదయం ఉప్పొంగింది.

"నా తల్లే, నన్ను లేపకుండా "ఆడుకుంటున్నావ్ నవ్వుతూనూ" అని ముద్దెట్టుకుని, పాప కళ్ళల్లోకి చూసింది.

ఏమిటో జ్ఞాపకం వస్తోంది నిశ్శబ్దంగా నిర్మలంగా నవ్వే యీ చిన్నారిని చూస్తే—పదేళ్ళ క్రితం ఒక రాత్రి భర్త ముఖాన నవ్వు—తను వ్రాసుకుంటుంటే నిద్రలోంచి లేచి, తన వంక చూసి నవ్వలేదూ ఆయన? అదే నవ్వు!

బాధగా లేచి, అలమారులో పాల సీసా తీసింది విమల. ఆనందరావు వ్రాసుకుంటున్నాడు యింకా.

"చూడండి." ఆనందరావు చూడలేదు. "ఏమిటి?" అన్నాడు. విమల పాలు కలుపుతోంది. అతను ఏదో విమర్శ వ్రాసుకుంటున్నాడు. ఏమిటో బాధగా, కసిగా, చీకాకుగా వుంది విమల మనస్సు.

ఆనందరావు కలం బల్లమీద పెట్టి వ్రేళ్ళు విరుచుకున్నాడు. "ఏమిటంటావు?" అన్నాడు.

"మరి—నేను పదేళ్ళ క్రితం ఒక కథ వ్రాశాను. జ్ఞాపకముందా?" అన్నది.

ఆనందరావు వేళ్ళు విరుచుకున్నాడు. "ఒకటేం? చాలా వ్రాశావు. ఏం?" అన్నాడు అతనికి జ్ఞాపకంకూడా లేదు తనకంత ముఖ్యమైన సంఘటన.

"కాదు. అన్నీ కాదు. ఒక చక్కని కథ వ్రాశాను. ప్రమీలాదేవి ప్రణయగాథ అని"

ఆనందరావు నవ్వాడు. "ఔను వ్రాశావు. ఏమైంది? మళ్ళ వ్రాయాలనిపిస్తోందా? వ్రాసుకో."

విమల మనస్సులో ఎక్కడో అణిగిపోయి, నిద్రిస్తున్న ఆస్మృతి మేల్కొన్నది. ఆ రాత్రి, నీలం దీపం, పారిజాతాలు, భర్త మునివ్రేళు—అన్నీ లీలగా, బాధగా ఆమె స్మృతిపథంలో కనిపించాయి. నీలిపొగలు అందంగా లేచి మబ్బులో గాలిలో కలిసి పోయినట్టుగా.

"ఆ కథ—అది. చింపేయించేరుకదూ మీరు!" తనుమళ్ళ వ్రాయలేని ఆ కథ—దానిమీద ప్రేమ, మమకారం లేస్తోంది. ఆమె హృదయంలో.

"ఔను విమలా, నీమంచికోసమే చింపేయమన్నాను. ఇప్పుడేమైంది! మళ్ళీ వ్రాసుకో."

ఈ విమర్శకుడు కుమార్హుడేనా! తను ఎన్ని కథలు వ్రాస్తే నేం?—తను మనస్ఫూర్తిగా ఉత్తమమనుకుని, ఆప్యాయంగా చూసుకున్న ఆ కథ—మళ్ళీ తనకలం వ్రాయలేదు ఆ కథని.

విమల నీరసంగా నవ్వింది—"నిజమే. నాకు తోచనేలేదుసుమండీ యీ ఆలోచన" అన్నది.

పాలబుడ్డీ తీసుకుని, పాపని వళ్ళో పెట్టుకుంది. ఆ కథ ప్రచురితమైతే, తనకి కొంత కీర్తి—యిప్పుడు వచ్చిన దానికంటే విశిష్టమైనది రాకపోయినదా? విషాదాంత ప్రణయకథల్లో తను వ్రాసిన కథకూడా గణనీయంగా ఉండకపోయేదా? భర్త ఎంత ఉత్తమ విమర్శకుడైతేమాత్రం యీ ఒక్క విషయంలో పొరబడివుండకూడదా?

ఆరోజుల్లో తనని అల్లా మంత్రించి, ముగ్ధరాలిని చేసి, చెప్పినదల్లా చేయించే శక్తి వుండేది అతనికి. ఇప్పుడు మాత్రం—?విమల నీరసంగా నవ్వుకుంది ఎప్పుడూ అంతే.

పాప ముంగురులు సవరిస్తూ, బరువుగా మూసుకుపోయే రెప్పలెత్తి భర్తవంక చూసింది విమల. ఆనందరావు చూపులో జాలి—కొంచెం పశ్చాత్తాపం?—కనుపించాయి ఆమెకి.

అతని పశ్చాత్తాపం ఏమి చేయగలదు? పది మంది సంతానంకలిగినా, ఏనాడో ఘరణించిన శిశువుమీది తల్లి మమకారంలాంటిది—చిరిగిపోయిన ఆకథ మీది ప్రేమ.

కళ్ళుమూసుకుని "అబద్ధం. మళ్ళీ వ్రాసుకోలేను—ఎన్నటికీ వ్రాసుకోలేను" అనుకుంది సన్నగా విమల. ★

నక్షత్ర ఫలితాలు

(22-1-58 మొదలు 28-1-58 వరకు)

బి. నరసింగరావు

గ్రహ స్థితి

	కే		
\	తే 24దీని శుక్రాస్తమయము. తే 25 దీని కుజుడు ధనస్సుకు మారును. కుంభ,మీన, మేష ములలో చంద్రుడు.		
ర కు			
బు	శు శ	గు రా	

అశ్విని [చూ, చే, చో, లా]

ఈవారము మిత్రులతో కలిసి వినోదములలో పాల్గొంటారు. శుభ కార్యములనుగురించి ఆలోచనలు చేస్తారు. ఇతరులకు కార్య నిర్వహణలో సహాయము చేస్తారు. వాహన యోగము వుంది. వర్తకులు ఖరీదైన వస్తువుల క్రయవిక్రయములలో లాభముపొందుతారు. నూలు, బట్టల వర్తకులకు యోగము. విద్యార్థులు శ్రద్ధగా చదువుకుంటారు. కవులకు గాయకులకు, కళాకారులకు, నటీనటులకు మేలుకాలము. 22, 23 తేదిలలో త్రిప్పట, శ్రమ; ఆపైనయోగం. 28 న స్వల్ప అస్వస్థత.

* భరణి [లీ, లూ, లే, లో] *

ఈవారము ఆదాయము వృద్ధిచేసుకుందికి చేసే ప్రయత్నాలు ఫలించవు. కార్యభారము ఎక్కువ. ఉష్ణాధిక్యము చ ఆరోగ్యము చెడుతుంది. ధనలోపము చే గృహావసరములు తీరవు. విద్యార్థులకు చదువుపై శ్రద్ధతక్కువ. కోరువ్యవహారములు వెనుకపడుతివి. 22, 23 తేదిలలో కార్యభంగము, అస్థిమితము, వ్యథ. 24, 25, 26 తేదిలలో రాజకీయాలలోవున్న వారికి యోగము. 28 న ఆరోగ్యభంగము.

కృత్తిక [అ, ఈ, ఊ, ఏ]

ఈవారము మీకు అంతయోగకాలము కాదు. మీరు తలపెట్టిన కార్యములకు విఘ్నములు కలుగుతాయి. కాని వారాంతమున నిజమైన మిత్రసహాయమువల్ల కార్యసిద్ధి పొందుతారు. ఉద్యోగస్థులు ఆర్థిక చిక్కులను ఎదుర్కొ వలసివస్తుంది. వ్యాపారస్థులకు మాంద్యముగా వుంటుంది. విద్యార్థులకు చదువుమీద అలక్ష్యము. 22, 23 తేదిలలో కార్యభంగము, అస్థిమితము, శ్రమ. 24, 25, 26 లలో ప్రయాణము, మిత్రదర్శనము, కార్యలాభము. 28 న అనారోగ్యం.

*రోహిణి [ఓ, వా, వీ, వూ] *

ఈ వారము మీకు మిశ్రమయోగము. మొదలుపెట్టిన పనులకు ఆటంకాలు కలుగుతాయి. బుద్ధిబలము ఉపయోగించి కార్యసాధనకు ప్రయత్నిస్తారు. ఈశ్వరాను గ్రహమువల అన్నీ సాధ్యపడతాయనే నిబ్బరముతో వ్యవహరిస్తారు కనుక చివరకు జయము కలుగుతుంది. ఉద్యోగస్థులకు అస్థిమితము; వర్తకులకు ఆరాటన. విద్యార్థులకు చదువు సాగకపోయినా కొత్త విషయాలు నేర్చుకుంటారు. 22, 23 తేదిలలో నిలకడలేనిస్థితి, శ్రమ. 24, 25, 26, 27 తేదిలలో ప్రయాణము, ఆత్మవికాసము, కార్యలాభము 28 న ఇంట్లోవారి ఆరోగ్యమును గురించి చింత.

* మృగశిర [వే, వో, కా, కీ] *

పోయినవారములోవలెనే ఈ వారము కూడా ఆదాయాభివృద్ధికి అధిక కార్యభారము వహించి, ఆశాభంగము పొందుతారు కోర్టు వ్యవహారములో కొంత మేలు పొందిననూ అధిక ఖర్చులవల్ల ఆసంతోషము తక్కువ ఉద్యోగస్థులకు అధికారుల ఒత్తిడి. వ్యాపారస్థులకు లాభము తక్కువ. గృహమందున్న స్త్రీలలో ఒకరికి ఆరోగ్యభంగమువల్ల ఆరాటన. 22, 23 తేదిలలో కార్యభారము వల్ల శ్రమ. 24, 25, 26 తేదీలలో కొంత అనుకూలత. 27 న వివాదము. 28 న మనోవ్యథ.

* ఆర్ద్ర [కూ, ఖ, జ, ఛ] *

సాహసముతో మొదలుపెట్టిన పనులు ఫలించవు. అయినప్పటికి ధైర్యము విడవక, నిరాశచెందక ప్రయత్నించి కార్యసిద్ధి పొందుతారు. సోదరసహాయము వుంటుంది. ఉద్యోగస్థులు అధికారులచే మాటపడి మనోవ్యథ పొందుతారు. విద్యార్థులు వినోదములలో పాల్గొని ప్రమాదములకు గురవుతారు. రసాయనిక పదార్థములు, ఎరువుల వర్తకులకు లాభయోగము. 22, 23 తేదిలలో కార్యభంగము, నిరాశ, శాంతి. 24,25,26 తేదిలలో ప్రయాణము, సోదర సహాయము. కార్యసిద్ధి. 28 న ప్రమాదము.

* పునర్వసు [కే, కో, హా, హీ] *

ఈ వారము మీ బుద్ధి బలము చేతను, పదవిలో నున్నవారి సలహావల్లనూ కార్యసిద్ధిని పొందుతారు. మిత్రులను కలుసుకుంటారు. దూరమందున్న ఆత్మీయుల కుశలవార్త తెలియుటవల్ల కొంతకాలముగా వుంటున్న ఖేదము పోతుంది. విద్యార్థులు కొత్త విషయాలు నేర్చుకుంటారు. వైద్యులకు లాభము. కవులకూ, కళాకారులకూ, గణిత శాస్త్రజ్ఞులకూ మేలుకాలము. 22, 23 తేదీలలో కార్యచరణవల్ల త్రిప్పట, అలసట. 24,25,26,27 తేదీలలో ప్రయాణము, మిత్రదర్శనము, కార్యలాభము. 28 న అస్వస్థత.

పుష్యమి [హూ, హే, హో, డా]

ఈ వారము మీ హోదా పెరుగుతుంది. సంఘములో మీ పలుకుబడి ఎక్కువవుతుంది. విజ్ఞానులవల్ల కొత్త సంగతులు తెలుసుకుంటారు. పిల్లలకు అభివృద్ధి కలిగే కార్యాలు చేస్తారు. విద్యార్థులు శ్రద్ధగా విషయాలు నేర్చుకుంటారు. పండితగోష్ఠిలో పాల్గొంటారు. ఉపాధ్యాయులకూ, న్యాయవాదులకూ, పండితులకూ, కళాకారులకు యోగించును. 22, 23 తేదిలలో కార్యసాధనలో త్రిప్పట, శ్రమ. 24, 25, 26, 27 తేదీలలో ప్రయాణము, బంధుసమాగమము, కార్యసిద్ధి. 28 న అనారోగ్యము.

ఆశ్లేష [డీ, డూ, డే, డో]

గతవారము కలిగిన మంచియోగము ఈ వారము కూడా సాగుతుంది. ఆటంకములు తీరిపోతివి. అనుకున్న డబ్బు చేతికి వస్తుంది. బంధువులతో మృష్టాన్న భోజనము ఇంట్లో కలిగిన అశాంతి తొలగుతుంది. విద్యార్థులకు చదువుపై శ్రద్ధ కలుగుతుంది. నూలు, బట్టల వర్తకులకు లాభము. వెండి సరుకుల వ్యాపారస్థులకు ప్రయాణమువల్ల లాభము. కవులకు, గాయకులకు, నటీనటులకు యోగకాలము. 22, 23 తేదిలలో ఖర్చులు ఎక్కువ, త్రిప్పట, అశాంతి, శ్రమ. 24, 25, 26, 27 తేదిలలో ప్రయాణమువల్ల లాభము, శుభయోగము. 28 న ఆరోగ్య చింత.

మఖ [మా, మీ, మూ, మే]

మీకు ఈ వారము, యోగదాయక. గతవారము అసంపూర్తిగా నిలిచిన పనులు ఈవారం లాభకరముగా ముగుస్తాయి. గృహ

మందుంచువారికి అలంకార ప్రాప్తి; మీకు వాహనయోగము. పశుసంపద వృద్ధి అవుతుంది. విద్యార్థులు శ్రద్ధగా చదువుకుంటారు. కవులకూ, గాయకులకూ, కళాకారులకూ, నటీనటులకూ యోగకాలము. 22, 23 తేదీలలో త్రిప్పట, అశాంతి, 24, 25, 26, 27 తేదీలలో కార్యసిద్ధి, ఆప్తులతో విందు, వినోదము, శుభవార్త. 28 న ఆరోగ్యము.

* పూర్వఫల్గుణి (పుబ్బ) *
[మో, టా, టీ, టూ]

ఈ వారము మీ ఆశయాలు, ఆశలు తీరిందికి చాలా ఆటంకాలు వస్తాయి. అవసరాలకు కావలసిన ధనలోపమువల్ల కార్యాచరణలో ఆశాభంగము కలుగుతుంది. వేళతప్పిన భోజనమువల్ల ఆరోగ్యము చెడుతుంది. శ్రద్ధ వహించండి. ఉద్యోగస్తులకు క్రొత్త సమస్యలు కలుగుటచే ఆందోళన పొందుతారు. వర్తకులకు ఒడిదుడుకులు కలుగుతాయి. 22, 23 తేదీలలో త్రిప్పట, అశాంతి. 24,25, 26 తేదీలలో ప్రయాణము, స్వల్పలాభము. 28 వ తేదీని ఆరోగ్యభంగము.

* ఉత్తరఫల్గుణి (ఉత్తర) *
[టే, టో, పా, పీ]

ఈ వారము మీరు అనుకున్నట్టుగా డబ్బు చేతికి రానందున యత్న కార్యములు నెరవేరక మనోవ్యథ పొందుతారు. మిత్రులనుకున్నవారు తటస్థముగా వుంటారు. మీకు వ్యతిరేకులని అనుమానపడిన వ్యక్తి సహాయమువల్ల, కార్యలాభము పొందుతారు. వ్యాపారస్తులకు మొదట్లో ప్రతికూలము, వారాంతమున లాభం. విద్యార్థులకు చదువుపై శ్రద్ధ తక్కువ. 22, 23 తేదీలలో అధికఖర్చులు, శరీరాయాశము, కార్యాభంగము. 24, 25, 26 తేదీలలో ప్రయాణము, మిత్రసహాయము, కార్యలాభము, విచిత్రవస్తు సంగ్రహణం. 28 న ఇంట్లో వున్న ముసలివారి ఆరోగ్యభంగము.

* హస్త [పూ, ష, ణ, ఠ] *

ఈ వారము అంత యోగదాయకముగా వుండదు. కార్యహాని, కలతలు వచ్చి నిరుత్సాహముగా వుంటుంది. అయిననూ ఆధ్యాత్మికచింత కలిగి దైవానుగ్రహమువల్ల అన్ని కష్టములు తీరుతాయనే ధైర్యముతో వుంటారు. ఇంట్లోవారి అనారోగ్యము కొంత కలవరపాటు కలిగించుతుంది. వ్యాపారస్తులకు నిరాశ. ఉద్యోగస్తులకు ఒత్తిడి. విద్యార్థులకు చదువుమీద అనాశక్తి. 22, 23 తేదీలలో ఆటంకములవల్ల అశాంతి. 24, 25, 26 తేదీలలో సాధుసాంగత్యమువల్ల మనశ్శాంతి. 27 న స్వల్ప అనుకూలత. 28 న ఆరోగ్యచింత.

చిత్త [పే, పో, రా, రీ]

ఈ వారము అనుకున్న పనులకు అన్నీ ఆటంకములే. కార్యభారము ఎక్కువగుటవల్ల శ్రమ పొందుతారు. కోర్టువ్యవహారములు అనుకూలించిననూ ఖర్చులు అధికమగుటవల్ల ఆ సంతోషము వుండదు. ఇచ్చిపుచ్చుకోవడములో చిక్కులు ఏర్పడి వివాదాలు వస్తాయి. ఉద్యోగస్తులు పైవారిచే మాట పడతారు. వర్తకులుకు ఆందోళన. భార్యకు అనారోగ్యము. విద్యార్థులకు బద్ధకము. 22, 23 తేదిలలో కార్యభంగము. వివాదము. 24, 25, 26 తేదిలలో త్రిప్పట. కార్యానుకూలత. 27 న వ్యవహారలాభము. 28 న ఆరోగ్యచింత.

* స్వాతి [రూ, రే, రో, తా] *

మీకు సాహసము ఎక్కువగుటచే చెయ్యలేనన్ని పనులు మీద వేసుకొని తాపత్రయపడతారు. ఫలము లేకపోయిననూ ప్రయత్నములను విడవకుండా ధైర్యముతో వ్యవహరిస్తారు. కనుక క్రమేణా సాధించగలరు బంధుసహాయము వల్ల చాలా వరకూ సుముఖమవుతుంది. యంత్రములవల్లగాని, వాడిగల పనిముట్లవల్లగాని కలిగే ప్రమాదములు జాగ్రత్తవల్ల తప్పవచ్చును. 22,23 తేదిలలో అస్థిమితము, త్రిప్పట. 24, 25, 26 తేదిలలో ఆదాయ వృద్ధి, సహాయము. ఖనిజ, లోహముల వ్యాపారస్తులకు శ్రమతో కూడిన లాభము. 28 న ప్రమాదభయము.

విశాఖ [తీ, తూ, తే, తో]

ఈ వారము మీ ప్రజ్ఞను, పలుకుబడిని ఉపయోగించి కార్యానుకూలత పొందుతారు. ధనలోపము తీరుతుంది. అనుకున్న పనులు వెంటనే నెరవేరుతాయి. ఆప్తుల క్షేమము తెలియుటవల్ల చిత్తశాంతి కలుగుతుంది. ఉద్యోగస్తులకు తొందరలు తీరుతాయి. వైద్యులకు లాభము. కవులు నూతన రచనలు మొదలుపెడతారు. చిత్రకారులకూ, నటీనటులకూ మంచికాలము, 22, 23 తేదిలలో కార్యాచరణలో త్రిప్పట, శ్రమ. 24, 25, 26, 27 తేదిలలో ప్రయాణము, అధికారుల ఆదరణ. మిత్రదర్శనము, కార్యలాభము. 28 న అలసట.

అనూరాధ [నా, నీ, నూ, నే]

ఈ వారము మీకు యోగకాలము. ధనలాభము కలుగుతుంది. పిల్లల యోగక్షేమములకు అభివృద్ధి కలిగే కొన్ని ఏర్పాట్లు చేస్తారు. కోర్టు వ్యవహారములు అనుకూలముగా వుంటాయి. విజ్ఞాన చర్చలలో పాల్గొంటారు. విద్యార్థులు ఉత్సాహముతో చదువుకుంటారు. ఉద్యోగస్తులకు హోదా పెరుగవచ్చును. ఉపాధ్యాయులకు, న్యాయవాదులకు, పండితులకు యోగకాలము. 22, 23 తేదీలలో కార్యాచరణలో తీరికలేక శ్రమ. 24, 25, 26, 27 తేదీలలో ధనయోగము, కార్యసిద్ధి, పండితగోష్ఠి. 28 న ఆరోగ్యలోపము.

జ్యేష్ఠ [నో, యా, యీ, యూ]

ఈ వారము తలపెట్టిన పనులు నెరవేరుతవి. ఆర్థికస్థితి మెరుగుగా వుంటుంది. కళాకారులు వినోదములలో పాల్గొంటారు. ఆగ్నేయదిక్కునుండి శుభవార్త వింటారు. వ్యాపారస్తులకు, ముఖ్యముగా వెండి సరుకుల నమ్మువారికి ప్రయాణమువల్ల లాభము.

ధరలు:

నూలు, వస్త్రములు : స్వల్పముగా తగును.

నూనెదినుసులు : మార్పులేదు.

బెల్లము, పంచదార: సమస్థాయిలో నుండును.

చింతపండు : తగ్గును.

ఆహారధాన్యములు : తగుముఖం పట్టును.

పప్పుదినుసులు : మార్పులేదు.

వెండి, బంగారము: స్వల్ప తేడాలో వుండును.

మేఘాడంబరము, దక్షిణదేశమున చెదురుగా వర్షము.

* * *

జన్మనక్షత్రము బట్టిగాని, జన్మనక్షత్రము తెలియనివారు నామనక్షత్రము (వారి వారి పేర్లననుసరించి పేరు మొదటి యక్షరము)ను బట్టిగాని ఫలితాలు తెలుసుకొనునది.

కృష్ణుడను పేరునకు మృగశిరా నక్షత్రమును, హృష్ణుడను పేరునకు స్వాతియు, శ్రీధరుడను పేరునకు చిత్తయును, క్షేత్రపాలకుడనే పేరునకు హస్తయును, భీముడు, భైరవుడు అనే పేర్లకు పూర్వాషాఢయును చూచుకొనునది.

★ నక్షత్రఫలితాలు ★

నూలు, బటల వర్తకులకు మంచికాలము. విద్యార్థులకు చదువుపై ఆసక్తి ఎక్కువ. కవులకు, కళాకారులకు, నటీనటులకు యోగకాలము. 22, 23 లలో కార్యభారము వల్ల శ్రమ. 24, 25, 26, 27 తేదిలలో ఆర్థికలాభము, ప్రయాణము, కార్యలాభము శుభవార్తా శ్రవణం. 28 న బడలిక.

మూల [యే, యో, బా, బీ]

ఈ వారము మీ ఆదాయము పెరుగుతుంది. యత్నకార్యములు ఫలిస్తాయి. కవులు, గాయకులు మొదలగు కళాకారులతో వినోదిస్తారు. దూరప్రయాణము చేయవలసి వుంటుంది. సాంఘిక కార్యాలలో పాల్గొంటారు. శుభకార్యాలోచనలు, బంధుమిత్రులతో విందుభోజనము జరుగుతవి. కవులకు, గాయకులకు, కళాకారులకు, నటీనటులకుమంచియోగము. 22, 23 తేదిలలో త్రిప్పట, శ్రమ, అధిక ఖర్చులు, 24, 25, 26, 27 తేదిలలో, ధనలాభము, కార్యసిద్ధి, ప్రయాణము శుభకార్యాలోచన, విందుభోజనము, 28 న ప్రయాసము.

పూర్వాషాఢ [బూ, ధ, భా, ఢ]

వృత్తిలోగాని వ్యాపారములోగాని ఎంతకష్టపడినసూ కార్యములు నెరవేరవు. త్రిప్పటవల్లను అకాలభోజవమువల్లను ఉష్ణాధిక్యము కలిగి అనారోగ్యచిహ్నాలు కనబడిన వెంటనే శ్రద్ధ తీసుకోండి. ఉద్యోగస్తులకు బాధ్యతలు ఎక్కువ. ఆదాయాభివృద్ధి. విద్యార్థులకు చదువు సాగదు. 22,23 తేదిలలో త్రిప్పట, కార్యభంగము, అధిక ఖర్చులు, 24 25,26,27 తేదిలలో ప్రయాణము, రాజకీయవాదులకు కార్యలాభము. 8 న ఆరోగ్యభంగసూచనలు.

ఉత్తరాషాఢ [బే, బో, జా, జీ]

ఈ వారము అశాంతి ఎక్కువ. ఏపని చేసిందికి మనస్సమాధానం కుదరక చికాకు పడవలసి వుంటుంది. ప్రతి ప్రయత్నము కొన్నాళ్ళు పోయేక అయేటట్టు వుంటుంది. కార్యసిదికి శ్రమపడుతూకూడా మాటపడవలసివుంటుంది. రాబడి పెరగకపోవడం అన్నిటికన్నా పెద్ద ఆటంకం. అయినా వారాంతములో మీకన్న హోదాలో వున్నవారి సహాయమువల్ల కొన్ని ప్రయత్నాలు ఫలిస్తాయి వ్యాపారస్తులకు వార ప్రారంభములో ఆందోళనగా వున్నప్పటికీ వారాంతమున లాభిస్తుంది. 22, 23 తేదిలలో నిలకడలేని ఆందోళన. 24, 25, 26 తేదిలలో ప్రయాణము, కార్యలాభము. 28 న అస్వస్థత.

శ్రవణము [జూ, జే, జో, ఘా]

ఈవారము మీరు ఎవరి సహాయమువల్ల పనులు నెరవేర్చుకుందా మనుకుంటున్నారో వారే మీకు ఆటంకాలు కలుగజేస్తారు. డబ్బుకు తొట్రుపాటు ఎక్కువ మీకు తలపెట్టిన మోసమే దైవకృపవల్ల అనుకూలంగా పరిణమిస్తుంది. వర్తకులకు త్రిప్పట, ఆశాభంగము కలిగినసూ కొంత లాభముకూడా కలిసివస్తుంది. 24, 25, 26 తేదీలలో మాటకారితనంవల్ల కార్యసాధన పొందుతారు. ఉద్యోగస్తులకు అనుకూలంగా వుంటుంది. 28-న ఇంట్లో కొందరికి అనారోగ్యం కలుగుతుంది.

* ధనిష్ఠ [గా, గీ, గూ, గే] *

ఈ వారము డబ్బుగురించి ఎక్కువకష్టం కలుగుతుంది. సర్దుబాటు చేసుకోవలసిన అవసరాలు ఎక్కువవుతాయి. కిందా మీదా పడతారు. వివాదాలు వస్తాయి. మీకష్టాలు మీకు వుండగా ఇతరుల పనులుకూడా మీద వేసుకొని శ్రమపడతారు. భార్య ఆరోగ్యం సరిలేనందున వ్యథపొందుతారు. వర్తకులకు ప్రయాణమువల్ల శ్రమకలిగినసూ లాభము వుంటుంది. ఉద్యోగస్తులకు ఒత్తిడి ఎక్కువ. 22,23 తేదిలలో ఆర్థికంగా ఒత్తిడి, త్రిప్పట, అశాంతి. 24, 25, 26 తేదీలలో ప్రయాణము, కొంత లాభము. 28 న మనోవ్యథ.

* శతభిషం [గో, సా, సీ, సూ] *

ఈ వారము మీరు చాలా పనులు చేయవలసివున్నా, ఏమి చేసిందికి పాలుపోదు. ప్రతి ప్రయత్నానికి ఆటంకము కలుగుతుంది. దానివల్ల కొంత డబ్బు దండుగకూడా అవుతుంది. అస్వస్థత కలుగుతుంది. అవయవములకు దెబ్బలు తగిలే ప్రమాదముంది; జాగ్రత్త పడండి. 22, 23 తేదిలలో త్రిప్పట, శ్రమ, అశాంతి. 24, 25, 26, 27 తేదిలలో పోలీసు ఉద్యోగులకు, యంత్రములు నడిపే నిపుణులకు మేలు క్షేమ. 28 ప్రమాదసూచన.

* పూర్వాభాద్ర [సే, సో, దా, దీ] *

గత వారములో నిలిచిపోయిన వ్యవహారాలు ఈ వారము సాధించుతారు. ఖర్చులు ఎక్కువ అయినా గౌరవమర్యాదలు పెరుగుతాయి. శుభకార్యప్రయత్నాలు కలిసి వస్తాయి. దూరమందున్న ఆప్తుల కుశలవార్త తెలిసి కొన్నాళ్ళనుండివున్న ఆరాటం తీరుతుంది. గణిత శాస్త్రజ్ఞులకు, శిల్పులకు మంచి కాలం. 22, 23 తేదిలలో శ్రమతో కూడిన కార్యక్రమము. 24, 25, 26, 27 తేదిలలో ప్రయాణము, అధికారుల సహాయము, మిత్రదర్శనము, లాభము. 28 న అలసట.

*ఉత్తరాభాద్ర [దూ, శం, ఝా, థా] *

ఈ వారము మీకు యోగకాలము. ధనాదాయం, గౌరవము, హోదా పెరుగుతాయి. కోర్టు వ్యవహారములు అనుకూలిస్తవి. పిల్లల శుభసంతోష కార్యములు ఫలిస్తాయి. స్తంభించిపోయిన కొన్ని పనులకు చలనముకలిగి, కలిసివస్తాయి. ఉద్యోగస్తులకు గతవారము కలిగిన అశాంతి తొలగుతుంది. విద్యార్థుల చదువు చురుకుగా సాగుతుంది. ఉపాధ్యాయులకూ, న్యాయవాదులకూ, పండితులకూ, నటీనటులకూ యోగకాలము. 22, 23 తేదిలలో శ్రమ కలిగినా కార్యలాభము. 24, 25, 26, 27 తేదిలలో ప్రయాణము, పండితగోష్ఠి, లాభము. 28 న బడలిక.

* రేవతి [దే, దో, చా, చీ] *

గతవారముకన్నా ఈ వారం బాగుంటుంది. తలపెటిన కార్యములు ఎక్కువ ప్రోత్సాహకరముగా నెరవేరుతాయి. డబ్బుకు ఇబ్బంది కలుగకపోయినా అవసరాలకు తగినంతగా వుండదు. అయినా పనులు ఆగవు. మిత్రులతోనూ, బంధువులతోనూ కలిసి వినోదములలో పాల్గొంటారు. కళలను ప్రోత్సహిస్తారు. విద్యార్థులకు ఉత్సాహముతో చదువు సాగుతుంది. నూలు, బట్టల వ్యాపారస్తులకు లాభము. కవులకు, గాయకులకు, కళాకారులకు, నటీనటులకు యోగకాలము 22, 23 తేదీలలో కార్యాచరణవల త్రిప్పట, శ్రమ, 24, 25, 26, 27 తేదిలలో బంధువులతో మృష్టాన్నభోజనము, ధనలాభము, కార్యసిద్ధి. 28 న బడలిక, అస్వస్థత. ★

వనితాలోకం

పిల్లలూ - పిల్లల తల్లులూ

పన్నెండేళ్ళ అబ్బాయి నాన్నగారి సిరా బుడ్డీ ఒలకబోస్తానని ఏడుస్తున్నాడు తారస్థాయిలో! పదేళ్ళ అమ్మాయి, అమ్మగారి వాచీ పగలగొడ్తానని రాగాలు తీస్తోంది. మందమధ్యంగా! ఆ దృశ్యాన్ని చూస్తూ, ఆ పిల్లల తల్లి వాళ్ళిద్దర్నీ ఓర్పుగా సముదాయించే తీరును (అది ఓ అరగంట నుంచి) చూస్తుంటే నాకు ఒంటినిండా తేళ్ళూ జెఱ్ఱులూ పాకినట్లనిపించింది నిజానికి! ఆ పరిస్థితిలో, ఆ పిల్లల తల్లిని నేనే అయితే వాళ్ళిద్దరూ ఏమైపొయ్యేవారో ననిపించింది. అయినా సొంతతల్లికి లేనిది నాకెందుకు లెమ్మని వూరుకున్నా! అంతకంటే మనం చెయ్యగలిగింది మాత్రం ఏముంది?

ఎక్కడైనా, చక్కటి పద్ధతులూ, వినయ విధేయతలూ వుండే పిల్లల్ని చూస్తే నిజంగా ఆ తల్లి ఎంత తెలివిగలదా అనిపిస్తుంది! మనలో చాలామంది తల్లులున్నారు. కాని పిల్లలను చక్కటి పద్ధతులతో, సరైన మార్గాల్లో నడిపించే తల్లులు మాత్రం వీరిలో బహుకొద్దిమంది మాత్రమే వున్నారనటంలో ఆశ్చర్యం లేదనుకుంటాను. దీనికి కారణాలు అవిద్యా, అజ్ఞానం అంటారు కొందరు. కానీ అవి రెండూ కావు. పెద్దకారణం పిల్లలను ముద్దుచెయ్యటం మాత్రమే!

ఇందుకా!

ఈ ముద్దు చెయ్యటమనేది ముఖ్యంగా పెద్దబిడ్డమీద, ఆఖరిబిడ్డమీద ఎక్కువగా వుంటుందంటారు. కానీ ఎంతమంది పిల్లలున్నా విసుగూ, విరామం లేకుండా, పిల్లలకి పదిహేనేళ్ళు, పదహారేళ్ళు వచ్చేవరకూ (ఓపికుంటే ఆ తర్వాత గూడా) ముద్దులు కురిపిస్తుండేవాళ్ళు లేకపోలేదు. అలాటివాళ్లను చూస్తుంటే స్త్రీని "క్షమయా ధరిత్రీ" అని మెచ్చుకోవటం ఇందుకా! అనిపిస్తుంది. అయినా ఆ క్షమకూ - ఆ చేసే ముద్దుకూ హద్దు లేకుంటే అది ఎన్ని వికార స్వరూపాలుగా రూపొందేదీ పోను పోను అనుభవానికొస్తుంది ... కానీ ఆ తర్వాత చేసేది కానీ, చెయ్యగలిగిందిగానీ ఏమీ వుండకపోవటంతో, చివరకు ఆ తల్లులకు మిగిలేదీ కేవలం అంతులేని ఆరాటం మాత్రమే!

పిల్లలకు ముద్దు మురిపెమూ వుండకూడదని నేననటంలేదు. కానీ దానికీ ఓ పరిమితమైన వయస్సూ, హద్దూ వుండాలి! మూడు నాలుగేళ్ళవరకూ పిల్లలు మరీ అజ్ఞానంలో వుంటారుకదా? అలాటప్పుడు వాళ్ళు చేసే ప్రతీదీ అల్లరిపనే అయినా, కొంతవరకూ వాళ్ళను చూచీచూడనట్లుండొచ్చు. అప్పుడైనా మరీ హఠం వేస్తే కొంతవరకూ

పవని నిర్మల ప్రభావతి

మృదువుగానే మందలిస్తుంటే, ఆ లేత మనసులకు 'ఇలాటి పని చేస్తే తప్పు' అనే భావం కలిగి క్రమేణా మంచి పద్ధతులు (మనం అలవాటు చేస్తే) అలవడటానికి అవకాశం వుంటుంది. కానీ అదే ఈడులో, ఆ తర్వాత ఏడెనిమిదేళ్లవాళ్లయినప్పుడు కూడా బిడ్డ మనస్సు నొచ్చుకుంటుందనే భావంతోనూ, మరీ ఎక్కువ ప్రేమవల్లా, ఏ పని చేసినా, ఎంత అల్లరి చేసినా ఉపేక్ష చేస్తారు కొందరు తల్లులు. అలాటి పిల్లలను చూస్తుంటే వాళ్లివాళ్లకు ఎంత ముద్దుగా వున్నా, చూచేవాళ్లకు తల ఛీత్కారించి పోతుందా గారాలు చూస్తుంటే!

కోప్పడకండి

ఇలా అని అంతా తప్పు తల్లులమీదికి నెట్టేస్తున్నదేమిటా ఈవిడని పాఠకులు చాలామంది కోప్పడొచ్చు... కానీ పిల్లల పెంపకం విషయంలో తండ్రికంటే అవకాశమూ చనువూ, బాధ్యతా కూడా తల్లికే ఎక్కువనే విషయం అందరికీ తెలిసినదే ననుకుంటాను. కొట్టి, తిడితేగానీ మంచి పద్ధతులు పిల్లలకురావా? అంటారు మరో జాతివాళ్లు... కొట్టకుండా తిట్టకుండా కంటి బెదురులో చిన్నప్పట్నుంచీ సక్రమమైన మార్గంలో పిల్లలను పెంచుకొచ్చిన తల్లిదండ్రులు ఎందరు లేరు?

అతి గారాబం చెయ్యటంవల్ల వచ్చే ఫలితాలు పిల్లలే అనుభవిస్తారు పాపం ఎక్కువ భాగం! ఎంచేతంటారేమో - మొదట్నుంచీ పెంచిన గారాబం పెంపకంవల్ల ఆ పద్ధతులు మార్చుకోడానికి వాళ్లవల్ల కాదు, పైగా మరోచోట ఇమడలేరు (అవతలవాళ్లకు వాళ్ళ పద్ధతులు నచ్చవ్ కాబట్టి) అలాటప్పుడు బాధపడేమాత్రం ప్రయోజనం?

పది పన్నెండేళ్ల పిల్లలు మారాం చేస్తూ వుంటే, అంతవరకూ కళ్ళు మూసుకొని వున్నా, అప్పుడయినా కాస్త భయపెట్టి మార్చవచ్చు వాళ్లని ఆ ముద్దులో, పరిణామం చెందే రకరకాల పిల్లల్ని చూస్తుంటే అసహ్యమనిపించినా, పాపం అది వాళ్ళ తప్పు కాదు, ఆ తల్లులదనేది వెంటనే జ్ఞప్తికొస్తుంది నామటుకు నాకు.

పన్నెండేళ్ళ ఒక్కగానొక్క కొడుకు పక్కలో చిన్నపిల్లాడిలా ఒంటేలు పోస్తాడనే సంగతి విని నాకు ఏడవాలో నవ్వాలో అర్థం కాలేదు. అదేమిటని ఆ తల్లి నడిగితే "పసిబిడ్డ నిద్ర చెడగొట్టి, లేపటం నాకిష్టం లేదం"టుందా సాధ్వి! మరి దీనికేమంటారు. ఇక ఆ పిల్లాడా పద్ధతి యెప్పుడు మానాలి? ఇలాటివి చెప్పడానికే, వినడానికీ అసహ్యంగా వున్నా, చెప్పకపోతే మరి అందరికీ తెలిసేదెలా?

ముచ్చటగా మూడు మెట్లు

తల్లులుచేసే అతిముద్దువల్ల పుట్టేదే పిల్లల ముద్దు ముద్దురాగాలు—దాన్లోనుంచి వచ్చేదే గారాబం—ఆ తర్వాత ముదిరితే ఏర్పడేది ఆఖరిమెట్టు వికారం!

(48- వ పేజీ చూడండి)

అమ్మలక్కలు

తెల్లవారిందో లేదో అప్పుడే సీతమ్మగారు, మాపక్క ఇంట్లో వున్న నరసమ్మ పిన్నిగారింటికి కాఫీపొడికోసరం అప్పు కొచ్చింది. అప్పుడే నిద్రమంచంమీదనించి అవలిస్తూవస్తున్న నరసమ్మగారిని చూసి. ఏం వదినా! కూతురు బాగా మేపిందేమిటి, కొంతంత బస్తీవాసన పట్టినట్టుందే, కాస్త రంగు దేలావుకూడా. అని మేలమాడింది.

"రా! లేవచ్చారా! వదినా! అని లోపలికి తీసుకెళ్ళి పీటవేసింది కూర్చోమని.

"అయితే వదినా! నాకు తెలియక అడుగుతాను గాని, కూతురుని దిగబెట్టే వచ్చావుగదా! అల్లుడు మంచివాడేనా! మరి!"

"అల్లా అడుగు వదినా! అల్లుడు ఎంతో మంచివాడు. అంతా అమ్మాయి అదృష్టమనుకో. లేచేసరికి, కాఫీ టిఫీను, తెచ్చి పెడతాడు 11 గంటలకి హోటలునించి క్యారియరు తెచ్చి పెడతాడు. అనకూడదు కాని, అమ్మాయిఅదృష్టమమ్మా! కాలు కింద పెట్టనివ్వడు, అని కూతురు అదృష్టానికి మురిసిపోయింది.

కె. యస్. ఆర్. రాణి

(డోర్నకల్)

"అంతా విని వెంకమ్మగారు అయితే వదినా! మరి కొడుకు కాపరం [illegible]కావుకదా కోడలు మంచిదేనా కొడుకు అదృష్టం చెప్పు." అని అడిగారు.

ఈమాట వినేసరికి నరసమ్మ గారి వదనం తగ్గించిన దీపంలా అయిపోయింది. "ఏం చెప్పనొదినా! కోడళ్ళు ఇట్లాంటివనుకో లేదు. ఏదో సుఖపెట్టుందికదా! అనుకున్నా. ఆకీ ఆకిలాగానే వుండిపోయింది. అది లేచేసరికి పొద్దున్న ఎనిమి గంటలవుతుంది! కొడుకంటావా వాడికి ఎప్పుడు ఆ పెళ్లాంగారి సేవే" అని వాపోయింది.

అంతావిని వెంకమ్మపిన్నిగారు కాఫీపొడి తీసుకుని వెళ్ళిపోయారు.


"ఈ ఇద్దరి సంభాషణా మాగదిలోకి బాగా వినిపిస్తుంది. నాకు ఆశ్చర్యమేసింది. ఈరోజుల్లో కూడా ఇల్లాటి వాళ్లున్నారా అని.

* * *

కూతురు కుండలాగ కోడలు కొయ్యలాగా వుండాలని అంటారు, ఇందుకేనేమో!

అసలు నరసమ్మగారేకాదు, సామాన్యంగా పల్లెటూళ్లోవుండే ప్రతిస్త్రీ ఇదే తరహాలో ఆలోచిస్తుంది. వాళ్ళకూతుళ్లు సుఖపడాలి. కోడళ్లు కష్టపడాలి. వీళ్ళని ఏమనాలో అర్థంకాదు.

కోడళ్ళుకూడా కూతురులాగే సుఖపడి తన మర్యాద కాపాడుకొని భర్త ఇంటి మర్యాదా కాపాడటానికి వస్తుందన్న ఆలోచన రానేరాదేమో! ఆమె కూడా ఒకతల్లికి బిడ్డ అన్న సంగతైనా గుర్తుండదేమో! ఎంత సేపు కోడలి తరఫున ఎంతవస్తే అంతవరకు రాబట్టుకోవాలని చూస్తారు. ఈమధ్య మా చుట్టాలమ్మాయిని ఇట్లాగే అన్నారుట. "ఇచ్చార్లే మీవాళ్ళు ముష్టికట్నం" అని. ఇవ్వగలిగినవాళ్లు ఇస్తున్నారు. లేనివాళ్ళు లేనట్టుగానే వున్నారు. ఎదుటి వాళ్ళ మనస్సు గ్రహించకుండా మాట నోటికి వచ్చిందిగదా అని అంటే ఎదుటివాళ్ళ మనస్సు ఎంత బాధపడుతుంది. మళ్ళీ మాస్తే కూతురుకి ఇచ్చేదేమీ లేదు. ఎవరైనా మాటవరసకి "పింపిన్నిగారు ఏమాత్రమిస్తారు అల్లుడికి దక్షిణ" అని అడిగామో ఇంకేంలేదు. మాకు తెలిసిన కుటుంబం వుంది. వాళ్ళ అబ్బాయికి అమ్మాయికి ఒకేసారే పెళ్ళి జరిపించారు. అబ్బాయి మంచివాడే. బి. ఏ. ప్యాసయి ఏదో వుద్యోగం చేస్తున్నాడు. నాలుగువేలు కట్నం తీసుకున్నారు. కోడలికి చిన్నం బంగారం పెట్టలేదు. కూతురికికూడా మంచివాడే దొరికాడు. అతనూ బి.ఏ. ప్యాసయినవాడే. మూడువేలు కట్నం ఇచ్చి పెళ్ళి చేశారు. అత్తవారు ఏవో వాళ్లికుతోచిన నగలు పెట్టారు. అని చాలలేదని ఇంకా



డోరుకర్టెను డిజైను

చిత్రకారిణి: వి. సీతాకుమారి, వెల్లటూరు.

పెట్టారు వాళ్ళు! మరి కోడలికి ఏమీ పెట్టలేదు. తప్పులెన్నువారు తమ తప్పులెరుగరు అన్న సామెతలు పూరికేపోవు, కూతురు వెళ్ళిపోయింది అత్తవారింటికి. కోడలు తలిదండ్రులు పెళ్ళినాడు కట్నంలో 500 వందలు తరువాత ఇస్తామన్నారట. ఆ ఐదువందలు తెస్తేగాని తీసుకురామన్నారట అత్తవారు. భర్త ఏమీ సాహసించలేదు. ఐదువందలు యివ్వలేక ఆపిల్లతండ్రి; తండ్రి పరిస్థితి చూస్తూ చూస్తూ అడగలేక కూతురు అత్తవారి నూటిపోటిమాటలుపడలేక ఆ అమ్మాయి ఒకరోజున తేలిగ్గా బావిలో దూకేసింది. తర్వాత ఏం అనుకుంటే ఏం లాభం!

ఇట్లాంటివి పల్లెటూళ్ళలో అడపాతడపా జరుగుతాయి. పోట్లాటలకి, కతులకి పుట్టినిల్లు పల్లెటూళ్ళు. బస్తీలలోమాత్రం వుండవా? అనే ప్రశ్నరావచ్చు. ఎందుకు లేవు. ఉన్నాయి. బహుకొద్దిగా కనుపిస్తాయ్. అసలు బస్తీలలో ఒకళ్ళ సంగతి ఇంకొకరికి అక్కరలేదు. కాని అత్త,కోడళ్ళను మంచి చేసుకుంటే సమానంగా వుంటే అత్తగారికి వయస్సువచ్చేసరికి బాగాచేసి అత్తగారి ఆదరాభిమానాలను చూరగొనగలుగుతుంది. అత్తలేనా, కోడళ్ళే లేరా అనవచ్చు. ఈ లోపంకూడా వాళ్ళవాళ్ళ హృదయదౌర్భల్యమే!

* * *

ఈ మధ్య నా స్నేహితురాలు ఉత్తరం రాసింది. చాలా కాలానికి ఉత్తరంరాసింది కదా అని ఎంతో ఆతృతలో చదివాను! వాళ్ళ ఇంట్లో తను, భర్తా, ఇద్దరు పిల్లలు, ఇద్దరు ఆడబిడ్డలు,అత్తగారు,మరిది వున్నారు. ఇంత మంది వున్నా తను ఒక్కర్తె అందరికీ వంట పని దగ్గరనుంచీ అద్దం దువ్వెన్న అందిచ్చే వరకూ చెయ్యాలని, ఇంక భర్తగారికి ఎన్నిచేసినా తృప్తిలేదని, అత్త, ఆడుబిడ్డలుకు, ఎంత చేసినా నూటిపోటి మాటలు తప్పటం లేదని రాసింది. జవాబు ఏం రాయను. ఒకవేళ రాశినా వాళ్ళ ఇంట్లో ఎంతిమంది చదివితే నా స్నేహితురాలి దగ్గర కెళ్తుందో అని భయం మూలాన జవాబుకూడా రాయటం మానుకున్నా! భార్యా, భర్త సంసారంలో సమాన భాగస్తులు. వొకరినొకరు గౌరవించుకుంటే వున్నంతలో సంసారం స్వర్గంగా వుంటుంది. జీవితంలో సమానంగా కష్టసుఖాలనుభవించే భర్తే అంత విసుక్కుని లోకువ చేస్తే, ఎదుటివా ళ్ళవటానికి సందేహమెందుకు, ఏది ఏమైనా అత్త, కోడళ్ళు కలిసివున్న కాపరాలు ఎంతో తక్కువ. ఒకవేళ వున్నా వారిలో ఏదో ఒక లోపంచూపించి తప్పులెన్నుతుంది లోకం-ఒక వ్యక్తి బాగుపడటానికి పాటుపడని సంఘం-అదే వ్యక్తి చెడిపోవటానికి తన శక్తివంచన లేకుండా ప్రయత్నిస్తుంది.

మాకు తెలిసినవాళ్ళున్నారు. వాళ్ళకి ఒక్కడే కొడుకు ఆడపిల్లలు లేరు. కోడలంటే మహా ఆపేక్ష. పాతం ఆవిడకి. ఆపేక్ష అంటే అన్నం కలిపి చిన్న పిల్లలకి పెట్టినట్లు చేతిలో పెట్టేటంత ఆపేక్ష పాపం ఆవిడకి. కన్నతల్లికూడా ఈ రోజులలో చేయలేని పని అత్తగారు చేసిందంటే, ఆ కోడలు అదృష్టం ఏమనాలో, ఎంత పూజ చేసుకుందో ఆఇల్లాలు. ఆమెఅంత అదృష్టం అనుభవించే యోగం లేదోమో. ఎప్పుడు అత్తగారితో పోట్లాడుతూ వుంటుంది. ఏది ఏమైనా, నూటిపోటిమాటలు పడటానికి అభిమానంగలవాళ్ళకి కష్టమే, ధనవంతులయితే మరీను. చూసీ చూడనట్లు పోయేవారైన ఫరవాలేదు. ఇట్లాంటివి లెక్క చేయకుండా మనం మంచిగావుండి, ఎదుటి వాళ్ళని మన మంచితనంతో ఆడవాళ్ళకి వుండే సహజమయిన చిరునవ్వుతో అందరినీ మంచి చేసుకోవచ్చు. నోరు మంచిదైతే వూరు మంచి దౌతుందని మనవాళ్ళు నీతి చెప్తారు. ★



నాదబ్రహ్మ త్యాగరాజు

త్యాగరాజస్వామి

మన దేవతలలో త్రిమూర్తులు బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు. అలాగే సంగీతాభిలాషులకు, విద్వాంసులకు, త్రిమూర్తులు శ్రీ త్యాగరాజు, ముత్తుస్వామి దీక్షితులు, శ్యామశాస్త్రి గారలు. వీరిలో మొదటివాడు శ్రీ త్యాగరాజు. త్యాగరాజు తల్లి సీతాంబ; తండ్రి కాకర్ల రామబ్రహ్మం. వీరు ములకనాటి బ్రాహ్మణులు; భారద్వాజగోత్రులు. వీరి స్వగ్రామము కర్నూలు జిల్లాలో నికాకర్ల. అయితే, వీరు తమ తాత, ముత్తాతల కాలములోనే తంజావూరు వెళ్ళి, ఆ పట్టణ సమీపములో వున్న తిరువారూరు అను గ్రామంలో స్థిరనివాసం ఏర్పాటు చేసుకున్నారు. రామబ్రహ్మంగారు రామ భక్తులు, సంస్కృతపండితులు. ఎల్లప్పుడూ తారక మంత్రాన్ని జపించేవారు. తన ఇంటనే శ్రీరామనవమి ఉత్సవాలను జరుపుతుండేవారు.

అటువంటి సద్భక్తునికి మొదట ఇద్దరు కుమారులు జన్మించారు. వారిరువురికి దైవ భక్తిలేదు; తల్లితండ్రులమీద భక్తిలేదు; చాల దుండగులై తిరిగేవారు. వీరివల్ల రామబ్రహ్మం, సీతాంబలకు మనశ్శాంతి లేకపోయిందంటారు. ఇలా వుండగా, తిరువారూరిలో వెలసిన శ్రీ త్యాగరాజస్వామి, రామబ్రహ్మం, సీతాంబలకు ఒకనాడు కలలో కనిపించి, సీతాంబ మూడవ గర్భమందు వంశపావనుడు, కీర్తికాముడును అయిన ఒక పుత్రరత్నం జన్మిస్తాడని, అతనికి తన పేరె పెట్టవలసిందనీ చెప్పి అంతర్ధానమయ్యాడు.

కొన్ని రోజులకు సీతాంబ మూడవ గర్భమున, (శాలివాహనశకము, 1764) సర్వజిత్తునామ సంవత్సర వైశాఖ శుద్ధషష్ఠి, సోమవారము నాడు త్యాగరాజు జన్మించాడు.

త్యాగయ్య, తండ్రినిపోలిన కుమారుడు. బాల్యంనుంచి తండ్రి గుణాలే అలవడ్డాయి.' ఆ తల్లితండ్రులు కొడుకునుచూచి మురిసిపోయేవారు. రామబ్రహ్మంగారు తమ పెద్ద పుత్రులవలన విసిగి, ఆ వూరిలో వుండక, ఆ వూరికి 6 మైళ్ళ దూరములోనున్న తిరువయ్యారు అను పుణ్యక్షేత్రానికి వెళ్లారు. అక్కడ తమ కుమారున్ని ఒక సంస్కృత పాఠశాలలో చేర్పించారు.

త్యాగయ్య, తమ తల్లిదగ్గర జయదేవ అష్టపదులు, రామదాసు కీర్తనలు దీక్షతో నేర్చుకున్నారు. ఇలా వుండగా ఒక రోజు రామకృష్ణానందులు అనే స్వాములవారు వచ్చి త్యాగయ్యకు శ్రీరామ షడక్షరీ మంత్రం ఉపదేశించి దానిని 96 కోట్లు సార్లు జపించితే, శ్రీరామదర్శన మవుతుందని చెప్పివెళ్ళారు. త్యాగయ్య, తమ తల్లి తండ్రులవద్ద అనుమతి తీసుకొని శ్రీరామ పంచాయతన విగ్రహాలను పూజించడం మొదలుపెట్టాడు. తాను పూజచేసే సమయంలో అతడికి ధారగా పాటలు రావడం ప్రారంభమైనవి. ఆ పాటలను రామబ్రహ్మంగారు జాగ్రత్తగా వ్రాసి కొందరు పండితులకు చూపించారు. ఆ పండితులు—ఆ కీర్తనలు చాల సులభశైలిలో వున్నవనీ, త్యాగయ్యను తంజావూరు మహారాజుగారి ఆస్థాన విద్వాంసులయిన శ్రీ శొంఠి వెంకట

పి. ఆదిలక్ష్మి

రమణయ్య భాగవతర్ గారివద్ద శిష్యునిగా జేర్పించవలసిందనీ చెప్పారు. అదే ప్రకారం రామబ్రహ్మంగారు చేశారు. త్యాగయ్య ఏకసంతగ్రాహియై సంగీతాభ్యాసం చేశారు. అంతేగాక తమ మాతామహుల ఇంటనున్న సంగీత గ్రంథాలను కూడా చదివారు. కాని ఆ గ్రంథాలలోని కొన్ని విషయాలు వారికి సందేహాలుగా వుండినవి. ఆ సందేహాలు ఎలా తీరుతాయా అని అనుకుంటుండగా తమకు శ్రీరామమంత్రం ఉపదేశించిన శ్రీ రామకృష్ణానంద స్వాములవారు వచ్చి "నారదోపాస్తిక మంత్రం" ఉపదేశించి వెళ్ళారు. త్యాగయ్య ఆ మంత్రోపాసన చేయగా ఒకరోజు నారదమహర్షి ఒక స్వాములవారి వేషంలోవచ్చి "స్వరార్ణవము" అనే గ్రంథం ఇచ్చి, దానివల్ల ఆయన సందేహాలు (త్యాగయ్యగారివి) తీరుతవని చెప్పి అంతర్ధాన మయ్యారు. ఆ స్వాములవారు శ్రీ నారదమహర్షి అని తెలుసుకొనిన వెంటనే త్యాగయ విజయశ్రీ రాగములో "వర నారద నారాయణ..." అనే కీర్తనను ఆలాపింప సాగారు.

త్యాగయ్య పెద్ద అన్నగారు తమ యౌవనములోనే మరణించినారు. తరువాత త్యాగయ్యకు 18 వ యేట పార్వతి అను కన్యనిచ్చి వివాహంచేశారు. త్యాగయ్య ఇరవయ్యోఏట తండ్రి మరణించారు. ఆతరువాత ఐదేళ్ళకు త్యాగయ్యకు భార్యావియోగం కూడా సంభవించింది. అప్పుడు భార్య చెల్లెలు కమలాంబను తిరిగి వివాహము చేసుకున్నారు.

రామబ్రహ్మంగారు గతించిన తర్వాత అన్నదమ్ములు ఇద్దరూ వేరుకాపురాలు పెట్టారు. అన్నదమ్ముల భాగాలలో శ్రీరామ పంచాయతన విగ్రహము త్యాగయ్యగారికి వచ్చింది. వారికి దైవభక్తి చాల ఎక్కువయింది. ప్రతిరోజూ ఉదయమే లేచి, కాలకృత్యాలు దీర్చుకొని, స్నానం చేసి, సంధ్యవార్చుకొని పంచనదీశ్వరాలయానికి వెళ్లి శ్రీరామ తారక మంత్రం లక్షా ఇరవై అయిదు వేలు జపించేవారు. అలా దీక్షతో 96 కోటూ ముప్పదిఎనిమిది సంవత్సరాలలో పూర్తిచేశారు. 96కోట్లు పూర్తయిన తర్వాత ఒకనాడు శ్రీరాములు సీతాలక్ష్మణ సమేతంగా విశ్వామిత్రునితో యాగసంరక్షణార్థం వెళ్లుతున్న రూపంతో కనిపించారు. అప్పుడు త్యాగరాజు ఆనందపరవశులై "ఏల నీ దయరాదు పరాకుజేసే వేల..." అనే కీర్తనను అఠాణారాగంలో పాడినారు. శ్రీరామ దర్శనమయినప్పటినుంచి త్యాగరాజుకు భక్తి ఇంకా ఎక్కువయింది. త్యాగయ్య భక్తిని చూచి వారి సోదరుడికి చాలా విసుగుగానుండేది. వారు ఒకరోజున త్యాగరాజు ప్రాణసమానంగా యెంచుతున్న శ్రీ రామ పంచాయతన విగ్రహాన్ని కావేరినదిలో పారవేశారు. విగ్రహాలు కనుపించక దుఃఖిస్తున్న త్యాగయ్యకు రాముడు స్వప్నంలో కనిపించి విగ్రహం కావేరినదిలోనే ఉన్నదని చెప్పి అంతర్ధానమయ్యారు. త్యాగయ్యపరమానంద భరితుడై, ఆవిగ్రహం తెచ్చుకున్నారు. అపుడు ఆనందపరవశుడై బిలహరిరాగములో "కనుగొంటిని శ్రీరాముని నేడు..." అనే కీర్తన అనువుగా చెప్పారు.

త్యాగయ్యను ఆవూరిప్రజలు దేవుని వలె చూసుకునేవారు; దేవుడిమాదిరిగా పూజించేవారు.

త్యాగరాజస్వామి

త్యాగయ్యకు తంజావూరి మహారాజు, కనకాభిషేకము చేయాలనుకొని కబురంపారు. అయితే వారు దానికి ఒప్పుకోలేదు. అప్పుడు కల్యాణిరాగములో "నిధి చాల సుఖమా రాముని సన్నిధి సేవ సుఖమా..." అనే కీర్తన ఆలాపించారు.

త్యాగరాజుకు వృద్ధాప్యం వచ్చింది. ద్వితీయకళత్రంకూడా మరణించింది. భార్యావియోగానంతరం త్యాగరాజు సన్యాసిగా మారారు. సన్యాసిగా వున్నప్పుడు తమకు ఇంకను ముక్తి ఆసన్నం కాలేదని ఖేదపడేవారు. ఇలావుండగా ఒకనాడు స్వప్నంలో రాముడు కనిపించి ఇంక అయిదురోజులలో (అనగా పదిపూటల తర్వాత) నిన్ను నాలోనికి తీసుకుంటానని చెప్పి అంతర్ధానమయ్యాడు.

పదిపూటలుపూర్తికావచ్చాయి. ఒకనాడు తమ శిష్యులతో పుష్య బహుళ పంచమినాడు ఒక విశేషం జరుగుతుందని చెప్పారు. పది పూటలూ పూర్తయినాయి. మామూలు ప్రకారం, త్యాగరాజు తమ శిష్యులతో కూడి భజన చేస్తున్నారు. భజనఆఖరుసారిగా ధన్యాసిరాగంలో "శ్యామసుందరాంగ, సకలశక్తియూ నీవేరా." అనే కీర్తనను పాడారు. పాట పూర్తికాగానే వారి కపాలము విచ్ఛిన్నమయినది. దానిలోనుంచి ఒక జ్యోతి వెలికి వచ్చి శ్రీరామ విగ్రహంలో ప్రవేశించింది. శ్రీ త్యాగరాజస్వామి శ్రీరామునిలో ఐక్యము పొందారు. తరువాత వారు తమ శిష్యులలో ఒకరికి, స్వప్నంలో కనిపించి, తమ జీవము ఏకాదశినాటివరకు పుణ్యక్షేత్రాలు దర్శించి, ఆ తరువాత పూర్ణసిద్ధి పొందుతుందని తమ కీర్తనలను సుమారు 50 ఏళ్లవరకు ప్రచారము చేయవద్దనీ చెప్పారు.

త్యాగరాజస్వామి ఇంగ్లీషు నెలల ప్రకారం 1847 జనవరి 6 వ తేదీన సిద్ధి పొందారు.

సిద్ధిపొందిన 50 ఏళ్ళ తర్వాత ఆయన వర్ధంతి ఉత్సవాలు ఆరంభమయినాయి. అప్పటినుంచి ఇప్పటివరకు ప్రతి సంవత్సరం పుష్య బహుళ పంచమి మొదలు మూడు దివసములు తిరువయ్యారులో ఆయన వర్ధంతి ఉత్సవాలు జరుగుతున్నాయి. అదే విధంగా ఈ సంవత్సరంకూడ పుష్య బహుళ పంచమి నుంచి, అనగా జనవరి 10 తేదినుంచి మూడు రోజులు ఆ ఉత్సవాలు జరిగినవి. గొప్ప, గొప్ప, విద్వాంసులు అక్కడ సమావేశమై సంగీత కచేరీలు జరిపారు. అక్కడ వైభవం చూడవలసిందే కాని, వ్రాయనలవి కాదు.

★

ఆంధ్రనామ వైపరీత్య సంగ్రహము

(26-వ పేజీ తరువాయి)

ర్రావు' అన్నమాట. ఒరిస్సా కొండల్లో ఉన్న ఓ దేవత పేర్రా."

అందరూ అకారణంగా విరగబడినవ్వేరు.

"ఒరే అబ్బాయిలూ" అన్నాడు బాగీరావు. ఈ భూప్రపంచంలో వున్న వరమానవులందర్లోకీ తెలుగువాళ్ళ పేరే తలాతోకా లేకుండా ఉంటాయ్రా, పేర్లమాట అలావుంచి, ఇళ్ళ పేర్లు మరీ ఘోరం గదర్రా. ధనియాలవారు, మిరియాలవారు, జీలకర్రవారు, శొంఠివారు, మిరపకాయలవారు, పచ్చిమిర్చివారు, అల్లంవారు. మామిడల్లంవారు, బెల్లంవారు—"

"కూరగాయలో?" అన్నాడు మందేశం.

"వంకాయలవారు, బెండకాయలవారు, బీరకాయలవారు, చింతకాయలవారు, తోటకూరవారు,—"

చిట్టికూడా ఈధోణిలోపడ్డాడు. వెంటనే అందుకున్నాడు. "చింతావారు, రెండుచింతలవారు, మామిడివారు, వేపావారు, జమ్మివారు, తుమ్మలవారు, కాంద్రేగువారు, మల్లెలవారు, తెల్లాకులవారు, చెరుకువారు—"

గవరమ్మ పకాలున నవ్వింది. "బావుందర్రా మీవరస! అష్టాచెమ్మ ఆటలాగు. మరి, అన్నంవారు, అంబటివారూనో? కసూరివారో? కర్పూరంవారో?"

"హమ్మదొడ్డమ్మా, నీక్కూడా తెలుగింటిపేర్లలో తమాషా బాగా అర్థమైందే!" అంటూ మందేశం కలిపాడు: "చోడివారు, కందులవారు, నువ్వులవారు, జొన్నలవారు, చేబియ్యంవారు,—"

చిట్టి వెంటనే అందుకున్నాడు. "బుర్రావారు, పిలకావారు, చెవులవారు, మీసాలవారు, కాళ్ళవారు,—"

తనేం తక్కువ తినలేదన్నట్టు తక్షణం అందుకున్నాడు బాగీరావు: "నూతులవారు, కోనేటివారు, సముద్రాలవారు, యర్రగుంట్లవారు, కుమ్మరగుంట్లవారు—"

నవ్వుతూ శ్రుతి కలిపింది గవరమ్మ: 'కొడుకులవారు కొడుకుళ్లవారు, తాతావారు, నడిమింటివారు, పెద్దింటివారు, పిన్నింటివారు, మేడావారు, పాకలవారు, తాళ్ళపాకవారు, అదపాకవారు, వైద్యులవారు, కత్తులవారు, సూరకత్తులవారు, టపాకులవారు, మంత్రివాదివారు, మంత్రాలవారు, కోత్తివారు—"

"వారేవా!" అన్నాడు చిట్టి. "ఇవీ రాసుకోండి-ఓపికుంటే: "పొట్టివారు, పొడుగువారు, వల్లవారు, కర్రివారు, ధవళవారు, కపిలవారు—"

"బలే బలే!" అన్నాడు బాగీరావు. "ఇవికూడా లిస్టులో చేర్చండి: "ఆవులవారు, గేదెలవారు, గొర్రెలవారు, మేకావారు, ఏనుగువారు, గుర్రంవారు, బర్రెలవారు— ఇహ చాలించండ్రా ఊపిరందకుండావుంది. మన ఆంధ్రా జీనియస్సంతా ఇంటిపేర్లూ వొంటిపేర్లలోనే వెలిగిపోతూంది! ఇదిలావుంచండి. ఇహ పెళ్లిచూపుల మాట తెమల్చండి వేగంగా."

"నేను రెడీ మామయ్యా" అన్నాడు చిట్టిబాబు.

"ఒరే చిట్టబ్బాయ్, నిన్నో మొన్నో బరొదిలిపెట్టిన కుర్రాడా! ఒరిష్టువాచీ ఉంటే తగల్చరా." అన్నాడు మందేశ్వర్రావు "లేకుంటే ఏ ఆడకూతురు నీవేపు చూస్తుందిరా?"

ముగురు మొగాళ్ళూ లేచేరు. ముగ్గురొక్కమారు బయలేరకూడదంది ముసలమ్మ. చిట్టిబాబు వీధిగుమ్మంలోకివచ్చి జట్కా కేకేసేడు. జట్కా రాగానే అల్లుడూ మామా జట్కా ఎక్కేరు.

"మందేశం, ఒరే, నువ్వుకూడా రావాల్రోయ్" అన్నాడు చిట్టి.

"నేనెందుకురా—సపోర్టు లేకపోతే పడిపోతావ్రటూ?"

"ఆఁ హాఁ— నువ్వొచ్చి తీరాలిసుమా. ఇలాంటివాట్లో నీ బుర్ర మా గొప్పగా పని చేస్తుందిగదూ—బాబ్బాబూ."

"సరెలే. నేను సైకిలుతో మీ వెనకాలే ఒస్తాలే.

* * *

పెళ్లిచూపులైపోయినాయి. అమ్మాయిని వీక్షించారు. ప్రశ్నించారు. పాడించారు. నడిపించారు. కట్నాలూ ఖరానుత్తులూ లాంఛనాలూ స్థిరపర్చేరు. వారూ వీరూ తృప్తిపడ్డారు. ముహూర్తనిర్ణయానికి నెల్లాళ్లు వాయిదా వేశారు. అంతా లేచారు.

"నీ పేరేమిటబ్బాయ్?" చిట్టిబాబుని అడిగాడు, అమ్మాయి తండ్రి.

"నా పేరు పిచ్చేశ్వర్రా అంటారండి. అమ్మాయి పేరు—".

"అమ్మాయిపేరు బయ్యమ్మ"


"హా పిచ్చేశ్వర్రావూ! హా బయ్యమాంబా!" అంటూ గొణిగాడు మందేశ్వర్రావు.

★

వంటలు

అనపకాయ ఇడ్డెనలు

కావలసిన వస్తువులు: సన్నటి తెల్లటి బియ్యము ఒకశేరు, ఒక లేతసారకాయ (అనపకాయ), కొబ్బరికాయ ఒకటి, పచ్చిమిరపకాయలు, వుప్పు, కొత్తిమీర. తయారు చేయువిధానము: బియ్యము బాగుగా కడిగి, ఆరబోయాలి. తరువాత, తిరుగలిలో వేసి, సన్నగా, రవ్వలాగ విసురుకోవాలి. దీనిలో పిండికూడ వుంటుందిగనుక జల్లించి పిండిని రవను వేరువేరుగా విడదీయాలి. కళాయివున్న పాత్రలో పుల్లటి పెరుగుపోసి ఈ రవను నానబెటాలి. మధ్యాహ్నము ఇడ్డెనలు చేస్తామనగా తెల్లవారే పిండి నానబెట్టాలి. సారకాయపై చెక్కుతీసి, కత్తితో తరగి, లోనున్న మెత్తటిభాగాన్ని, విత్తనాలనుతీసివేసి, ఎండుకొబ్బర కోరపీటలో సన్నగా కోరుకోవాలి. పచ్చిమిర్చి, కొత్తిమీర, ముక్కలుగాచేసి, కొబ్బరికాయను పగులగొటి కొబ్బరిని సన్నగా కోరుకొని, తగినంత వుప్పును కొబ్బరికోరును, సారకాయకోరును, పచ్చిమిర్చిని రవ్వలో కలుపాలి. రవ మరీ పలుచగాను, మరీ ముద్దగాను కాకుండా, ఇడ్డెనపిండిలాగనే వుండాలి, దీన్ని మామూలుగా ఇడ్డెన్లుచేసినట్లే ఆవిరిమీద ఉడికించుకోవాలి. ఇవి తినడానికి చాలా రుచిగా వుంటాయి. ఒంటికి చాలామంచిది. బియ్యమెంత బాగుంటే ఈ ఇడ్డెన్లు అంత రుచిగా వుంటాయి. ఇ. సునంద, (మదనపల్లె)



నాగబంధము

వి. రాజరాజేశ్వరమ్మ.

కితకితలు

మేష్టారు: ఏరా! ప్రసాదూ? నీవు రాముడిగాడికి కొబ్బరిచెట్టు పాఠం మొదటిపేరా అప్పచెప్పేవా? వాడు నీకు రెండోపేరా అప్పచెప్పేడా?

ప్రసాదు: లేదండి.

మే: మరి నాకు చెప్పలేదేమిరా? వెధవా?

ప్రసాదు: నాకు మొదటిది రాదండి. వాడికి రెండోది రాదండి. మరి చెల్లె పోయింది కదండి! అందుకని చెప్పలేదండి.

* * *

కొత్తిమీర ఊరుగాయ


అరవీశె కొత్తిమీర, పదిపలాలు చింతపండు, 4 శేర్లు ఎండుమిరపకాయలు, పావుశేరు ఉప్పు, చిన్న ఇంగువముక్క, కొస్త జీలకఱ్ఱ, నాలుగు టేస్పూనులు పసుపు, ఇవి అన్ని కలిపి దంపుకొని శుభ్రమయిన జాడీలో వుంచుకొంటే ఏడాది నిల్వవుంటుంది. మనకు అవుసరమువచ్చినప్పుడు కొస్త తీసుకొని పచ్చిమిరపకాయలు అల్లము నెల్లుల్లి వేసుకొని పచ్చడి రుబ్బుకుంటే చాలా బాగుంటుంది.

* * *

టొమాటో తో

శీతాకాలములో టొమాటో కాయలు జాస్తిగా దొరుకుతాయి. వీటితో ఊరుగాయ వేస్తే వారమురోజులు వుంటుంది. ½ వీశె టొమేటోకాయలు ముక్కలు తరిగి తడిలేని స్టీలుగిన్నెలో వేసి ఒక నిమ్మకాయ తరిగి రసము పిండవలెను. ¼ శేరు ఆవపిండి అర్ధపావు మెత్తని ఉప్పు అర్ధపావు మిరపపొడి 2 స్పూనుల పసుపు కొద్దిగా మెంతులు చిన్న ఇంగువముక్క నూరి ఇవి అన్ని ఆ ముక్కలలో వేసి కొస్త నూనెవేసి కలిపి వుంచవలెను. రెండు రోజులలో ఊరి చాలా బాగుంటుంది. ఉప్పుకారము ఎవరి రుచినిబట్టి వారు వేసుకోవచ్చును.

న్యాయపతి అమ్మాజీ, శ్రీకాకుళం.



నల్లనివాళ్ళంటే...

"అదికాదే అక్కయ్యా! కట్నం కాస్త తక్కువైనా సరే తెల్లటి పిల్లని చూసిచేద్దామనుకుంటున్నానే." అని మా అమ్మమ్మ ఎంతమందితోనో అనటం నేను విన్నాను "అమ్మా! వాళ్ళ శారదని చేసుకోరాదటే" అని మా అమ్మ వాళ్ళుఅంటే," బాగుందే అంత నలుపు అయితే ఎలాగే అందులో అది పొట్టి, వాడు పొడుగు. పోనీ ఆమాట అటుంచు. అంతబొత్తిగా నల్లగా వుంటే ఎలాగే కోడలు. నలుపైతే కులమల్లా నలుపంటారు." అని మా అమ్మమ్మ అంటుంది. మా అమ్మమ్మకి ఈ కోరిక కలగడము న్యాయమేనండి. ఎందుచేతంటారా కూతుళ్ళు నలుపుకాదు, కొడుకులు నలుపుకాదు. కోడలు కూడా నలుపులేదు. మనవలు మునిమనవలు కూడా ఎవ్వరూ నలుపులేదు. అందుచేత ఈ కోడలిని కూడా తెల్లటిదాన్నే తెచ్చుకొందామని మా అమ్మమ్మ అభిలాష. పోనిండి. నల్లగావుంది. కాబట్టి ఎంచుతారు. తెల్లటివాళ్ళలో కూడా వంకలు ఎంచుతారు. మా అమ్మమ్మలాటివాళ్ళు నుదురు పెద్దదిగా లేదనో లేక కళ్ళు చిన్నవనో లేక ముక్కు పెద్దదనో, అంటారు. ఇటు పొట్టిగా వుండకూడదు. అటు చాల పొడవుగా వుండకూడదు. నల్లగా వుండకూడదు. ఇలాటివన్నీ కూడా ఎంచుతే ఇక మనదేశంలో ఆడపిల్లలకు పెళ్లిళ్లు అవవు. మళ్ళీ మగపిల్లడు నల్లగా వున్నా ఫరవాలేదు. ఏమేనా అంటే... ఆ...మగవాడికి అంద మేమిటే. నల్లగా వుంటేనేం అనిఅతి తేలిగ్గా ఒక్కముక్కలో చెప్పేస్తారు. ఎటొచ్చి అంతా ఈ ఆడపిల్లలకే నలుపు తెలుపు. అంటే మా నాన్నగారు నవ్వేరు. నలుపు తెలుపు కొరుక్కుతింటా రేమిటి నలుపు అయితేనేం మొహం కళగా వుంటే చాలదా అని అంటారు. నల్లని వాళ్లికే అదృష్టం పడుతుం దంటుంది. మా అమ్మ పాపం నల్లనివాళ్ళని మాత్రం చాల మంది ఎగతాళి చేస్తువుంటారు. కారు నలుపు అని తారుకుమ్మం అని రకరకాల పేర్లు పెడుతూ వుంటారు. "అది కాదోయ్ ఈ తారుని ముట్టుకుంటే చేతికి ఎలా అంటుకుంటుందో ఈనలుపు కూడా ఆ వర్గానికి చెందినదే" అని అనటం నేను విన్నాను. ఇంతకీ సి. ఉత్తరగారు వాళ్లివాళ్లి గురించి రాసినది. చదివినతర్వాత ముందు కాస్త నవ్వువచ్చింది. ఆఖరుకి చదువుతున్నప్పుడు మాత్రం చాల జాలివేసింది...

బి. సుగుణమణి (రెంగాలి-ఒరిస్సా.)

* * *

ఏంచేస్తాం!

ఎ. కనకంగారు, "దేవుఁడు వరమిచ్చినా" అనే వ్యాసంలో వరకట్న నిషేధం గురించి, కన్యల తీవ్రకృషి గురించి చాలబాగా రాసేసేరు. వారికి నా అభివందనములు. ఇది సఫలీకృత మవాలని నా కోరిక. కాని ఎంతవరకూ సఫలీకృత మవుతుందా అని అనుమానం. అసలు కట్నం ఇచ్చిన పెండ్లికూతురి తండ్రిగారే తెలియనివ్వరేమో అని అనుమానం! వందలకొలదీ న్యాయస్థానములు వెలిశాయి. ప్రజల శాంతిభద్రతలు కాపాడే పోలీసుశాఖ లున్నాయి. కాని ఏమిలాభం? ప్రభుత్వం శిక్షిస్తారని దొంగతనాలు మానుతున్నారా? న్యాయస్థానములు న్యాయం చేకూరుస్తాయని తెలిసుండీకూడ, ఒకరి నొకరు అన్యాయం చేసుకోకుండా వున్నారా? (పలెటూళ్ళలో మరీఘోరం!) ఉరిశిక్ష పడుతుందని తెలిసికూడ హత్యలు జరగకుండా వున్నాయా? కనకంగారు అన్నట్లు, చట్టాన్ని పెట్టి శాసించగలరు కాని, చేతులుపట్టి చేయించగలరా? తెల్లకాగితాన్ని శాసనపత్రంగా మార్చినట్లుగ, మానవుల హృదయాన్ని మార్చగలరా?

ధనవంతులదగ్గర కట్నంతీసుకొన్నా తప్పులేదు. ఎవరికితగ్గసంబంధాలు వారు చూసుకోవాలి. పెండ్లి చేయటానికి 'కానీ' లేకపోయినా, 'మాఅమ్మాయి కలక్టరుగారి భార్య అవాలంటుంది అమ్మాయితల్లి. (అది సహజమే అనుకోండి.) అటువంటప్పుడు కట్నం ఇవ్వవలసివస్తుంది. పెండ్లికుమారుడి తల్లి తండ్రులు వేలకువేలు పోసి చదువుచెప్పించినప్పుడు కట్నంతీసుకోరా మరి? లేకపోతే వాళ్ళుమనసొప్పరు. అబ్బాయిగారు ఉన్నత స్థానంలోఉంటే సుఖపడేది మన అమ్మాయేగా! ఏమంటారు?

ఎవరికితగిన సంబంధం వారుచూసుకుంటే, ఈకష్టాలు వుండనేవుండవు. గుమస్తాలకిస్తే, కష్టపడిపోతుంది పిల్ల, అనుకొంటారు. ఆఫీసర్లని, కట్నం ఇవ్వలేరు మన తల్లి తండ్రులు. ఏంచేస్తాంమరి!

గోడా సుభద్రాదేవి. (అనంతపురం)

* * *

కొలువులు

శ్రీమతి జి. యస్. వాణిగారు రాసిన "బొమ్మలకొలువులు"అన్న వ్యాసంబాగుంది. ఇక్కడ దసరాపండగలకు బొమ్మలకొలువులు పెడ్తారు. మాఇంట్లో కూడా పెట్టాము. వున్న బొమ్మలన్ని 3, 4 స్టెప్స్‌లో పెట్టాము. క్రిందఇసుకపోసి నీళ్ళుచల్లి రాగులగింజలు చల్లితే మూడురోజులకు మొక్కలువస్తాయి. దానిలో చిన్నచిన్న బొమ్మలుపెట్టాము. చూడడానికి బాగుంటుంది. ఇంకా అట్టలతో సినిమాథియేటర్స్, ఇళ్లు అన్నీ చేసిపెట్టాము. బొమ్మలకొలువులు చూడడానికి బాగుంటాయి. వాణిగారు చెప్పినట్లుగా కొన్ని బొమ్మలు ఎన్నిపెట్టినా మనం చేతితోచేసి పెడితేనే మనకు తృప్తిగావుంటుంది. చూసేవాళ్ళకు బాగుంటుంది.


వాచస్పతి వరసు. (తుంగభద్రడాము)

* * *

నేరాలు గారాలు

దద్దనాల రంగనాయకమ్మగారు వ్రాసిన "నేరాలునేర్పే గారాలు" అన్న వ్యాసం బాగుంది. గారాబం మితిమీరితే యేమౌతుందో వుదాహరణతోటి చక్కగా వివరించారు. పిల్లలపై మక్కువకొద్దీ పిల్లలుతప్పు చేసినా అదితప్పుగా ఎంచుకు దండించక వారిని పాడుచేయటం చాలాచోట్ల చూస్తూనే వున్నాము. దుర్మార్గుల్నిగానీ, సన్మార్గుల్నిగానీ తయారుచేయునది తల్లే అని నొక్కి చెప్పారు. ఐతే అతిభయం కూడా చెడుకే దారితీస్తుంది. తల్లులు ఆవిషయాలో కూడా జాగ్రత్త వహించాలి.

ఎం. అనసూయ. (మాదరపాకం)



★ బాల వియ్యము ★

పక్కింటి అమ్మాయి పెండ్లి జరిగింది
హానుదేవి,జయదేవి పెండ్లికెళ్లారు
పెండ్లిసంబరమంత చూచివచ్చారు
పెండ్లిభోజనములు చేసివచ్చారు
ఆడుబిడ్డల బెట్టు అల్లుడి అలుక
అత్తసాధింపుల నన్నిటిఁగూడ
చక్కంగ పరికించి సాగివచ్చారు.

* * *

బడికి సెలవురాగ ఆమరునాడె
తాము పెండిలిచేయ తలపెట్టినారు
తాటియాకులుతెచ్చి తడిపేసి తుడిచి
ఈడైన బొమ్మల జోడును జేసి
క్రొత్తగుడ్డలుతెచ్చి కోకలుగట్టి
మెఱుగుపూసలుగ్రుచ్చిమెడలోన వేసి
కల్యాణ తిలకంబు కాటుకల్ బెట్టి
బొమ్మరింటను బెట్ట్రి బొమ్మలరెంటి.
హానుదేవి అయినది అబ్బాయి తల్లి
జయదేవియైనది అమ్మాయితల్లి

* * *

ఇరుగుపొరుగు నున్న యిండ్లకునేగి
పిల్లపేరంటాండ్ర పిలుచుకవచ్చి
పెండ్లి చేసేరమ్మ పిల్ల లిద్దరును
ఆకు తూతూ బూర బూబూ!
రేకుడబ్బి డోల్ ఢం ఢం
మేళ తాళంబులు మ్రోగుతూ నుండ
తాళిని గట్టించి తలబ్రాలు పోసి
హారతెత్తిరమ్మ అమ్మాయి లంత
పెండ్లియైనాదమ్మ పెండ్లియైనాది
హానుదేవి జయదేవి వియ్యమందారు

* * *

అటుకులు బెల్లంబు హానుదేవి తెచ్చె
శనగబొగ్గులు తెచ్చె జయదేవిచాలా

కనుపర్తి వరలక్ష్మమ్మ

"ఇవిమె కాఫీలండి యివిమెఉప్మాలు
ఇదిమె అన్నంబండి యివిమె కూరల్లు
అప్పడాల్ వడియాలుఅన్నియునివిమె
పులిహోరపాయసంపూర్ణాలునివిమె.
అందఱు రారండి ఆరగించండి"
అనుచును జయదేవి అందఱిని పిల్వ
"అందఱితో పాటా! ఔర మాకూను
పెండ్లికొడుకూ వారికి పెద్దపీటేసి
మర్యాదచేయడం మర్యాదగాద"
అనిపల్కి హానుదేవి అలిగికూర్చుండ
పెండ్లికొడుకూతల్లి, పెద్దపేరక్క!
"ఆకు పీటా వేసి వడ్డించినాము
లేచిరా మాయమ్మ! లేచిరావమ్మ!
ఉలకక పలకక అలిగి కూర్చుంటె
అటుకులుబొరుగులు అయిపోతవమ్మ"
అని పిల్చుచుండంగ హానుదేవి అక్క
అట్టె తావిచ్చేసి హానుదేవిగాంచి
"ఎందుకే హానుదేవి యెందుకే అలక
పెళ్ళాట లాడుచు పేచీలు పడితె
నగుబాటుకాదుటే నలుగురిలోన"
అని మందలించంగ హానుదేవిపల్కె
"ఆనాటి పెండ్లిలో ఆపెళ్లివారు
అలిగికూర్చోలేదె అన్నాలు తినక
అట్లాగె నేనిప్పు డలిగానె అక్క!
పెద్దపెద్దావాళ్లె పెళ్లిళ్లలోన
బిడియాలు లేకుండ పేచి పెట్టంటె
చిన్నవాళ్లంమాకు సిగ్గెందుకక్క!
పిన్నవాళ్ళం మాకు పేచేమిటక్క!"
అనుచు చివ్వున లేచి హానుదేవియంత
తోడివారితో నాడ తుఱ్ఱునబోయె.

★

శని-శివుడు

మందరపు పద్మ, లలిత

నవగ్రహాలలో శనిగ్రహం మహా చెడ్డది. శని పట్టుకున్నాడంటే ఒక పట్టాన వదలడు! ఏ గ్రహాన్నైనా శాంతిచేసి వొదిలించుకో వచ్చుగాని శని గ్రహాన్ని మట్టుకు వొదలగొట్టుకోలేము. అందులో ఏలినాటి శని అయితే మరీను! ఖచ్చితంగా ఏడేళ్ళన్నరా అనుభవించవలసిందే. హరిహరాదులక్కూడ శనిని తప్పించుకోవడం సాధ్యంకాదు!

ఒక నాటి సాయంకాలం వెండి కొండమీద పార్వతి పరమేశ్వరులిద్దరూ సూర్యాస్తమయాన్ని చూస్తున్నారు. ఇంతలో శనిగాడు అట్టుప్రక్కనుండి వెళ్తూ పార్వతికంట బడ్డారు. అతన్ని చూడగానే పార్వతి ఒళ్ళు ఝల్లుమంది. పార్వతి వులిక్కిపడడం చూసి పరమేశ్వరుడు "ఏమిటి దేవీ! ఆలాభయపడుతున్నావు!" అని అడిగాడు. పార్వతీదేవికి నోటమాట రాక శనివైపు చల్లగా చూపుడు వ్రేలెట్టి చూపించింది!

పరమేశ్వరుడు పక పక నవ్వి "ఓ కొండ రాజ కూతురా! నీకింత గుండె నిబ్బరం లేదేమిటి? ఈ వెధవ శనిగాడు నన్నేమి చెయ్యగలడు? చచ్చు మనుష్యుల నైతే సాధించగలడుగాని!" అన్నాడు పరిహాసంగా.

శని శిరః కంపనము చేసి చల్లగా శివుడి ఎదుటికి వచ్చాడు. మహాప్రభువులు! నా మనవి చిత్తగించాలి! నేటినుండి తమరిని వారం రోజులు పట్టి పీడించబోతున్నాను. ఇప్పుడు మీరాడిన రీతిగా, శక్తివుంటే నన్ను తప్పించుకోవచ్చు," అని చల్లగా చెప్పాడు శని. పరమేశ్వరుడు "హారినీ! నన్నే పడతావా! సరే! చూస్తా కానియ్" అంటూ శనివైపు చురచుర చూశాడు.

పార్వతి ఉలుకు, పలుకూ లేకుండా దిగాలుపడి కూర్చున్నది. పరమేశ్వరుడు పార్వతివైపు చూసి "చూడు! నువ్వేమీ బెంగపడకు! ఈ వెధవ నన్ను వారం రోజుల వరకూ పడతానన్నాడుగదా! నువ్వీ జటాజూటము, చంద్రిక, పాములు, పినాకము ఈ నా ఆభరణాలన్నీ జాగ్రత్తగా దాయి. నేనీవారం రోజులు యీ గోచీగుడ్డ పెట్టుకుని, ఏ చెట్టుతొఱ్ఱలోనైనా దాక్కుంటాను," అన్నాడు. పార్వతి "సరే" నంది. శివుడు చెప్పినట్టుగానే గోచీ పెట్టుకొన్ని వారం రోజులు ఒక చెట్టు తొఱ్ఱలో కూర్చున్నాడు.

వారం రోజులు భారంగా వెళ్ళిపోయాయి. పార్వతి పరమేశ్వరుడి కోసం ఎదురు చూస్తూ కూర్చుంది. ఇంతలో శివుడు గబగబా పరుగెత్తుకుంటూవచ్చాడు. అంతలోనే శని కూడా అక్కడకు వచ్చాడు. శివుడు శనిని "ఏం చేయగలిగావు?" అన్నట్టు గర్వంగా చూశాడు. శని చిఱునవ్వు నవ్వుతూ "మహాప్రభూ! ప్రమథగణాలు సేవిస్తుండగా, పార్వతీదేవితో కైలాసం మీద కులాసాగా కాలం గడపవలసిన మీరు, సమస్త భూషణాలు విడిచిపెట్టి, గోచీ పెట్టుకుని చెట్టుతొఱ్ఱలో కూర్చోవడమేమిటి? ఇదినామహిమ కాదూ!" అన్నాడు. శివుడు సిగ్గుపడి తలవంచుకున్నాడు. ★

మౌనమే అంగీకారం

ఒక అమావాస్య అర్ధరాత్రి ఒక దొంగ ఒక బ్రాహ్మడి ఇంటికి కన్నం వేశాడు. ఆ బ్రాహ్మడు కొత్తగా ఇల్లు కట్టుకున్నాడు. అందుచేత ఆ ఇంటి మట్టి గోడలు ఇంకా తడి ఆరలేదు.

ఆ దొంగ తను కష్టపడి తయారు చేసిన కన్నంగుండా తలదూర్చాడు. ఇంట్లో ఏమైనా అలికిడి ఉన్నదేమో చూద్దా మనుకుంటున్నాడు. ఇంతలో తడియారని ఆ మట్టిగోడ కాస్తా కుప్ప కూలింది. పాపమా దొంగ కుక్కిన పేనులాగ మట్టి గోడక్రింద అణగారిపోయి చచ్చి ఊరుకున్నాడు.

దొంగా మనిషేగా? దొంగకి కూడా ఒక భార్య ఉంది; పిల్లలూ ఉన్నారు. మరి దొంగ చస్తే వాళ్లందర్నీ ఎవరు పోషిస్తారు?

అందుకని దొంగ భార్య వెళ్లి ఆ దేశపు రాజుతో ఇలా ఫిర్యాదు చేసింది: "అయ్యా నాభర్త ఫలానా బ్రాహ్మడి యింటికి కన్నం వేశాడు. ఆ యింటి మట్టిగోడయేమో ఇంకా తడితడిగా ఉండటం మూలాన, కూలి నా భర్తని చంపివేసింది. ఇప్పుడు మా యింటిల్లిపాదికీ ఎవరు కూడు పెడ్తారు? అసలు దీని కంతా ఆ బ్రాహ్మడే బాధ్యుడు. కనుక ఆ బ్రాహ్మణునిచేత మాకు కొంత సొమ్మును నష్టపరిహారం క్రింద ఇప్పించి, మాకు న్యాయం కలుగ జేయండి."

రాజుగారు వెంటనే ఆ బ్రాహ్మణ్ణి పిలిపించారు. దొంగ భార్య చేసిన ఫిర్యాదు సంగతి చెప్పి, ఏం జవాబు చెప్తావో చెప్పమన్నారు.

అందుకు ఏమనాలో తెలియలేదు బ్రాహ్మడికి. నిజానికి అతడు నష్టపరిహారం చెల్లించేటంత స్తోమత కలవాడు కాదు. అతడు క్షణం ఆలోచించి ఇలా అన్నాడు:

"అయ్యా తమకు తెలియని దేముంది? ఇందులో నా తప్పేమీ లేదు. వాస్తవానికి గోడ కట్టింది నేను కాదుగదా? అసలు బాధ్యతంతా తాపీవాడిది. కాబట్టి వాణ్ణి పిలిపించి అడగండి."

చావలి సాంబశివరావు

రాజుగారికి ఇదీ సబబుగానే తోచింది. అందుకని వెంటనే తాపీవాడిని పిలిపించారు. "ఏమయ్యా, గోడని అంత తడితడిగా అంత బలహీనంగా ఎందుకు కట్టావ్?" అని అడిగారు.

అందుకు తాపీవాడు క్షణంసేపు బిత్తరపోయినా, మళ్లీ తేరుకుని, "అయ్యా నామనవి చిత్తగించండి. అసలు తప్పంతా ఆ నీళ్లు పోసిన కుర్రాడిది. వాడేమో నీళ్లు ఎక్కువ పోశాడు. అంచేత గోడ త్వరగా తడి ఆరింది కాదు. ఇది నిజమో అబద్ధమో కావాలంటే వాణ్ణే అడగండి," అన్నాడు.

అప్పుడు రాజుగారి సేవకులు పోయి, వెదికి వెదికి ఆ నీళ్లుపోసిన కుర్రాణ్ణి పట్టుకొచ్చి, రాజుగారి ఎదుట నిలబెట్టారు.

ఆ కుర్రాడు తొణక్కుండా ఇలా తెలివిగా జవాబు చెప్పాడు: "బాబూ! నన్నేం చేయమంటారు? నాకు నీళ్లుతేవటానికి ఇచ్చిన కుండ చాలాపెద్దది. నేనేమో చిన్నవాణ్ణి, అంతపెద్దకుండ మోయటం చాలా కష్టం కదా! అయినా పనిలోకి వచ్చాక తప్పుతుందా? అంత పెద్ద కుండ వొంచి నీళ్లు పొయ్యబోతే, కాసన్ని నీళ్లు ఎక్కువ పడ్డయ్. అది నాతప్పా? అసలు ఇంతకీ ఆకుండ చేసినవాడిదే తప్పు, అతణ్ణే కనుక్కోండి."

తక్షణమే రాజుగారు ఆకుండ చేసిన కుమ్మరివాణ్ణి పిలిపించారు. పిలిపించి, "ఏమయ్యా ఆకుండని అంత పెద్దదిగా ఎందుకు తయారు చేశావ్? దాని మూలంగా ఇప్పుడు ఎంత నష్టం జరిగిందో చూడు— ఆదొంగ చనిపోవటానికి నువ్వే కారణం!" అన్నారు.

కుమ్మరి వాడు తానుకూడా నిర్దోషినే నన్నాడు. కొంచెం సిగ్గుపడుతూ ఇలా చెప్పాడు: "అయ్యా ఈ విషయం తమతో చెప్పటానికి చాలా సిగ్గుపడుతున్నాను. కాని చెప్పకతప్పదు. క్షమించండి. సరిగ్గా నేను కుండ తయారుచేస్తున్న సమయానికి ఒక వేశ్య అలా రోడ్డువెంట వెళ్తూండటం వస్తూండటం జరిగింది.

★ మౌనమే అంగీకారం ★

నా పాపిష్టి కళ్లు ఊరుకోక ఆమెవైపే చూస్తూ పరాకుగా ఉండికుండ తయారుచేశాను. అందుచేత కుండ కరిమానం పెద్దదయింది. కాబట్టి ఈ తభావతు కంతకీ ఆ వేశ్యయే కారణం."

"ఆ సానిదాన్ని లాక్కురండి." అన్నారు రాజుగారు. సేవకులు వెళ్లారు, క్షణంలో ఆవేశ్యను తెచ్చి రాజుగారిముందు నిలబెట్టారు.

అప్పుడా వేశ్య రాజుగారి పాదాలకి మ్రొక్కి వినయంగా ఇలాఅంది: "అయ్యా ఈ దీనురాల్ని కనికరించండి. ఇంతకీ నావల్ల ఏ అపరాధమూ జరుగలేదు. నేను చాకలి దానికి చీర వేశాను. అది సమయానికి తేలేదు. పండుగపూట నాకు బట్టలు లేవు. అందుకని దానిఇంటి చుట్టూరా అనేకసార్లు తిరిగాను. కాని ఏం లాభం! అది చీర ఇవ్వలేదు. ఆ చాకలిదాని మూలంగానే ఇంత గొడవా జరిగింది. కనుక దాన్ని కనుక్కోండి."

రాజుగారికి ఒళ్లుమండింది. ఎవర్ని అడిగినా 'నేను కాదు—నేను కాదు' అంటారు. ఇంతకీ తప్పెవరిది?

వేశ్య చెప్పింది కూడా సమంజసం గానే కనిపిస్తోంది. అందుకని ఆ చాకలిదాన్ని పిలిపించి అడిగారు.

అది చెప్పిందికదా; "అయ్యా నన్నేం చేయమంటారు చెప్పండి? చీర ఉతకాలని నేనెన్నిసార్లు రేవుకి వెళ్లినా, అక్కడ ఎవరో సన్యాసి ముక్కుపట్టుకుని జపం చేస్తూ కూర్చున్నాడు. సరిగ్గా నేను బట్టలు ఉతికే రాతి మీదే ఆయన మకాం వేశాడు. ఇంకెల్లా నేను బట్టలు ఉతికేది? అందుకని తిరిగి వచ్చేశాను. ఇది నాతప్పా? ధర్మ ప్రభువులు తమరే న్యాయం ఆలోచించండి."

ఆలోచిస్తే చాకలిది అమాయకురాలే! దాని తప్పేమీ లేదు. రాజుగారు ఆసన్యాసికోసం కబురంపారు. అతడువచ్చాడు.

రాజుగారు అతనికి సంగతంతా తెలియచెప్పి, "ఇదంతా నీతప్పు కాదా?" అని అడిగారు.

పాపమా సన్యాసి ఇంకా మౌన వ్రతంలోనే ఉన్నాడు. అందుచేత ఎన్నిసార్లు ప్రశ్నించినా ఉలుకలేదు; పలుకలేదు.

"మౌనమే అంగీకారం. అతని నేరం రుజువయింది. అతన్ని తీసుకుపోండి, తీసుకుపోయి, అతనితల నరకండి," అన్నాడు రాజు కోపంగా. సేవకులు రాజాజ్ఞ శిరసావహించారు.

సన్యాసి చస్తే ఏడ్చే దిక్కెవ్వరూ లేకపోవటం మూలాన మళ్లీ ఫిర్యాదనేది లేకుండాపోయింది. ★

★ కష్టార్జితం ★

చాలారోజుల క్రిందట 'కూనవరం' అనే గ్రామంలో కేశవయ్య అనే కాపు ఒకడు ఉంటూ ఉండేవాడు. కేశవయ్య కష్టజీవి. చిన్నతనంలోనే తల్లీ తండ్రీ చచ్చిపోడం మూలాన్న, సుఖం అంటే ఎలాంటిదో తెలీని మనిషి.

కేశవయ్యకి ముగ్గురు కొడుకులున్నారు. వాళ్లలో పెద్దవాళ్లిద్దరూ ప్రయోజకులయినారు. మూడోవాడు రంగడు మాత్రం ఉత్త సోమరి అయేడు. వాడికి యేపనీ చేతగాదు. మన్నుతిన్న పాములాగ, కూర్చున్న చోటునుంచి కదిలేవాడుకాదు.

కేశవయ్య, ఇద్దరు కొడుకులూ ఆర్జించడంవల్ల ఆ ఇంట్లో కూటికీ, గుడ్డకీ కొరతేమీ ఉండేది కాదు. అదొక కారణం.

"పోనీ, ఏదో కుర్రాడు, నాలుగు రోజులు సుఖపడనీ! తర్వాత ఎలాగూ కష్టపడాలికదా!" అని, కేశవయ్య అశ్రద్ధగా ఊరుకోడం రెండో కారణం. ఈ రెండు కారణాలవల్ల రంగడు ఎందుకూ పనికిరాకుండా తయారయేడు.

కేశవయ్య, రంగడిబుద్ధి ఏమన్నా మారుతుందేమోనని చాలారోజులు చూచాడు. కానీ, వాడిలో మాత్రం యేం మార్పు కలగలేదు.

కేశవయ్య ఇక ఇలా లాభం లేదని నిశ్చయించుకున్నాడు.

ఓనాడు, రంగడిని కేకేసి—

"ఒరే రంగడూ! ఇవాళ చాలా అవసరం కానీ, ఓ పావల డబ్బులు సాయంకాలం అయేసరికి తీసుకురా!" అని చెప్పాడు కేశవయ్య. "సరే" అన్నాడు రంగడు.

"సరే" అన్నాడే కానీ, ఎక్కడికి వెళ్తాడూ, ఎవరిని అడుగుతాడు. అడిగినా ఎవరిస్తారూ? పోనీ, కష్టపడదామా అంటే, వాడికి కదిలే ఓపికే లేదు.

మధ్యాహ్నం వరకూ ఆలోచనలతోనే గడిపేశాడు రంగడు.

పి. సుబ్బారావు శాస్త్రి

మధ్యాహ్నం భోజనం అయినదగ్గర్నుంచీ, నిద్ర ముంచుకువస్తుంది.

తల్లిదగ్గరికి వెళ్లి ఆవిణ్ని నానా అల్లరీ పెట్టి, కాళ్ళా వేళ్ళా పడి, అన్నం తినను అని అలిగి, మొత్తంమీద పావలా డబ్బులూ సంపాదించేడు.

ఆ పావలా కాసుని బొడ్డులో దోపుకుని, కడుపునిండా తిని, వెల్లకిలా పడి నిద్రపోయాడు.

సాయంకాలానికి పనిలోనుంచి ఇంటికి వచ్చాడు కేశవయ్య. వస్తూనే రంగణ్ని కేకేశాడు.

రంగడు కళ్ళు నులుముకుంటూ వచ్చి, తండ్రిచేతికి పావలా కాసుని యిచ్చాడు.

కేశవయ్య పావలా కాసుని అటూ, ఇటూ తిప్పి చూశాడు. రంగడి ముఖాన్ని తీక్షణంగా చూసి, ఎదురుగా వున్న 'మురికిగుంట' లోకి పావలా కాసుని గిరాటువేశాడు.

రంగడు అంతా చూస్తూనే వున్నాడు. కానీ "ఏమిటి?" అని అడగనయినా అడగకుండా, ఆవలిస్తూ లోపలికి వెళ్లిపోయాడు.

కేశవయ్య భార్యముఖంలోకి కోపంగా చూశాడు. భార్య మారు మాటాడలేదు, చేసినతప్పుకి తల దించుకుంది.

ఆ మర్నాటి ఉదయం, కేశవయ్య మళ్ళీ రంగణ్ని కేకవేశాడు. రంగడు మెల్లగా వచ్చి "ఏమిటి?" అని అడిగేడు,

"ఇవాళకూడా ఓ పావలా కావాలి. ఎక్కడికయినా వెళ్ళి, కష్టపడి తీసుకురా!" అని చెప్పాడు. "సరే" అన్నాడు రంగడు.

తండ్రి పనిలోకి వెళ్ళిపోయిన తర్వాత, మళ్లా ఆలోచనలో పడ్డాడు రంగడు. అసలు అది ఉత్త మట్టిబుర్ర. ఏం తోచలేదు.

తల్లిని వెళ్ళి అడిగేడు. ఆవిడ లేదు అన్నది. ఎన్ని నాటకాలు ఆడినా ఆవిడ పావలా కాదుకదా, దమ్మిడీ కూడా యివ్వలేదు.

రంగడు యిది పనికాదని, తల్లి యింట్లో లేకుండా చూసి ఓ పావలాను దొంగిలించాడు—

సాయంకాలం తండ్రిరాగానే,

★ కష్టార్జితం ★

దానిని తీసుకువెళ్ళి యిచ్చాడు. కేశవయ్య మళ్ళీ దానిని "మురికిగుంట" లోకి గిరాటువేశాడు. రంగడు చూస్తూ వూరుకున్నాడు.

"ఇది నీ కష్టార్జితమేనా?" అని, కేశవయ్య కొడుకుని అడిగేడు.

"కాను" అన్నాడు రంగడు. కేశవయ్యకి చాలా కోపంవచ్చింది. సోమరితనమే కాకుండా, అబద్ధం ఆడడం, దొంగతనం చేయడం కూడా నేర్చుకునేసరికి కేశవయ్యకి వళ్ళు మండిపోయింది.

"ఇదిగో, వీడు రేపు కష్టపడి పావలా తీసుకొచ్చేవరకూ గింజ నీళ్లు కూడా పొయ్యకు!" అని చెప్పాడు కేశవయ్య, భార్యకి. "సరే" నంది ఆవిడ.

మర్నాడు చేసేదిలేక, రంగడు దేముడా మంటూ, ఊళ్లోకి వెళ్ళాడు. ఊరంతా తిరిగి, ఓచోట ఇల్లు కడుతూవుంటే, అక్కడ రాళ్ళ మోతకి ఒప్పుకున్నాడు.

అలవాటులేని పని చేసేసరికి వళ్ళంతా పుండయిపోయింది. నానా బాధాపడి పావలా డబ్బుల్తో ఇల్లు చేరుకున్నాడు రంగడు.

కేశవయ్య కూడా పనిలోనుంచి ఇంటికి వచ్చాడు. రంగణ్ని కేకేసి, పావలా పుచ్చుకున్నాడు. యథా ప్రకారంగా దాన్ని 'మురికిగుంట' లోకి గిరాటువేశాడు.

కానీ, ఇవాళ రంగడు చూస్తూ ఊరుకోలేదు.

"అదేమిటి నాన్నా?" అంటూ, చప్పున వెళ్ళి చెడువాసనతో నిండివున్న మురికిగుంటలో చెయ్యిపెట్టి, పావలా కాసుని బయటకు తీసి, శుభ్రంగా కడిగేడు.

"దీనికోసం ఎంతో కష్టపడితే, మురికిగుంటలో పారేస్తావా?" అని తండ్రిని నిలదీసి అడిగేడు రంగడు.

కేశవయ్య ఆనందబాష్పాలు రాల్చేడు— "నాయనా! ఇదే నీ కష్టార్జితం! తాను ఆర్జిస్తేకానీ ఎవరికీ డబ్బు విలువ తెలీదు! నువ్వు ప్రయోజకుడివి అయ్యావు!" అంటూ, కొడుకుని తనివితీరా కౌగలించుకున్నాడు కేశవయ్య! ★

గమనిక

గతవారం, 68 వ పుట (చిత్రనిర్మాణం గురించిన వ్యాసం) మూడవ కాలంలో 'దొంగరాముడు' 'తోడికోడళ్ళు' చిత్రాల నిడివికి మొదట వేసుకున్న అంచనాలకు, పూర్తిఅయినతరువాత నిడివికి తేడా, మూడు వేలూ, నాలుగు వేలు అడుగులని పొరపాటున పడింది. అది వందకి అని గమనించ కోరుతున్నాము. ★

గాయకుడు: ఏమిటిది? లేవయ్యా?

రైతు: నా పొలం చచ్చిపోతోంది బాబయ్యా! రచ్చించాలి!

గాయకుడు: నేనేం చేయగలను?

రైతు: కాదు బాబూ! మీరుపాట పాడుతే చచ్చినోళ్లు కూడ లేస్తారంట. మొన్న నదే అన్నాడండి.

* * *

[నాల్గవతరగతిలో ఓనాడు]

మాష్టారు: ఒరే రామూ! జగమంటే ఏమిటిరా?

రాము: మాయండి మాష్టారూ!

మేష్టారు: సరే! మాయంటే?

రాము: జగమండి!

మేష్టారు: ఏడిశావ్? ఎక్కడ నేర్చావురా!

రాము: దేవదాసుదగ్గరండి.

కె. సర్వలక్ష్మి, (రాజమండ్రి)

పిల్లలూ-పిల్లల తల్లులూ

(35-వ పేజీ తరువాయి)

చదువురానివాళ్ళు, అజ్ఞానులూ అలా చేస్తారేమో ననుకుంటారేమో. అన్నివిధాలా విజ్ఞానులయిన తల్లుల పిల్లలుకూడా అన్యాయముగా వుంటున్నారు. పిల్లలవి లేతమనసులు అవి సున్నితమైనవి కూడా. మృదువుగా ఎలా వంచితే అలా వంగుతాయి, చిన్న వయసులోనే. ఆ వంచేటప్పుడే చూపాలి తల్లి నేర్పరితనం! అందులోనే వుంది—ఆ బిడ్డ భావిజీవితం! ఇంగ్లీషులో ఓ సామెతకూడా వుంది. 'స్పేర్ ది రాడ్ అండ్ స్పాయిల్ ది చైల్డ్' అని! నిజమేమరి! పిల్లలను అదుపాజ్ఞలలో లేకుండా పెంచితే మరి తర్వాత వాళ్లు తయారయ్యేది మొండివాళ్ళుగానే! ఏది ఎలావున్నా భావిభారతపౌరులను తయారు చెయ్యాలి' అని ఎన్ని వుపన్యాసాలిచ్చినా, (పోనీ విన్నా) అలాంటివాళ్ళను తయారు చెయ్యడానికి తల్లులు కా[illegible] (ఎక్కువగానే పిల్లలను మంచిమార్గాలలో పెంచాలి! అంతే గాని చిన్న వయస్సులో అంతా అతి గారాబంచేసి చివరకు బిడ్డలెందుకు పనికి రాలేదే అని వాపోతే ప్రయోజనం ఏమిటి చెప్పండి?

మొదట్లోనే కాస్త జాగ్రత్తపడితే మంచిదేమో! నాలోటిగా నెవరయినా మనసులో ఇముడ్చుకోలేక ఇలాటి సలహా ఏదయినా ఇస్తే కొందరు తల్లులకు (పైన నే చెప్పినలాటి వాళ్ళకు) కోపం రావడం, వెంటనే ఘాటుగా సూటిగా, "మాకంటే ఎక్కువ మంది బిడ్డలున్నారా మీకు—మాకు సలహా ఇవ్వటానికి?" అని ఓ సవాలు విసరడంకూడ జరుగుతుందేమో! తేలుబాధ ఇలాటిదని తెలుసుకోడానికి, తెలియజెప్పడానికి ఒక్కసారి తేలుకుడితేచాలు-వందతేళ్ళు కుట్టక్కర్లేదు అందమాట్లు. ఇదంతా బిడ్డలను అతి గారాబం చేసేవాళ్ళగురించే! ★



ఈ మాసారంభంలో మద్రాసులో జానపద నృత్యప్రదర్శనలు జరిపిన రుమేనియన్ కళాకారులు

న్యూఢిల్లీ లేఖ

(5-వ పేజీ తరువాయి)

నడపటం, మోడల్ విమానాలు కట్టడం, తుపాకిమందు తయారు చేయటం నేర్చుకుంటాడు గనక నాకూ అవన్నీ వచ్చిఉంటాయేమో" అని సమాధానం చెప్పాను. కాని ఒక రచయితని పట్టుకుని నీకు చదువు ఎల్లా వచ్చిందీ అని అడగటం షాకేమీ నచ్చలేదు'

మేము సెలవు తీసుకునేటప్పటికి మూడు దాటింది.

ఆతరవాత రోజుల్లో పార్లమెంటు ఎదట శ్రీమతి కౌర్ తన పరిపాలనను ఎలా సమర్థించుకుందీ పత్రికల్లో చదువుతూ వచ్చాను.

గంగానది వరదకట్ట పథకాన్ని పార్లమెంటు ఇంతవరకూ ఆమోదించలేదని ఆమె చెప్పింది. రెండులక్షలమందికి కామెర్ల వ్యాధి సోకినతరవాత వ్యాధి ప్రమాదమైంది కాదనీ, ఆట్టేమంది చనిపోలేదని పార్లమెంటులో ప్రకటించింది! ప్రజారోగ్యానికి కేటాయించిన డబ్బంతా న్యూఢిల్లీ రోగులకే ఖర్చు చేయలేదని ఆమె చెప్పింది. వ్యాధి నిరోధానికి కావలసిన గామా గ్లోబ్యులిన్ కొనటానికి డబ్బులేదట.. ఢిల్లీలో తాము, తమ కుటుంబాలు ఉంటూ వ్యాధి ప్రమాదానికి లోనైనంత మాత్రాన ఆరోగ్య శాఖ డబ్బంతా ఢిల్లీకే ఉపయోగించాలని ఎక్కడుంది? అని శ్రీమతి అమృత్ కౌర్ ప్రశ్నించింది. ఒకవేళ ఆ డబ్బంతా ఖర్చు పెట్టినా వ్యాధిని నిరోధించడం కష్టమనీ, ఉన్న డబ్బును కాస్తా, కలకత్తాలో ఇప్పుడిప్పుడే మొదలవుతున్న కలరాను అరికట్టడానికి తాను ఉపయోగిస్తున్నానని ఆమె అన్నది. స్థానికంగా ఉన్న రోగాన్ని నిరోధించడంకోసం కలరా దేశవ్యాప్తమవుతుంటే చూస్తూ ఊరుకుంటారా అని ఆమె అడిగింది.

ఈ విధంగా ఆమె వృద్ధురాలైనా, వందలాది పార్లమెంటు సభ్యుల ఎదట వాదించి నెగ్గుకొచ్చింది. ఆ తరవాత దేశశ్రేయస్సుకు బ్రహ్మాండమైన పథకాలు తయారు చేసి ఆమె తన పని తాను చేసుకుంటూ వచ్చింది. ఈమె కనీసం డాక్టరన్నా కాదు. కేవలం రాజకుమారి. తెలివితేటలుగల వ్యక్తి. స్వాతంత్ర్యోద్యమంలో పని చేసిన వ్యక్తి. ముందు ఒక నాయకుణ్ణి అనుసరించి, తరవాత బ్రిటిష్ జైళ్ళలో ఎంతో అనుభవం, విజ్ఞానం గడించి తనే నాయకురాలైంది"


* * *

సరదాగా దేశాలు తిరిగివెళ్ళిన ఈ పాశ్చాత్యభర్తలు భారతదేశం కూడా వచ్చి పర్యటించారు గాని ఏది గంగ, ఏది యమున తెలియక తికమక పడ్డారు. ఢిల్లీ ఉన్నది యమున ఎడమగట్టున. గంగ ఢిల్లీకి 40 మైళ్ళ దూరాన ఉంది. అదీగాక ఉత్తర భారత దేశంలో వరదలు శీతాకాలానికల్లా తగ్గిపోతాయి. ఈజిప్టులో ఒకటేనది, నైలునది ఉన్నట్లు, భారత దేశంలోకూడా గంగానది ఒక్కటే ఉందని వీరు అనుకున్నారు. యూరప్‌లోమాదిరిగా ఇక్కడకూడా శీతకాలంలో వరదలు వస్తాయని వీరనుకున్నారు.

పాపం వీరు ఎంతో మెచ్చుకున్న రాజకుమారి అమృత్ కౌర్ ఈసారి మంత్రి మండలిలో లేదని తెలిస్తే చాలా బాధపడతారు. ఇప్పుడావిడ క్రికెట్ శిక్షణ ఏర్పాటు చేయడంలోను, పత్రికలకి వ్యాసాలు రాయడంలోనూ నిమగ్నురాలై ఉంది.

* * *

రాష్ట్రపతికి అంతరంగిక కార్యదర్శిని శ్రీమతి జ్ఞానవతి దర్బార్. ఈమె చిత్రముగా పైకివచ్చింది. మొదట్లో ఈమె జీతం నెలకి రూ 160. ఇప్పుడు ఆరువందలు. ఈసారి ఆమెకు 1200 జీతం కావచ్చునని తెలుస్తోంది. తన ద్వితీయ పంచవర్ష ప్రణాళికాకాలంలో ఆమె మంత్రుల జీతాలస్థాయిని అందుకోవచ్చు. కొందరు కొందరిల్లాగే పెట్టి పుడతారు మరి! ★




సినిమా

ధనార్జనకి దగ్గిర దార్లు

అయిపోయినసంవత్సరంలో చెప్పుకోదగిన విశేషాలు మూడు ఉన్నాయి.

మొదటిది: బెంగాలీ చిత్ర నిర్మాతలు, దర్శకులు అసమాన ప్రజ్ఞావిశేషంతో కూడిన చిత్రాలు నిర్మించి, ప్రపంచఖ్యాతి వార్జించారు. బాక్సాఫీసుసూత్రాలను కాలదన్ని, ధనలాభానికి ఆశించక, వ్యాపార ప్రయోజనాలను లేఖాతరుచేసి పథేర్ పాంచాలీ, అపరాజిత, కాబూలీవాలా చిత్రాలు నిర్మించి అంతర్జాతీయబహుమానాలు, సన్మానాలు ఆర్జించారు. చలనచిత్రకళలో శిఖరాగ్రాలు ఆరోహించిన ఈ చిత్రాలలో తారలులేరు. గ్లామరు లేదు. భారీ సెట్టింగులు లేవు. తలంవెర్రిపాటలులేవు. ఈ బెంగాలీలు నిజమైన కళాకారులుగా చిత్రాలు నిర్మించి భారతీయసంస్కృతికి, చలన చిత్ర కళకు అపారఖ్యాతి ఆర్జించి పెట్టారు.

రెండోవిశేషం: మొదటిదానికి పూర్తిగా భిన్నమైనది. ధనలక్ష్మి ఉపాసకులైన చిత్ర




వివాహ సమస్యలపై ఆధారపడిన చిత్రం "లాజ్‌వంతి" సెట్స్‌పై తార నర్గీస్, దర్శకనిర్మాత మోహన్ సేగాల్.

బొంబాయి సినిమాలేఖ

[[illegible]]

నిర్మాతలు కతలో మౌలికతగాని, చిత్రణంలో కొత్తదనంగాని, టెక్నికల్ విలువల్నిగాని దేన్నీ పట్టించుకోకుండా చిత్రాలు తీసి పారేశారు. దేశపు సంస్కృతిని ప్రతిబింబించేందుకు, ప్రజల విజ్ఞానాభివృద్ధికి దోహదం చేసేందుకు సినిమాలు ఉత్తమ సాధనాలనే మాట మరిచిపోయి, ఏమీ తెలియని బీదప్రజల హీనాభిరుచులను తృప్తిపరిచే చిత్రాలను వరుసగా నిర్మించారు. తామైతే బాగా లాభాలు ఆర్జించారుగాని, తమ దేశానికి, ప్రజలకు అన్యాయం చేశారు. మిస్ మేరీ, చంపాకలి ఆశా, కాత్ పుత్లీ మొదలైన చిత్రాలు బాగా దోచుకున్నాయిగాని సంస్కృతికి, కళకు లేశమైనా చేసిందిలేదు. ఈ విశేషంలో శేషం ఏమిటంటే, గుంపులు గుంపులుగా



ఈగిల్ ఫిలిమ్స్‌వారి "అజిబస్ ష్రుకియా" లో చిరకాలానంతరం మళ్లీ కనుపించనున్న గీతాబాలి.

క్రైమ్ చిత్రాలు దేశంమీదికి విరుచుకు పడ్డాయి. ఉద్రేకం కలిగించే ఈ క్రైమ్ చిత్రాలు చూస్తే పిల్లలు, పెద్దలు ఏమై పోతారో అనే ఆలోచనైనా లేకుండా ధనాశాపరులైన నిర్మాతలు ఒకదాని తర వాత ఒకటిగా వీటివి నిర్మించారు. నేరాలు చేయడంలో కొత్త మెలకువలు నేర్పడం, నేరస్థుల జీవితాల్ని అమాయకులైన ప్రేక్షకులకు నన్నిహితం చేయడం—ఇదీ ఈ చిత్రాలు చేసినపని. ధనార్జనకి దగ్గిరిదారిగా ఈ చిత్రాల్లో అడ్డమైన బాణీల్ని అడ్డదిడ్డంగా కలిపి సంకరసంగీతం తయారుచేసి, వెర్రి మొర్రి నృత్యాల్ని, అందమైన హీరోయిన్లనీ చూపించి డబ్బుచేసుకున్నారు. గత సంవత్సరాన్ని భారతీయ చలనచిత్ర చరిత్రలో "నేరాల సంవత్సరం" అని వర్ణిస్తే అతిశయోక్తికాదు.

మూడో విశేషం: గత సంవత్సరంలో అగ్రతారల రేట్లు తారాజువ్వలవలె ఆకాశాన్నంటాయి. పురుషతార లిద్దరు చిత్రానికి మూడేసి లక్షల చొప్పున గుంజుకున్నారు. దీనిలో ఎక్కువభాగం చాటుగా ఇచ్చినదే. చిత్ర పరిశ్రమకు ఆత్మహత్యా సదృశమైన ఈ "బ్లాక్" పద్ధతికి ముఖ్యకారకులు దక్షిణాది నిర్మాతలే. చక్కని సాంకేతిక విలువలు, చిక్కనికథా, స్వయం ప్రతిభా ఏమీలేకుండా దక్షిణాది నిర్మాతలు ఉత్తరాది తారలు ఎంత కోరితే అంతా గుమ్మరించారు. కృత్రిమంగా వారిరేట్లను పెంచేశారు. షూటింగ్ సమయంలో తారలు ఏదడిగితే అదల్లా తీసుకొచ్చి సమర్పించి అలుసిచ్చారు. మద్రాసుకు షూటింగ్‌కి వెళ్లినప్పుడు బొంబాయి తారలు కొండమీది కోతిని సహితం, అడగడం తరువాయిగా తమదగ్గిరికి రప్పించుకున్నారు. దీంతో తారలు కాని చిల్లర నటులు కూడా కొండెక్కి కూర్చున్నారు. దక్షిణాది నిర్మాతలు రెండు చేతులా లాభాలు పోగేసుకున్నమాట నిజమే గాని, తారలరేట్లు పెంచివేయడం వారి గౌరవాన్ని పెంచేదిగా లేదు. "చంద్రలేఖ" దగ్గిర్నించి "భాభీ" దాకా ఇదే వరస. దక్షిణాదిన నిర్మితమైన ఏ హిందీ చిత్రమూ మెచ్చదగ్గ స్థాయిలో లేదు. దక్షిణాది నిర్మాతలు బాగా డబ్బిచ్చి తెచ్చుకున్న తారలు లెందే రాణించరనీ, దర్శకులు తారలను డైరెక్టు చేసేబదులు, తారలే దర్శకులను డైరెక్టు చేస్తారనీ హిందీ చిత్రసీమలో మంచీ చెడ్డా తెలిసినవారు అంటున్నారు.

ఇవన్నీ శోచనీయంగా వున్నా 1957 వ సంవత్సరమంతా ఇంత అధ్వాన్నంగా ఉందనటానికి వీల్లేదు. కమ్యూనిటీ ప్రాజక్టుల మీద ఆధారపడిన కథతో బి. ఆర్. చోప్రా నిర్మించిన "నయాదౌర్," శాంతారాం చిత్రం "దోఆంఖే బారాహాథ్", ఎ. వి. ఎమ్. వారి "హంపంచీ ఏక్ దాల్ కే", రాజ్ కపూర్ చిత్రం "అబ్ దిల్లీ దూర్ నహీ" మొదలైన చిత్రాలు వినోద దాయకంగాను, విజ్ఞాన దాయకంగాను కూడా ఉన్నాయి. భారతీయ చలనచిత్రకళ అభివృద్ధికి యివి దోహదం చేశాయని కూడా చెప్పవచ్చు. ఈసారి అంతర్జాతీయ చలన చిత్రోత్సవాల్లో ఎక్కడైనా వీటిల్లో దేనికోదానికి బహుమానం లభించినా లభించవచ్చు. వీటన్నిటిలో కళాత్మకంగా, ప్రయోజనాత్మకంగా ఉన్న చిత్రం మెహబూబ్ నిర్మించిన "మదర్ ఇండియా." ఇది ఎక్కడా చవకబారుతనం లేకుండానే ప్రతిరోజూ ప్రతి ఆటకి జనాన్ని దిట్టంగా ఆకర్షిస్తూ దేశంలోని ముఖ్య కేంద్రాల్లో రజతోత్సవాలు కూడా

★ బొంబాయి సినిమాలేఖ ★

చేసుకునేట్లు కనిపిస్తోంది. అమెరికన్ చలన చిత్ర సంఘం విదేశీయ చిత్రాలకిచ్చే ఆస్కార్ బహుమతికి ఈ చిత్రాన్ని పోటీకి పంపించాలని భారత ఫిలింఫెడరేషను నిశ్చయించింది.

గత సంవత్సరంలో చెప్పుకోదగిన మరొక చిత్రం "పరదేశి". భారత సోవియట్ నిర్మాతలు సంయుక్తంగా రంగులలో నిర్మించిన ఈ చిత్రంలో ఉభయదేశాల నటీనటులూ పాల్గొన్నారు. కొంత రష్యన్ ప్రచారం ఉండడంవల్ల ఈ చిత్రం సాధారణ భారతీయ ప్రేక్షకుడికి అట్టే నచ్చక పోవచ్చుగాని, కలర్ ఫొటోగ్రఫీలోను, ఉత్తమ సాంకేతిక విలువల్లోను ఇది నిరుపమానంగా ఉంది.

గత సంవత్సరంలో హాలీవుడ్ నుంచి కొందరు గ్లామరస్ తారలు బొంబాయివచ్చారు. వీరిలో అవా గార్డ్నర్, జెనిఫర్ జోన్స్ పత్రికాప్రతినిధులను గాని, అభిమానుల్ని గాని కలుసుకోడానికి నిరాకరించారు. స్టూవర్టు గ్రేంజర్, బార్బారారష్ మాత్రం భారతీయ విలేఖరులతోను, అభిమానులతోను స్వేచ్ఛగా కలిసి మెలిసి మాట్లాడారు. వీరిరువురూ ఇప్పుడు మైసూర్‌లోని బందీపూర్ అడవుల్లో ఒకచిత్రం షూటింగ్‌లో పాల్గొంటున్నారు. "హారీ బ్లాక్" అనే ఆచిత్రాన్ని లార్డ్ బ్రాబర్న్ నిర్మిస్తున్నారు.

వీరుకాక, సింహళంనుంచి అగ్రగాయని రుక్మిణీదేవి, హాస్యనటుడైన ఆమె భర్త, జయరామ్ బొంబాయి వచ్చారు.


80 ఏళ్ల యువతి ఉషాకిరణ్ గత సంవత్సరంలో మొదటిసారిగా తల్లి అయినది. అది ఆమెకు సంతోషకరమైన సంఘటనేగాని, ఆమె సినిమా ఛాన్సులు దీనివల్ల దెబ్బతిన్నాయి.

నిరుడు జరిగిన విషాద సంఘటనలలో ఒకటి — మధుబాలపై "నయాదౌర్" నిర్మాతలు కేసుపెట్టడం. మధుబాలకు మిత్రుడని అనుకుంటున్న దిలీప్‌కుమార్ ఈ కేసులో స్వయంగా మధుబాలకు వ్యతిరేక సాక్ష్యం ఇచ్చాడు. దీనితో వీరిద్దరి మైత్రి చెడినట్లే. అయిదేళ్లనించీ నిర్మాణంలో ఉన్న "మొఘల్-ఇ-ఆజమ్" పూర్తి అయితే, ఇక వీరు ఏ చిత్రంలోనూ కలిసి నటించడమంటూ ఉండదు.

గత సంవత్సరంలో ఇలా వేరుపడిన మరోజంట రాజ్‌కపూర్, నర్గీస్. వీరు కూడా ఇక కలిసినటించే అవకాశం లేదు.

నటనలో గత సంవత్సరం అగ్రతాంబూలాలు అందుకున్న తార "మదర్ ఇండియా"లో నర్గీస్. మగతారలలో మంచి నటులుగా 'నయాదౌర్'లో దిలీప్‌కుమార్‌ని, 'పేయింగ్ గెస్ట్'లో దేవానంద్‌ని పేర్కొనాలి. సంగీత దర్శకులలో నౌషద్ "మదర్ ఇండియా"కు ఇచ్చిన సాదా సంగీతంతో కొంత వెనకపడ్డాడు. 'నయాదౌర్'తో ఓ. పి. నయ్యర్, ప్యాసా, నౌదోగ్యారా, పేయింగ్ గెస్టులతో ఎస్. డి. బర్మన్ ప్రశంసలు చూరగొన్నారు.

నటులలో రాజ్‌కపూర్, దిలీప్‌కుమార్



మద్రాసు మెడికల్ కాలేజి వైస్ ప్రిన్సిపాల్ డా॥ టి. జనార్దనం కుమార్తెలు గీత, జయంతి ఈనెల 7 వ తేదీన అన్నామలై మందిరంలో చేసిన భరతనాట్య ప్రదర్శనం.



బొంబాయిలో విజయవంతమైన "ఉస్తాద్" చిత్రంలో అశోక్‌కుమార్, అంజలీదేవి.

అశోక్‌కుమార్ తమ ... ప్రతిష్ఠలు నిలుపు కొన్నారు. దేవ్ ఆ... ...డా గతి సంవత్సరంలో ఇతోధికకీ ...తించాడు.

వైజయంతీమాల, ... ని హిందీచిత్రాల్లో కూడా నటిస్తూ పేరు ...సంపాదించిన మాట వాస్తవమేగాని వీరిపేరు ఎక్కువగా నృత్యకౌశలంమీద ఆధారపడినది. అగ్రతారలందరూ ఎప్పుడూ తీరికలేని పని ఒత్తిడిలో ఉండడం మూలంగా, కమలాలక్ష్మణ్, అనితాగుహా, మాలాసిన్హా, కామినీకదమ్ మొదలైన వారు పైకి వస్తున్నారు.

కథా విషయికంగాను, కళావిషయికంగానూ, కొత్త సంవత్సరంకూడా గడచిన సంవత్సరంలాగానే ఉండబోతోందిగాని పెద్దతేడా ఏమీ లేదు. నిర్మాతలకు విదేశీ చిత్రాల కథలమీదా, 'మూస'లో పోసిన చిత్రాలమీదా మోజుతగ్గలేదు. చిత్ర నిర్మాణంలో కొత్త పద్ధతులనుసరించే సూచన ఎక్కడా కానరావడం లేదు. ఒకటిమాత్రం నిజం. కొత్త తారలను తెచ్చుకొందె పని జరిగేట్టు లేదు. ఇప్పటి "స్టార్ సిస్టం"లో చిత్ర నిర్మాణం బొత్తిగా లాభసాటి

ఈ సంవత్సరం రాబోయే చిత్రాల్లో ముఖ్యమైనవి:

అమర్ దీప్:-దేవానంద్, వైజయంతీమాల, పద్మిని నటిస్తున్నారు. సంగీతం సి. రామచంద్ర; నిర్మాత శివాజీ గణేశన్.

రాజ్ తిలక్:-వైజయంతిమాల, పద్మిని నటిస్తున్నారు; సంగీతం సి. రామచంద్ర; దర్శకుడు, నిర్మాత ఎస్. ఎస్. వాసన్.

ఫాగున్:—మధుబాల, భరత్ భూషణ్ నటిస్తున్నారు. సంగీతం : ఓ. పి. నయ్యార్.

సోనీమహీవాల్:—నిమ్మి, భరత్ భూషణ్ తారలు. నౌషద్ సంగీతం.

మైంసాహా మేహూం:—హీరో రాజ్ కపూర్.

కోహినూర్:— దిలీప్‌కుమార్, మీనాకుమారి నటిస్తున్నారు. సంగీతం శంకర్, జైకిషన్.

యాహూదీ:—సొహ్రాబ్ మోడీ, దిలీప్ కుమార్, మీనాకుమారి నటిస్తున్నారు. సంగీతం ఓ. పి. నయ్యార్.

లాజ్ వంతి:—నర్గీస్, బల్‌రాజ్ సాహ్నీ

మంజిల్:—దేవానంద్, నూతన్. సంగీతం ఎస్. డి. బర్మన్.

మధుమతి:—నిర్మాత బిమల్ రాయ్. తారలు దిలీప్‌కుమార్, వైజయంతిమాల. ★

సత్యజిత్‌రాయ్‌కి సౌరసన్మానం

'పథేర్ పాంచాలీ,' 'అపరాజిత' చిత్రాల

దర్శకుడు సత్యజిత్ రాయ్‌కి ఈనెల 4వ తేదీన కలకత్తాలో పౌరసన్మానం జరిగింది. మేయర్ డా॥ త్రిగుణసేన్ సన్మానపత్రం సమర్పించారు. ఒక చిత్ర దర్శకునికి కలకత్తాలో పౌరసన్మానం జరగటం ఇదే మొదటి సారి.

గత సంవత్సరపు మొదటి పది ఉత్తమ చిత్రాలను ఎన్నుకునే సందర్భంలో బ్రిటిషు విమర్శకులు పలువురు 'పథేర్ పాంచాలీ' ని తమ జాబితాలో చేర్చారు. ఈ విమర్శకుల్లో అబ్జర్వర్, డెయిలీ టెలిగ్రాఫ్, రేనాల్డ్స న్యూస్ పత్రికల విమర్శకులు ఉన్నారు. సన్ డే "టైమ్స్" పత్రిక ఈ చిత్రాన్ని 1956 సం॥పు ఉత్తమ చిత్రాల్లో కిందకేసే

చిత్ర సమీక్ష:

★ ఎత్తుకు పైఎత్తు ★

“ఆశ్వరథశరథ!” అంటూ కళ్ళు పెద్దవి చేసి ముక్కు ఎగరేసి, ఒళ్ళంతా ఝుళిపిస్తాడు. కోటప్ప కొండను ప్రతిష్ఠించిన గుమ్మడి, ‘ఆవేశం’ వేషం వేసుకుని. అతనికి పోటీగా అంతటి ఆవేశంతో సి. ఎస్. ఆర్. ఆవనుక ముక్కుపుటాలు పౌరుషంతో పూరించి వల్లం నరసింహారావు, కొంచెం ప్రసన్నంగా బాలయ్య, ఇంకా రేలంగి, లక్ష్మీరాజ్యం అండ్ కంపెనీవారంతా, ఘంటసాల, జిక్కి, సుశీలల కంఠాలతో ఒళ్ళు ఝల్లుమనేలా పాట అందుకుంటారు.

ఈ సన్నివేశంతో ఆరంభమైన ‘ఎత్తుకు పైఎత్తు’ చిత్రకథ యావత్తూ, ఇలాగే అత్యంత చైతన్యవంతంగా, ఎంతో సంరంభంతో పద్దెనిమిదివేల అడుగులూ ఝుమ్మని పరుగెడుతుంది. ఈ సంరంభాన్ని పోషించినది, భేరీతూర్య నాదాలధ్వని కాదు. చిన్న, పెద్ద నటీనటుల, దర్శకుని, రచయితల ఉత్సాహం. 1958, ఈ చిత్రంతో ఆరంభం కావడంకూడా ముదావహం. ‘సారథీ స్టుడియోస్’ పేరిట రామకృష్ణప్రసాదుగారు నిర్మించిన ఈ తొలిచిత్రం, ఈ ఏటికి తొలి తెలుగు కానుక.

అందమైన రాజకీయ నీతికథను (రచయిత నాగార్జున్) తీసుకొని, దానికి అందమైన ప్రహసనం ఛాయలలో రూపకల్పన చేసి, అందుకు తగినస్థాయిలో సంభాషణలూ (తాపీ, కొండేపూడి, చిరంజీవి) హుషారైన పాటలూ (కొసరాజు, తాపీ; సంగీతం వేణు) నృత్యాలూ (జగన్నాథశర్మ) సమకూర్చి ముత్యంమీద అందం చెడకుండా, హాస్యం వికటించకుండా దర్శకుడు చాణక్య దీన్ని తెరమీద చిత్రించారు. వాస్తవప్రపంచంలో సాధ్యాసాధ్యాలకూ ఉండే ఈ కథకు చుట్టరికం గురించి బెంగెట్టుకో నక్కరలేదు. ఈ పిట్టకథ, చిట్టచివర, చిన్న సైజు నీతిని ప్రబోధించినా మొదటినుండి చివరదాకా చిత్రించిన సన్నివేశాలూ, చూపించిన ఆహ్లాదకరమైన పాత్రలూ, చేసిన ఈ వ్యాఖ్యానాలూ మాత్రమే ముఖ్యం. అవే మనసుకు హత్తుకుంటాయి.

అనగనగా ఇద్దరు పెద్దమనుషులు. ఇద్దరి కిద్దరూ కాలాంతక నరాంతకులు. పరమ [illegible] టోకరాసురులు. ఒకడి పేరు దుష్టుడు గో[illegible] దయ్య, రెండవవాడు డి. కైలాసం ఇద్ద[illegible] ముందర విడివిడిగా లోకంసెత్తిన జె[illegible] పెట్టి, ఊరిసొత్తు కాజేయజూస్తూ, [illegible] ఉంటారు. ఇలా కొన్ని రీళ్ళపాటు కథ తి[illegible] సరికి ఊరివాళ్ళు కళ్ళుతెరిచి, ఐకమత్య[illegible] అర్జెంటుగా కావాలన్న పరమసత్యాన్ని గ్రహిస్తారు. అప్పుడు, వీళ్ళను ఎదుర్కొన



ఎ. వి. ఎమ్. వారి “భూకైలాస్”లో కలహాభోజనుడు నారదుడుగా ఎ. నాగేశ్వరరావు, మహిరావణుడుగా ఎన్. టి. రామారావు, బి. సరోజాదేవి.

డానికి, ఆ గృహస్థులకు కూడా ఐక్యత అవసరమై, ఇద్దరూ జాయింటయిపోయి పుంజుకొంటారు. అపుడు డి. గోవిందయ్య మేనల్లుడు రాజా, అంతవరకూ, దుష్టులకూ, శిష్టులకు మధ్య అటూ ఇటూగా ఉన్న ఉభయచరుడు ఓచ్చాలూ, నీటిగా నీతిగా బతికే అతని పెళ్లాంబిడ్డలూ అందరూ కలసి, ఆ వంచకులను వంచనతోనే ఓడించి, సినిమానీతిని ఋజువుచేస్తారు. స్థూలంగా ఇదీ ఏర్పాటు. ఇందులో దుష్టుడు గోవిందయ్యగా గుమ్మడి ఇటీవలి తన చిత్రాలన్నిటినీ మించినస్థాయి నటన ప్రదర్శించాడు. లోపాలపాలు ఏ మాత్రం లేని ఈ పాత్రను చిత్రించడంలో గుమ్మడి, సముద్రాల పనివాడితనాన్ని చూసి దీనికి నిండుతనం చేకూర్చాడు. రెండవదుష్టుడు కైలాసం పాత్ర ఇందుకు భిన్నమైనది. ఈ పాత్ర వేషభాషలలో సున్నితమైన హాస్యం, చక్కని వ్యంగ్యం ఉన్నాయి. దీనికి సి. ఎస్. ఆర్. ను ఒప్పించడమే, దర్శక రచయితల దక్షతకు నిదర్శనం. ఆయన దీనిని అతిరమణీయంగా నటించాడు. ఎత్తుకు పైయెత్తువేసిన కథానాయకుడు బాలయ్య '[illegible] ఆదర్శ యువకుడు'గా నటించాడు. నాలుగింట మూడు వంతులు ఈ పాత్ర మాటలూ, చేష్టలూ క్రమ పరిణామం నమ్మతగ్గవిధంగానే సాగినా, చివర కథనుబట్టి 'ఆదర్శ ప్రాయుల మార్గం'లో పడకతప్పలేదు. ఉన్నంతలో, బాలయ్య మటుకు దీనిని మెచ్చుతగ నిగ్రహంతో మితితప్పక నటించాడు. సమర్థుడి లక్షణాలుగల కొత్త నటుడిని పరిచయంచేసిన దర్శక నిర్మాతలు అభినందనీయులు. ఇతర నటులలో రేలంగి ఒక్కడికే అభిమానపాత్రం కాగల పాత్రను హాయిగా నటించినా, అతని ప్రజ్ఞకు ఈ పాత్ర అవకాశాలు చాలనిపించింది. జానకి, లక్ష్మీరాజ్యం, నాగయ్య, వల్లం నరసింహారావు, బొడ్డపాటి, హేమలత, కుమారి పార్వతి, బాల, సుబ్రహ్మణ్యం, ఛాయాదేవి మొదలగువారంతా యథోచితంగా నటించారు.

ఈ చిత్రంలో ప్రత్యేకం చెప్పుకోతగ్గ చక్కని చిన్నకథ ఒకటి ఉంది. అది తగవులాడుకున్న ఆలుమగలకథ. డి. గోవిందయ్య డి. కైలాసం, వీళ్ళ నివాసంలో జొరబడి [illegible], వాళ్ళని రెచ్చగొట్టి, రచ్చకీడ్చి కోర్టులచుట్టూతిప్పి ఆస్తిని చెరిసగం కాజేస్తారు. చివరకి ఆ ఇద్దరూ బుద్ధితెచ్చుకొని మళ్ళీ కయ్యాలాడుకుంటూనే కలిసిపోతారు. చక్కని ఈ చిన్నకథను, అసలు కథలో సన్నివేశాల, పాత్రల మాటున పొదిగి, చెప్పకుండా చెప్పినట్లుగా తెరమీద మనోహరముగా చిత్రించిన దర్శక రచయితలు ప్రత్యేకంగా అభినందనీయులు. ఇంతకీ ఈ మొగుడు పెళ్ళాలు కలసి కనబడేది ఒక్క సన్నివేశంలోనే. పెరుమాళ్ళు, కొత్త నటి నిర్మలాదేవి అక్కడ ప్రదర్శించిన నటన అనేక ప్రణయఘట్టాలను మించిన స్థాయిలో వుంది. అదే, మనకు తెరమీద కనబడని కథ చెప్పకుండా చెప్పింది...

వేదాంతం జగన్నాథ శర్మ నృత్యాలూ, వేణు పాటలూ, కథనానికి అడ్డురాని విధాన అమరాయి. హుషారుగా ఉన్నాయి. అందమైన చందమామనుగురించి మామూలుగా సినిమా నాయికలు పాడేపాట ఒకటి చాలా బాగుంది. సుశీల ఆ పాటను పాడింది. ఈ పాటను విన్న చంద్రుడు, ముగ్ధుడైపోయి, ఆ సెట్ మీదకు అన్ని వేపులనుండీ, మెత్తని చిక్కని వెన్నెలను సరఫరా చేశాడు.

ఈ చిత్రం ఇంత హుషారుగా ఉండడానికి మరొక కారణం కూడా ఉందనిపిస్తుంది. పాత్రధారులు తమ ఉత్సాహాన్ని, కష్టసుఖాలనూ, ప్రేక్షకులతో పంచుకున్నారు. వాళ్ళ వాళ్ళ సమస్యలను వివరించినా, అభిప్రాయాలు వెల్లడించినా, కష్టసుఖాలు చెప్పుకున్నా, సాధారణంగా మీవేపే తిరిగి మీకే చెప్పుకుంటారు. ఐదారుగురు కలిసి ఉన్నపుడు కూడా, స్టేజిమీద 'ఎన్‌కోర్'కు వచ్చి అభినందనలు అందుకుంటున్న నటబృందంలా వరసన నిలబడి, ఒక్కొక్కరు మంచీ చెడ్డా మీతోనే చెబుతారు. జవాబులు మీ రివ్వనక్కరలేదు. వాళ్ళ పక్కవాళ్లే సప్లయి చేస్తారు. ★

★ ఒమార్ ఖయ్యాం ★

[చిత్ర సమీక్ష]

పరలోకచింతన పరమేశ్వరుడికే వదిలేసి ఇహానించీ ఇహలోకజీవితాన్నే అనుభవించి, ఆనందించమన్నాడు పర్షియన్‌కవి ఒమార్ ఖయ్యాం. పారమౌంట్ కంపెనీ నిర్మించిన "ఒమార్ ఖయ్యాం" (మద్రాసు, ఓడియన్ టాకీసులో విడుదల) చూస్తుంటే, పరలోకాన్నే కాదు, కాసేపు ఒమార్ ఖయ్యామును కూడా మరిచిపోయి కాలక్షేపం చెయ్యవచ్చు. సగందాకా చూశాక, పొరబాటున ఇంకో సినిమాకి రాలేదుగదా అనిపించవచ్చు.

ఎందుకంటే ఒమార్ ఖయ్యాం అనగానే సాత్వికుడు, తాత్వికుడు అయిన కవి జ్ఞాపకం వస్తాడు. ఇతడి జీవితచరిత్రగూర్చి ఎవరికీ గట్టిగా తెలియదు. తన కాలంలో ప్రచారంలోఉన్న సూఫీమతాన్ని వేళాకోళం చేస్తూనే, సూఫీ పరిభాషను (సాకీ, మధువు) తీసుకుని వేరే అర్థంలో తన కవిత్వంలో వాడుకున్నాడు. మరణానంతరజీవితాన్ని గూర్చి బెంగెట్టుకోకుండా, క్షణభంగురమైన ఈజీవితాన్నే ఆనందమయం చేసుకోమని కవిత్వం చెప్పాడు. జ్యోతిశ్శాస్త్రంలోను, గణితంలోను కొంత పరిశ్రమచేసి శిష్యులకు విద్యచెబుతూ ఉబుసుపోకకు తన వేదాంతాన్ని రుబాయీలరూపంలో చెప్పేవాడని అంటారు.

పారమౌంట్ వారి చిత్రంలో ఈ ఒమార్ ఖయ్యాంబదులు, సాధారణ 'స్టంటుహీరో'లాగ వేషం వేసుకుని, కవిత్వం చెప్పడమూ, రాజకీయ కుట్రదారుల్ని 'డిటెక్షన్' చెయ్యడమూ తేల్చుకోకుండా తికమకపడుతున్న కార్నెల్ వైల్డ్ కనిపిస్తాడు: అక్కడక్కడ అతడు పద్యాలు చదివినమాట నిజమే. ఒకసారి పర్షియన్‌రాజు ఎదట భాషిం వట్టు వేసుకు మూర్ఛని గారడీ చేస్తున్నవాడిలాగ మొహంపెట్టి రుబాయీలు (ఫిట్జిగెరాల్డుతర్జుమాలో) చదువుతాడు. ఇంకోసారి తొందరపనిమీద ఎక్కడికో వెళిపోతూ ప్రియురాల్ని చూసిపోదామని గోడదూకి వెళ్ళి ఓ పద్యం చదివేస్తాడు. సినిమాఆఖర్లో మబ్బుల్లో మధుపాత్రతో సహా నుంచుని మరోపద్యం చదువుతాడు. ఈ పద్యాల్ని భారీ సెట్సు మాదిరిగానే అలంకారార్థం వాడుకున్నట్టు కనిపిస్తుంది.

అనగనగా ఒక పర్షియా దేశంతో కథ ప్రారంభమై, పర్షియన్ షా పట్ల విధేయతగల ఒమార్ ఖయ్యాం అనేవాడు రాజ్యం కాజేయాలనే కుట్రదారుల్ని ఎలా నాశనం చేసిందీ చూపించడంతో కథ ముగుస్తుంది. ఈలోగా అతడు ఓ అందమైన అమ్మాయిని ప్రేమిస్తాడు. ఆఅమ్మాయిని షా పెళ్ళిచేసుకోవడంతో ఒమార్ హృదయంభగ్నమవుతుంది. చివరికి కథకి అనుకూలముగా షా చనిపోతాడు. అమ్మాయి ఒమార్ కిదక్కుతుంది. మిగతా టైములో అతడు ఏవోపరికరాలు పెట్టుకొని ఆకాశాన్ని పవర్ ఫుల్‌గా పరిశోధిస్తూ ఏవో లెక్కలు వేస్తూ పంచాంగం తయారు చెయ్యడమూ, ఒక అందమైన బానిసపిల్లని విడిపించడమూ వగయిరాలు జరుగుతాయి. ఆఖరికి క్లయిమాక్సు ఘట్టంలో ఒక కొండశిఖరాన వున్న శత్రువుల కోటను టెక్నికలర్ ఫోటోగ్రఫీ సహాయంతో అందంగా ధ్వంసం చేస్తాడు. మిలిటరీ సైన్సు కూడా ఇతడికి కరతలామలకం అని దీనివల్ల వ్యక్తమవుతుంది. కొండఅడుగున సొరంగం తవ్వించి అక్కడున్న నూనె ఊటలకు నిప్పంటించి మొత్తం కోటనీ, కొండనీ పేల్చివేస్తాడు. ఇదంతా ఏ చరిత్రలో ఉందో తెలియదుగాని, ఉంటే

'ఇల్లరికం'

ప్రసాద్ ఆర్ట్ పిక్చర్స్ వారి సాంఘిక చిత్రం 'ఇల్లరికం' తాతినేని ప్రకాశరావు దర్శకత్వాన చురుకుగా తయారవుతోంది. ఈ చిత్రానికి సదాశివబ్రహ్మం కథ వ్రాశారు. మాటలు ఆరుద్ర, పాటలు ఆరుద్ర, కొసరాజు వ్రాస్తున్నారు. సంగీతదర్శకుడు చలపతిరావు.

నాగేశ్వరరావు, జమున, గిరిజ, రేలంగి, రమణారెడ్డి, గుమ్మడి మొదలగువారు నటిస్తున్నారు. ★

'వాహినీ' కి అతిథివాహిని

రాచకార్యాలమీద, సాంతికార్యాలమీద మద్రాసునగరానికి వచ్చే దేశీయులు, విదేశీయులు మాన్యులైనా సామాన్యులైనా వాహినీ స్టూడియో చూడబోవటం పరిపాటి. ఈ మధ్య మద్రాసు వచ్చిన చెకొస్లొవాకియా ప్రధాని విలియం సిరోకీ వాహినీ స్టూడియో దర్శించారు. స్టూడియోలో వివిధభాగాలు చూపించిన తరవాత స్టూడియో అధినేతలు ఆయనకు విజయా గార్డెన్స్‌లో ఆతిథ్యం ఇచ్చారు. గోపీనాథ్ బృందం నాట్యప్రదర్శనం చేశారు. చెక్ ప్రధాని సుమారు రెండు గంటలసేపు స్టూడియోలో ఉన్నారు.

అంతకు కొన్ని రోజుల ముందు మద్రాసులో జరిగిన 45వ భారతీయ సైన్సు కాంగ్రెసుకు హాజరైన దేశీయ, విదేశీయ శాస్త్రజ్ఞులకు కూడా వాహినీలో అతిథి సత్కారం జరిగింది. ★



గంగాగౌరి సంవాదం" లో జానకి.

హిందీ సంగీత దర్శకులు

గడచిన సంవత్సరం మొత్తం 99 హిందీ చిత్రాలు విడుదల అయ్యాయి. వీటిల్లో సుమారు 43 మంది సంగీత దర్శకులు (జంట దర్శకుల్ని ఒకరికింద లెక్కపెడుతుంటే) పనిచేశారు. వీరిలో 21 మంది ఒక్కొక్క చిత్రానికి పనిచేశారు. అగ్రశ్రేణి దర్శకుడు నౌషద్ కూడా ఒక చిత్రానికే సంగీతం ఇచ్చాడు. రెండేసి చిత్రాలకు పనిచేసినవారు 10 మంది ఉన్నారు. ఈ పదిమందిలో శంకర్ జై కిషన్ జంట ఒకటి. మూడేసి చిత్రాలకు పనిచేసినవారు ముగ్గురే. వీరిలో అనిల్ బిశ్వాస్ ఒకాయన. నాలుగేసి చిత్రాలకు సంగీతం ఇచ్చినవారు నలుగురు. వీరిలో సి. రామచంద్ర, సలిల్ చౌధురి, ఎస్. ఎన్. త్రిపాఠి, ఎస్. డి. బర్మన్ ఉన్నారు. అయిదేసి చిత్రాలకు పనిచేసినవారు ఇద్దరే. వీరు చిత్రగుప్త, మదన్ మోహన్. ఆరు చిత్రాలకు పనిచేసిన సంగీత దర్శకుడు అవినాశ్ వ్యాస్. హేమంత్ కుమార్ 8 చిత్రాలకు, ఓ. పి. నయ్యార్ 9 చిత్రాలకు సంగీతదర్శకత్వం వహించారు.

అంటే బహుళ ప్రజాభిమానం పొంది బాగా డిమాండులో ఉన్న సంగీత దర్శకుల్లో ముందు ఓ. పి. నయ్యార్‌నీ, తరవాత హేమంతకుమార్‌నీ చెప్పుకోవాలన్న మాట. ★

ర్షియాలో పెట్రోలియం దొరుకుతుందని కనిపెట్టిన ఖ్యాతికూడా ఖయ్యాంకే దక్కుతుంది.

విలియం డీటర్లీ డైరెక్టు చేసిన చిత్రంలో కార్నెల్ వైల్డు, డెబ్రాపేజెట్ కాక మైకేల్ రెని, జాన్ డెరిక్, రేమండ్ మేసీ మొదలైనవారు నటించారు. హాలీవుడ్ చిత్రం గనక సహజంగా చిత్రనిర్మాణం, ఛాయాగ్రహణం బ్రహ్మాండంగా ఉన్నాయి. ★


చిత్రాల ఎగుమతివల్ల విదేశీద్రవ్య సంపాదన

గతడు మొదటి 8 నెలలలోనూ మనదేశం నుంచి ఒకకోటీ 54 లక్షల అడుగుల మొత్తం నిడివిగలచిత్రాలు ఎగుమతి అయ్యాయి. దీనివల్ల మొత్తం 72 లక్షల 45 వేల రూ. విదేశీ ద్రవ్యం మనకు లభ్యమైంది.

సింహళం, సింగపూరు, ఇరాన్, ఇండొనీషియా, థాయ్ లాండ్, ఏడెన్, బ్రిటన్, నేపాల్, బర్మా, పాకిస్థాన్, అఫ్ఘనిస్తాన్, సూడాన్, కంబోడియా, ట్రినిడాడ్, కెన్యా, రష్యా, చెకొస్లొవాకియా, ఫ్రాన్సు, అమెరికా మొదలైన 50 దేశాలకు భారతీయ చిత్రాలు ఎగుమతి అయ్యాయి.

ఆ ఎనిమిది నెలల్లోనూ భారతదేశం 98 లక్షల 62 వేల అడుగుల నిడివి చిత్రాలు దిగుమతి చేసుకుంది. వీటివల్ల 27 లక్షల 85 వేల రూ. ల ద్రవ్యం ఇతరదేశాలకు పోయింది. ★

Printed and Published for Nageswara Rao Estates (Private) Ltd., by S. Radha Krishna at



బేలూరు శిల్పం

ఫొటో : జి. రామమూర్తి.

Rged. No. M.4479. Andhra Patrika Illustrated Weekly

*